PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 196 | విజయవాడ, సోమవారం 17 ఫిబ్రవరి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 17 February 2025 | Rs

ఎఫ్ఎంఆర్ఎఐ నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కృష్ణానంద్, పార్థరక్షిత్
- ఘనంగా ఎఫ్ఎంఆర్ఎఐ 27వ అఖిల భారత మహాసభ

7

షెడ్యూల్ వచ్చేసింది


- ఈడెన్ గార్డెన్స్‌లో ఐపిఎల్ తొలి, ఫైనల్ మ్యాచ్
- క్వాలిఫయర్1, ఎలిమినేటర్‌కు హైదరాబాద్ ఆతిథ్యం
- ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 షెడ్యూల్ విడుదల



8

జిబిఎస్‌తో మహిళ మృతి

గుంటూరు జనరల్ ఆసుపత్రిలో నమోదు



ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి, కొమరోలు

గులియన్ బారే సిండ్రోమ్ (జిబిఎస్)తో బాధపడుతూ గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బి.కమలమ్మ (60) ఆదివారం సాయంత్రం మరణించారు. తీవ్రమైన జ్వరం, కాళ్లు చచ్చుపడిపోవడంతో ఆమెను ప్రకాశం జిల్లా కొమరోలు మండలం అలసందలపల్లి నుంచి కుటుంబసభ్యులు ఈ నెల 3న తీసుకొచ్చి గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. కొద్ది రోజులుగా వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న కమలమ్మ పరిస్థితి విషమించి మృతి చెందారు. రెండుసార్లు కార్డియాక్ అరెస్టు అవడంతో ఆమె మరణించారని వైద్యులు ప్రకటించారు. జిబిఎస్‌తో తొలి మరణంగా అధికారులు ధ్రువీకరించారు. గత మూడు రోజుల్లో కొత్తగా ఏడు కేసులు రావడంతో కలకలం రేగింది. వారిలో ఐదుగురు డిశ్చార్జి అయ్యారు. చికిత్స పొందుతున్న ఇద్దరిలో షేక్ రమీజాన్ (44) మహిళ వెంటిలేటర్‌పై ఉన్నారు. మరొకరు జనరల్ వార్డులో చకిత్స పొందుతున్నారు. ఈ నెల 3న ఆస్పత్రిలో చేరిన కమ్మలమ్మ మృతితో ప్రభుత్వాస్పత్రిలో కలకలం రేగింది. వ్యాధి నివారణకు, బాధితులకు మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి పి.సత్యకుమార్ ప్రకటించినా కమలమ్మ మృతి చెందడం, మరొకరి పరిస్థితి విషమంగా ఉండడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఈ వైరస్ సోకిన వారు పక్షవాతం వస్తుండడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నరాలు చచ్చుబడిపోవడం, రక్తహీనత సమస్య కూడా తీవ్రంగా ఉంటోంది. ఎక్కువమందికి ఇమ్యూనోగ్లోబిన్ ఇంజక్షన్లు చేయాల్సి వస్తోందని ఇప్పటికే వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి.కృష్ణబాబు ఇటీవల ప్రకటించారు. ఒక్కో రోగికి రూ.5 లక్షల వరకు చికిత్సకు ఖర్చవుతోందని తెలిపారు. కమలమ్మ మృతి నేపథ్యంలో గుంటూరు జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ మాట్లాడుతూ ఈ ఏడాదిలో గుంటూరు ప్రభుత్వాస్పత్రికి 140 కేసులు వచ్చాయన్నారు. సగటున నెలకు పది కేసులు వస్తాయని వివరించారు. చికున్ గున్యా, చికెన్ ఫాక్సు, కోవిడ్ వంటి వైరస్‌ల బారిన పడిన వారికి కూడా ఈ వైరస్ తొందరగా వచ్చే అవకాశం ఉందని తెలిపారు. నీటి కాలుష్యం వల్ల కూడా ఇలాంటి వైరస్‌లు రావచ్చని, పూణేలో నీటి కాలుష్యం వల్లే ఎక్కువ కేసులు రావడం వల్ల ఈ కేసులు వెలుగు చూశాయని చెప్పారు.

అలసందలపల్లిలో అప్రమత్తం

కమలమ్మ (50) మృతితో ప్రకాశం జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు అలసందలపల్లి గ్రామాన్ని సందర్శించారు. కమలమ్మ ఇల్లు, ఆ చుట్టుపక్కల పరిసరాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. గ్రామంలోని నీటి నమూలను సేకరించి పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ల్యాబ్‌కు పంపారు. ఈ నివేదిక వచ్చాక దీనికి అనుగుణంగా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

పాఠశాలల మూతకు ఉపాధ్యాయులు ఒప్పించాలా?

- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు విమర్శ

ప్రజాశక్తి- పార్వతీపురం

ఫౌండేషన్ పాఠశాలలు, మోడల్ ప్రైమరీ స్కూళ్ల ఏర్పాటుకు ఉపాధ్యాయులనే మోటివేటర్లగా నియమించడం దారుణమని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం ఆయన పార్వతీరంలో యుటిఎఫ్ ముఖ్యనాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఫౌండేషన్ పాఠశాలలు, మోడల్ ప్రైమరీ సూళ్ల ఏర్పాటుకు, యుపి పాఠశాలల ఎత్తివేతకు పేరెంట్స్ కమిటీ, తల్లిదండ్రులను ఒప్పించాల్సిన బాధ్యతలు ఉపాధ్యాయులకే అప్పగించడం తగదన్నారు. ఈ చర్య ఉపాధ్యాయుల కళ్లను వారి చేతివేళ్లతో వాళ్లనే పొడుచుకోమన్నట్టు ఉందని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహనరావు మాట్లాడుతూ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఒక రోజు నిర్వహించాల్సి ఉండగా ఒక పూటతో ముగించడం వల్ల ప్రయోజనమేమీ ఉండదన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు తోట రమేష్, సహాధ్యక్షులు వి.జ్యోతి, కోశాధికారి కె.మురళి పాల్గొన్నారు.

‘ఉపాధి’లో కోత

నాలుగేళ్లలో 96.57 లక్షల మంది తొలగింపు

20.66 లక్షల మందికే కొత్త జాబ్ కార్డులు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధి హామీ చట్టం లక్ష్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నాయి. పేద కుటుంబాలకు ఇచ్చిన జాబ్ కార్డులను రాష్ట్రంలో లక్షల సంఖ్యలో తొలగించడం వేతనదారుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఉపాధి హామీ చట్టం కోసం కేంద్రం రూపొందించిన https://nreganarep.nic.in వెబ్‌సైట్‌లో నమోదైన వివరాల ప్రకారం.. గడిచిన నాలుగేళ్లలో వివిధ కారణాలతో రాష్ట్రంలో 35.77 లక్షల జాబ్ కార్డులు తొలగించగా, కొత్తగా మంజూరు చేసినవి 10.58 లక్షలు మాత్రమే. తొలగించిన జాబ్ కార్డుల కారణంగా 96.57 లక్షల మంది వేతనదారులు ఉపాధి కోల్పోగా, కొత్తగా మంజూరు చేసిన జాబ్ కార్డుల వల్ల నూతనంగా 20.66 లక్షల మందికి పనిచేసే అవకాశం లభించింది. 2021-22లో రాష్ట్ర వ్యాప్తంగా 94.90 లక్షల జాబ్ కార్డులు ఉండగా, 1.93 కోట్ల మంది వేతనదారులు నమోదై ఉన్నారు. తొలగింపు చర్యల కారణంగా ప్రస్తుతం జాబ్ కార్డులు 69.55 లక్షలకు కుదించగా, వేతనదారుల సంఖ్య 1.21 కోట్ల మందికి మాత్రమే పరిమితమైంది. దీంతో 72 లక్షల మంది వేతనదారులు ఈ పనులు చేసేందుకు అర్హత కోల్పోయారు. అయితే, నకిలీ కార్డులు, ఒకే కుటుంబానికి ఒకటి కంటే ఎక్కువ కార్డులు ఉండటం, కుటుంబం నమోదు చేసుకున్న గ్రామం నుంచి శాశ్వతంగా వలస వెళ్లడం, కార్డులో ఒకే వ్యక్తి ఉండి అతను మరణించడం, కొన్ని కుటుంబాలు ఈ పనులు చేసేందుకు సుముఖంగా లేకపోవడం, తదితర కారణాలు ఉన్న జాబ్ కార్డులు మాత్రమే తొలగిస్తున్నామని, అర్హులైన వారి కార్డులు తొలగించడం లేదని అధికారులు చెబుతున్నారు. ఇటీవల ఆధార్ అనుసంధానం లేని జాబ్‌కార్డులను తొలగించారనే వాదనలు ఉండగా, కేవలం చెల్లింపుల కోసమే ఆధార్ అనుసంధానం తప్ప జాబ్ కార్డులను తొలగించేందుకు కాదని సంబంధిత అధికారులు తెలిపారు. రాయలసీమ, ఉత్తరాంధ్రలోని వెనుకబడిన ప్రాంతాల్లో పనుల కోసం తాత్కాలిక వలసలు నిత్య కృతం. ఇటువంటి వారిని కూడా ‘ఉపాధి’ నుంచి తొలగించడం దారుణం. మరోవైపు దేశ వ్యాప్తంగా 2022-23లో 2.25 కోట్ల జాబ్ కార్డులు తొలగించగా, 65.59 లక్షల కొత్త కార్డులు ఇచ్చారు. 2023-24లో 1.02 కోట్ల కార్డులు తొలగిస్తే 57.64 కార్డులు మాత్రమే కొత్తవి మంజూరు చేశారు. ఉపాధి పథకంలో జాబ్ కార్డులు తొలగింపుపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. కోవిడ్ సమయంలో పనులు లేక తినడానికి తిండి దొరకక అనేక మంది సొంత గ్రామాలకు వలస వచ్చి, అక్కడ ఉపాధి పనులు చేసి పొట్టపోసుకున్నారు. ఈ క్రమంలో ఈ పథకానికి డిమాండ్ రెడ్డింపు అవ్వగా, వ్యయం కూడా దాదాపు అంతే పెరిగింది. ఈ కారణంతోనే జాబ్ కార్డుల కోతకు ప్రభుత్వం పూనుకుందని జనవాక్యం.

ఉపాధి పథకంలో తొలగించిన, కొత్తగా మంజూరు చేసిన జాబ్ కార్డుల వివరాలు

సంవత్సరం	తొలగించిన జాబ్ కార్డుల సంఖ్య	వేతనదారుల సంఖ్య	కొత్తగా మంజూరు చేసిన జాబ్‌కార్డులు	వేతనదారుల సంఖ్య
2021-22	1,85,054	6,18,557	3,06,594	4,92,216
2022-23	28,82,723	75,19,270	1,94,535	4,21,233
2023-24	3,70,325	10,97,827	2,71,750	5,46,117
2024-25	1,39,678	4,21,644	2,85,363	6,07,156
మొత్తం	**35,77,780**	**96,57,298**	**10,58,242**	**20,66,722**

కృష్ణా బోర్డును శ్రీశైలంలో ఏర్పాటు చేయాలి

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి • అన్ని ప్రాంతాలనూ అభివృద్ధి చేయాలి : మాజీ మంత్రి వడ్డే

3

భారత్ ఎన్నికల్లో అమెరికా జోక్యం

- ఓటింగ్ శాతం పెంచేందుకు నిధులు
- ఇప్పుడు సాయం తెగ్గోస్తున్న ప్రకటనతో వెలుగులోకి

7

మనీలాండరింగ్ కేసులో మారిషస్ మాజీ ప్రధాని ప్రవింద్ అరెస్ట్

7

శనగ రైతుకు 'ధర'ఘాతం

- అధిక వర్షపాతంతో తగ్గిన దిగుబడులు
- ఎకరాకు మూడు నుంచి ఐదు క్వింటాళ్లు
- పెట్టుబడులూ దక్కని వైనం

3

గొలుసులు.. సంకెళ్లు..

వలసదారులకు తొలగని కష్టాలు

న్యూఢిల్లీ : సరైన పత్రాలు లేని వలసదారుల్ని స్వదేశం తిప్పిపంపుతున్న అమెరికా వారిపై అమానవీయంగా ప్రవర్తించడం మానడం లేదు. ఎన్ని విమర్శలు, ఆందోళనలు వస్తున్నా అమెరికా ప్రభుత్వం మాత్రం వారిని సంకెళ్లతోనే బంధించి సైనిక విమానాల్లో తరలిస్తోంది. ఈ విషయాన్ని స్వదేశం చేరకున్న భారత వలసదారులు స్వయంగా తెలిపారు. ‘డిపోర్టేషన్’లో భాగంగా 116 మంది భారతీయులతో కూడిన రెండో విమానం శనివారం రాత్రి అమృత్‌సర్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే. ఇందులో హెూషియార్‌పుర్ జిల్లా కురలా కలాన్‌కు చెందిన దల్జిత్ సింగ్ అనే వ్యక్తి.. అమెరికా ప్రయాణం గురించి మీడియాతో మాట్లాడాడు. తిరిగి వచ్చే సమయంలో అమెరికా అధికారులు వ్యవహరించిన తీరును వివరించారు. కాళ్లకు గొలుసులు, చేతులకు సంకెళ్లు వేశారని తెలిపారు. విమానం అమృత్‌సర్‌లో ల్యాండ్ అయ్యే ముందు సంకెళ్లను తొలగించారని అని దల్జిత్ సింగ్ పేర్కొన్నారు. మహిళలకు మాత్రం సంకెళ్లు వేయలేదని తెలిపారు.

ఈ నెల 5న మొదటిగా వచ్చిన విమానంలోనూ 104 మంది వలసదారులకు చేతికి సంకెళు గొలుసులతో బంధించి తీసుకొచ్చారు. దీనిపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చినా అమెరికా పాలకుల బుద్ధి మారలేదు. అమెరికా నుంచి శనివారం వచ్చిన సి-17 విమానంలో 116 మంది వలసదారుల్లో 65 మంది పంజాబ్‌కు చెందినవారు, 33 మంది హర్యానాకు చెందినవారు, ఎనిమిది మంది గుజరాత్‌కు చెందినవారు, ఉత్తరప్రదేశ్, గోవా, మహారాష్ట్ర, రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు చొప్పున, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్‌కు చెందిన వారు ఒక్కొక్కరు ఉన్నారని అధికారులు తెలిపారు.



అమెరికా యుద్ధ విమానంలో అమృత్‌సర్‌కు చేరుకున్న భారతీయ వలసదారులు

భారత్ చేరుకున్న మూడో విమానం

సరైన పత్రాలు లేని వలసదారులతో అమెరికా నుంచి బయలుదేరిన మూడో విమానం కూడా భారత్‌కు చేరుకుంది. ఆదివారం రాత్రి అమృత్‌సర్‌లో ల్యాండయిన ఈ విమానంలో 112 మంది భారతీయులు ఉన్నారు. వీరిలో 44 మంది హర్యానా, 31 మంది పంజాబ్‌కు చెందిన వారు. అలాగే 33 మంది గుజరాత్‌కు చెందిన వారు. ఇద్దరు ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారు ఉండగా, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ నుంచి చెరో ఒకరు ఉన్నారు.

సీనియర్ నటి, నిర్మాత కృష్ణవేణి కన్నుమూత



ప్రజాశక్తి- హైదరాబాద్, అమరావతి బ్యూరోలు

సీనియర్ నటి, నిర్మాత కృష్ణవేణి (101) కన్నుమూశారు. వయోభార సమస్యలతో ఆదివారం ఉదయం హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌లోని నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆమె మృతి పట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం ప్రకటించారు. సినీ పరిశ్రమకు కృష్ణవేణి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఎన్‌టిఆర్, ఘంటసాల వెంకటేశ్వరరావు, గాయని పి.లీల వంటి ప్రముఖులను ‘మనదేశం’తో ఆమె తెలుగు తెరకు పరిచయం చేశారు. ఆ సినిమాకు నిర్మాతగా వ్యవహరిస్తూనే ఎన్‌టిఆర్‌కు జంటగా అందులో నటించారు. పశ్చిమగోదావరి జిల్లాలో 1924 డిసెంబర్ 24న కృష్ణవేణి జన్మించారు. ఆమె తండ్రి వైద్య వృత్తి నిర్వర్తించేవారు. కృష్ణవేణి డ్రామా ఆర్టిస్ట్‌గా కెరీర్‌ను ఆరంభించారు. 1936లో విడుదలైన ‘సతీ అనసూయ’తో ఆమె బాలనటిగా సినీరంగంలోకి అడుగుపెట్టారు. సినిమా అవకాశాల్లో భాగంగా కృష్ణవేణి కుటుంబం చెన్నయ్‌లో స్థిరపడింది. 1939లో మీర్జాపురం జమీందార్ మేకా రంగయ్యతో ఆమె వివాహం జరిగింది. భర్తకు చెందిన శోభనాచల స్టూడియోస్ సారథ్యంలో పలు సినిమాలకు ఆమె నిర్మాతగా వ్యవహరించారు. ‘దక్షయజ్ఞం’, ‘జీవన జ్యోతి’, ‘భీష్మ’, ‘గొల్లభామ’, ‘ఆహుతి’ వంటి చిత్రాల్లో ఆమె నటించారు. తన పాటలను తానే పాడుకున్న

మిగతా 2లో

తొక్కిసలాటపై విచారణ ప్రారంభం

- బోర్డుపై ఒకే పేరుండడం కారణమని రైల్వే శాఖ ప్రాథమిక నివేదిక
- 18కి చేరిన ఢిల్లీ దుర్ఘటన మృతుల సంఖ్య

న్యూఢిల్లీ : ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో శనివారం రాత్రి జరిగిన తొక్కిసలాటపై విచారణ ప్రారంభమైంది. ఇద్దరు సభ్యులతో ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ ఆదివారం నుంచే తన పనిని ప్రారంభించిందని రైల్వే శాఖ తెలిపింది ఈ నివేదిక వచ్చిన తర్వాత తగిన చర్యలు తీసుకుంటామని ఉత్తర రైల్వే సీపీఆర్ఓ హిమాన్షు శేఖర్ ఉపాధ్యాయ్ తెలిపారు. అలాగే ఈ ఘటనపై రైల్వే శాఖ ఆదివారం ప్రాథమిక నివేదికను విడుదల చేసింది. ప్రయాగ్‌రాజ్‌కు వెళ్తున్న రైళ్ల పేర్లు ఒక విధంగా ఉండటమే ఈ తొక్కిసలాటకు కారణంగా ఈ నివేదిక తెలపడం విశేషం. శనివారం రాత్రి రెగ్యులర్‌గా నడిచే ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ రావడం కొంత ఆలస్యమైందని, ఈ రైలు కోసం 14వ ప్లాట్‌ఫామ్‌పై భారీ సంఖ్యలో ప్రయాణీకులు వేచి ఉన్నారని తెలిపింది. అయితే ఈ సమయంలోనే 12వ ప్లాట్‌ఫామ్‌పై ప్రయాగ్‌రాజ్ ప్రత్యేక రైలును ప్రకటించారని పేర్కొంది. దాని పేరు కూడాఒకేలా ఉండటంతో ఆ రైలునే తాము ఎక్కాల్సినదిగా భ్రమించి అక్కడకు వెళ్లేందుకు ఒక్కసారిగా చాలా మంది కదలడంతో తొక్కిసలాట జరిగిందని ప్రాథమికి నివేదిక పేర్కొంది.

సరైన ఏర్పాట్లు లేకపోవడంతోనే : ఢిల్లీ పోలీసులు

భారీగా ప్రయాణికులు ఉన్నా సరైన ఏర్పాట్లు చేయకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని ఢిల్లీ పోలీసులు తెలిపారు. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల మధ్యలో దాదాపు 2600 టిక్కెట్లను సిబ్బంది విక్రయించారని, ఫలితంగా స్టేషన్ ప్రయాణికులతో కిక్కిరిసి పోయిందని, అదుపు చేయడం కష్టమైందని డిప్యూటీ పోలీస్ కమిషనర్ తెలిపారు.

ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో శనివారం రాత్రి జరిగిన తొక్కిసలాటలో మృతుల సంఖ్య 18కి చేరుకుంది. మరో 15 మంది గాయపడ్డారు. మృతదేహాలను, క్షతగాత్రులను లోక్‌నాయక్ జయ ప్రకాశ్ నారాయణ్ ఆసుపత్రికి తరలించారు. మృతుల కుటుంబాలకు రైల్వే శాఖ రూ.10 లక్షల చొప్పున పరిహారాన్ని ప్రకటించింది. తీవ్రంగా గాయపడిన వారికి రూ.2.5 లక్షలు, స్వల్పగాయాలైనవారికి రూ.లక్ష ఇస్తామని తెలిపింది.

భద్రత కల్పించడంలో కేంద్రం విఫలం

- ఢిల్లీ తొక్కిసలాటపై సిపిఎం రాష్ట్ర కమిటీ

2

బంగారు గనిలో పెను విషాదం

- మాలిలో 48 మంది మృతి

బమాకో: పశ్చిమ ఆఫ్రికా దేశమైన మాలిలో ఘోర ప్రమాదం సంభవించింది. శనివారం ఒక బంగారు గని కుప్పకూలడవంతో 48 మంది కార్మికులు మరణించారు. పదుల సంఖ్యలో కార్మికులు గాయపడ్డారు. ఆదివారం కూడా ప్రమాద ప్రాంతం వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. పేద దేశమైన మాలి ప్రపంచంలో ప్రముఖ బంగారు ఉత్పత్తి దేశాల్లో ఒకటిగా ఉంది. ఇక్కడ ముడి బంగారాన్ని వెలికి తీసి ఇతర దేశాలకు తరలిస్తుంటారు. అయితే ఇక్కడ గనులను అక్రమంగానూ లేదా ప్రైవేటు వ్యక్తులు నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలోనే మాలి బంగారు గనుల్లో ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటాయి. శనివారం జరిగిన ప్రమాదం నెల రోజుల వ్యవధిలోనే రెండోది. శనివారం కొండచరియలు విరిగిపడ్డంతో ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. కొంత మంది కార్మికులు నీటిలో కొట్టుకుపోయారని వెల్లడించారు. గల్లంతైన వారి కోసం గాలింపు కొనసాగుతోంది.

రోడ్డు ప్రమాదంలో తల్లి, ఇద్దరు కుమారులు దుర్మరణం

- సీమంతం వేడుకల తర్వాత దుర్ఘటన

ప్రజాశక్తి- రాజుపాలెం (పల్నాడు జిల్లా)

సీమంతం వేడుకలో అప్పటివరకు బంధుమిత్రులందరితో సంతోషంగా గడిపారు. కొద్ది రోజుల్లో తమ కుటుంబంలోకి మరొకరు బిడ్డ రూపంలో వస్తారనే ఆనందాన్ని అందరితోనూ పంచుకున్నారు. మరలా బిడ్డ పుట్టాక వస్తామంటూ బంధువులకు చెప్పి బయలుదేరిన వారిని లారీ రూపంలో మృత్యువు కబళించింది. కారును లారీ ఢీకొనడంతో తల్లి, ఆమె ఇద్దరు కుమారులు దుర్మరణం చెందారు. పల్నాడు జిల్లాలో ఆదివారం అర్ధరాత్రి రెండు గంటలకు జరిగిన ఈ దుర్ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం.... ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం కొత్తపల్లికి చెందిన షేక్ నజీమా (50), కుద్దూస్ దంపతులకు ఇద్దరు కుమారులు నూరుల్లా (26), షేక్ హబీబుల్లా (24) ఉన్నారు. నూరుల్లాకు ఏడాది కిందట వివాహమైంది. కోడలు సీమంతాన్ని సజీమా దంపతులు హైదరాబాదులో బంధుమిత్రుల నడుమ ఘనంగా నిర్వహించారు. వేడుక ముగించుకొని నజీమా, ఇద్దరు కుమారులు స్వగ్రామమైన పెద్దకొత్తపల్లికి కారులో బయలుదేరారు . అద్దంకి-నార్కెట్‌పల్లి జాతీయ రహదారిపై నెమలి పురి గ్రామంలోని లక్ష్మీ తిరుపతమ్మ గుడి వద్ద వీరి కారును నెల్లూరు నుండి పల్నాడు జిల్లా దాచేపల్లిలోని సిమెంటు ఫ్యాక్టరీకి వెళ్తున్న ట్యాంకర్ (లారీ) ఢీకొట్టింది. ట్యాంకర్ డ్రైవర్ నిద్రమత్తు కారణంగా డివైడర్‌కు ఢీకొట్టి రాంగ్‌రూట్‌లోకి వెళ్లి కారును ఢీకొనడంతో నజీమా, హబీబుల్లా అక్క డిక్కడే మృతి చెందారు. కారును నడుపుతున్న నూరుల్లా తీవ్రంగా గాయపడ్డారు. 108లో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. ఈ ప్రమాదంలో చేయి విరిగిన లారీ డ్రైవర్ నరసరావుపేట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనా స్థలిని పల్నాడు జిల్లా ఎస్‌పి కె.శ్రీనివాసరావు ఆదివారం పరిశీలించారు. సత్తెనపల్లి రూరల్ సిఐ ఎంవి సుబ్బారావు, రాజుపాలెం ఎస్ఐ వేణుగోపాల్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వాస్పత్రికి పోలీసులు తరలించారు. రాజుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. నూరుల్లా సాఫ్‌వేర్ ఉద్యోగి. హబీబుల్లా వైజాగ్‌లో బిటెక్ చివరి సంవత్సరం చదువుతున్నారు.



నజీమా (ఫైల్)



మృతులు నూరుల్లా, హబీబుల్లా(ఫైల్)

సమస్యలను పరిష్కరించాలి

- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎపి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంక్షేమ సమాఖ్య గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె అనూరాధ, ఎం గురుస్వామి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 17న జరగనున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘాలతో ప్రభుత్వం జరపనున్న చర్చల్లో అన్ని విభాగాల్లో పనిచేసే సచివాలయ ఉద్యోగులను వారి మాతృశాఖకు బదిలీ చేసి, నిర్ధిష్ట ప్రమోషన్ ఛానెల్ ప్రకటించాలని, సీనియారిటీ జాబితాను ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్, వార్డు వెల్ఫేర్ సెక్రటరీలను సాంఘిక సంక్షేమ, ఇతర సంక్షేమ శాఖలకు తక్షణమే బదిలీ చేయాలన్నారు. శానిటేషన్ సెక్రటరీలను వారి మాతృశాఖలైన ఫారెస్ట్ అండ్ ఎన్విరాన్‌మెంట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు అప్పజెప్పాలన్నారు. గత ప్రభుత్వంలో క్రమబద్ధీకరణ ప్రక్రియ ఆలస్యంగా జరగడంతో 9 నెలల వేతనాలను ఎరియర్స్ రూపంలో వెంటనే ఇవ్వాలన్నారు. ఉద్యోగంలో చేరిన తేదీని పరిగణనలోకి తీసుకుని రావాల్సిన ఇంక్రిమెంట్లను తక్షణమే మంజూరు చేయడంతోపాటు ఉద్యోగులను తమ సొంత జిల్లాలకు వెంటనే బదిలీ చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగల హేతుబద్ధీకరణ అనివార్యమైతే ఉద్యోగుల విభజన (మల్టీపర్పస్, టెక్నికల్, ఆస్పిరేషల్) లేకుండా నిర్దిష్ట జాబ్ చార్ట్, ప్రమోషన్ ఛానల్ ఏర్పాటు చేసి మిగులు ఉద్యోగులను వివిధ ప్రభుత్వశాఖల్లోకి బదిలీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

సీనియర్ నటి, నిర్మాత కృష్ణవేణి కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

నట గాయనిగా కూడా ఆమె పేరు సంపాదించారు. 1942లో కుమార్తె రాజ్యలక్ష్మీ అనూరాధకు కృష్ణవేణి జన్మనిచ్చారు. తల్లి కృష్ణవేణి బాటలో నిర్మాతగా ఆమె రాణించారు. 'కీలుగుర్రం' సినిమాలో అంజలీదేవికి కృష్ణవేణి నేపథ్యగానం అందించారు. 2004లో ప్రతిష్ఠాత్మక రఘుపతి వెంకయ్య అవార్డు అందుకున్నారు. ఇటీవల 'మనదేశం' వజ్రోత్సవ వేడుకలో ఆమె పాల్గొన్నారు.

ప్రముఖుల సంతాపం

కృష్ణవేణి మృతి బాధాకరమని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, మాజీ సిఎం వైఎస్ జగన్ సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కార్పొరేట్లకు కేంద్రం ఊడిగం

- మూడేళ్లలో రూ.12 లక్షల కోట్లు కట్టబెట్టారు
- కేంద్ర బడ్జెట్‌పై సదస్సులో వి. శ్రీనివాసరావు



సదస్సులో మాట్లాడుతున్న వి. శ్రీనివాసరావు

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

కార్పొరేట్లకు కేంద్ర ప్రభుత్వం ఊడిగం చేస్తోందని, తాజాగా ప్రవేశ పెట్టిన బడ్జెట్ దీనిని రుజువు చేస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. కేంద్ర బడ్జెట్‌పై నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో వామపక్షాల ఆధ్వర్యంలో ఆదివారం సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. పెట్టుబడిదారులు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని, పరిశ్రమల పేరుతో భూములు తీసుకొని, మళ్లీ ఆ భూములు బ్యాంకుల్లోనే తాకట్టు పెట్టి దోచుకుంటున్నారని విమర్శించారు. మూడేళ్ల కాలంలో పెద్ద కార్పొరేట్ కంపెనీలు రూ.12 లక్షల కోట్లు ఎగొట్టాయన్నారు. సంక్షేమ పథకాలు ఇవ్వడం వల్ల సోమరితనం పెరిగిందని ప్రచారం చేస్తున్నారని, అందులో ఏ మాత్రమూ వాస్తవం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని, ప్రత్యేక హోదా కల్పించకుండా ఏవేవో కథలు చెబుతోందన్నారు. బడ్జెట్‌లో మనకు ఏం ఇచ్చారో చెప్పలేని స్థితిలో టిడిపి, వైసిపి, జనసేన పార్టీలున్నాయన్నారు. కడప ఉక్కు ప్రస్తాన లేదని, రైల్వే జోన్ విషయంలో స్పష్టత లేదని తెలిపారు. విశాఖ ఉక్కు కోసం రూ 11,400 కోట్లు ఇచ్చినట్లు చెబుతున్నారని, క్రమేపీ దీనిని ప్రయివేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడానికి కుట్ర జరుగుతోందన్నారు. విదేశీ కంపెనీలు వస్తాయని, రూ.లక్షల కోట్లు పెట్టుబడులు వస్తాయని సిఎం చంద్రబాబునాయుడు రోజూ ఊరిస్తున్నారని అన్నారు. ఇటీవల దావోస్‌లో అంతర్జాతీయ సదస్సులో రాష్ట్రానికి ఒక్క ఒప్పందం కూడా జరగలేదన్నారు.

ప్రపంచంలోని చిన్న చిన్న దేశాలు అమెరికా విధానాలను వ్యతిరేకిస్తుంటే మోడీకి మాత్రం నోట మాట రావడం లేదన్నారు. ఎఫ్ 35 విమానాలకు కాలం చెల్లిందని, ఏడాది క్రితమే మస్క్ ఈ విషయం చెప్పారని, వీటిని భారత్‌కు అమెరికా అంటకట్టిందని వివరించారు. భారత్, అమెరికా వాణిజ్యంలో అమెరికా లోటులో ఉందన్నారు. 500 మిలియన్ డాలర్లు పెట్టి భారత్ ఈ ఏడాది ఆయిల్, ఆయుధాలు, గ్యాస్ కొనుగోలు చేస్తుందన్నారు. భారత్ నష్టపోగా, అమెరికా లాభపడుతుందని చెప్పారు. ఇరాన్, రష్యా నుంచి ఆయిల్, గ్యాస్ దిగుమతి చేసుకోవడం వల్ల కొంతకాలంగా ధరలు స్థిరంగా ఉన్నాయని, ఈ దేశాలకు డాలర్లలో చెల్లించాల్సిన అవసరం లేదని, రూపాయిల్లోనే చెల్లిస్తున్నామని చెప్పారు. భారత్‌పై అమెరికా ఒత్తిడి తెచ్చి ఆయిల్, గ్యాస్ కొనుగోలు చేయించేలా చూస్తోందన్నారు. సరైన పత్రాలు లేకుండా అమెరికాలో భారతీయులకు నివసిస్తున్నారంటూ బేడీలు వేసి, నీళ్లు, అన్నం లేకుండా అమెరికా నుంచి భారత్‌కు తరలించారని, భారతీయులకు జరిగిన అవమానం గురించి కనీసం మోడీ నిరసన కూడా తెలపలేదన్నారు. ఈ సదస్సుకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, సిపిఐ (ఎంఎల్) న్యూడెమొక్రసి జిల్లా నాయకులు రాంబాబు, పార్వడీ బ్లాక్ నాయకులు నరసింహులు, సిపిఐ నాయకులు మాలకొండయ్య పాల్గొన్నారు.

హామీల అమలు కోసం నేడు ధర్నా

- జయప్రదం చేయండి : కె. సుబ్బరావమ్మ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

ప్రజాశక్తి - పార్వతీపురం

గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీలు చేసిన సుదీర్ఘ పోరాటం సందర్భంగానూ, ఆ తర్వాత టిడిపి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. సోమవారం ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని కోరారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణతో కలిసి విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరిస్తామని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్ర సందర్భంగా హామీ ఇచ్చి, అమలు చేయకపోవడంతో 42 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు చారిత్రాత్మకమైన పోరాటం చేపట్టారని, సుదీర్ఘ పోరాట సందర్భంగా జులైలో వేతనాలు పెంచుతామని, మరో 11 డిమాండ్లను పరిష్కరిస్తామని మినిట్స్ కాపీ ఆధారంగా హామీ ఇచ్చారని తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం మినిట్స్ కాపీ హామీలు అమలు చేయాలని కోరుతూ అనేక దఫాలుగా మంత్రుల నుంచి ముఖ్యమంత్రి వరకు విన్నవించుకున్నా నేటికీ ఏ ఒక్క సమస్యను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టలేదన్నారు. 2019 నుంచి ఈనాటి వరకు అంగన్‌వాడీ కార్మికుల జీతాలు పెరగలేదని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ అమలు చేస్తామని టిడిపి తన మేనిఫెస్టోలో హామీ ఇచ్చి పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతాలలో దాదాపుగా 5600 మినీ సెంటర్లు ఉన్నాయని, వీటిని మెయిన్ కేంద్రాలుగా మార్చాలని డిమాండ్ చేశారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్న ప్రభుత్వం రూ.ఏడువేలు వేతనం వస్తున్న అంగన్‌వాడీలకు ఎందుకు అందించడం లేదని ప్రశ్నించారు. సెంటర్ బిల్లులు, టిఎ బిల్లులు, కావెంట్, ఈవెంట్ బిల్లులు రెండేళ్లుగా నిలిచిపోయాయని వెంటనే వీటిని విడుదల చేయాలని, రానున్న బడ్జెట్ సమావేశాల్లో అంగన్‌వాడీ సమస్యలపై చర్చించాలని, జీతాలు పెంచాలని, మినీ అంగన్‌వాడీలకు జీవోలు విడుదల చేయాలని, హెల్పర్ల ప్రమోషన్లలో రాజకీయ జోక్యం అరికట్టాలని, సంక్షేమ పథకాలు, గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అంగన్‌వాడీ ప్రాజెక్ట్ సెంటర్ల వద్ద ధర్నాలు నిర్వహించాలని రాష్ట్ర యూనియన్ పిలిపునిచ్చిందని, ఈ పిలుపులో భాగంగా వర్కర్లు అండ్ హెల్పర్లంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్‌ను భావితరాలకు అందిస్తాం

- స్టీల్‌ప్లాంట్ ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ అసోసియేషన్



ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పోరాటాలతో కాపాడుకుని భావితరాలకు అందిస్తామని స్టీల్‌ప్లాంట్ ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు బొండా తాడన్న, బి.మల్లయ్య, ఎస్.సత్యనారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1466వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి సర్కారు ప్రభుత్వ రంగ సంస్థలపైనా, రాజ్యాంగంపైనా దాడులు చేస్తోందన్నారు. వాటి నిర్వీర్యానికి కుట్రలకు పాల్పడుతోందని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగ సంస్థగా ఉండబట్టే ఎంతోమంది బడుగు, బలహీన తరగతుల వారికి రిజర్వేషన్ ప్రకారం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కాయని తెలిపారు. అదే ప్రయివేటుపరమైతే రిజర్వేషన్లు అమలు కావన్నారు. ఈ నేపథ్యంలో అందరూ ప్లాంట్ పరిరక్షణ కోసం పాటుపడాలని కోరారు.

అభద్రతలో 'ఆప్కాస్' ఉద్యోగులు

- నూతన నియామకాల కోసం ఎమ్మెల్యేల ఒత్తిళ్లు
- ప్రైవేటుకు అప్పగిస్తే నష్టపోతామంటున్న చిరుద్యోగులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రభుత్వ సంస్థల్లో ప్రైవేటు ఏజెన్సీల ద్వారా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను నియమించాలని ఇటీవల రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయంతో ఆప్కాస్ కింద పనిచేస్తున్న ఉద్యోగుల్లో తీవ్ర అభద్రత నెలకొంది. అలాగే ప్రస్తుతం పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగించి ఆ పోస్టుల్లో తమ అనుచరులను నియమించాలంటూ మంత్రులు, పలువురు ప్రజా ప్రతినిధులు సంబంధితశాఖల హెచ్ఒడిలకు లేఖలు రాస్తున్నట్లు ఉద్యోగులకు తెలియడంతో వారిలో ఆందోళన నెలకొంది. ఎవరిని తొలగించి ఎవరికి పోస్టింగ్ ఇవ్వాలో కూడా ఆయా ప్రజా ప్రతినిధులే లేఖల్లో సూచిస్తున్నట్లు సమాచారం. తమ అనుచరులకు పోస్టింగ్‌లు ఇవ్వాలంటూ సంబంధిత అధికారులకు సిఫార్సు లేఖలు రాసిన వారిలో ఓ మహిళా మంత్రి, రాయలసీమకు చెందిన ఓ ఎమ్మెల్యే, పల్నాడు జిల్లాకు చెందిన మరో ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు ఆ లేఖలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయని ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఆప్కాస్‌లో విధులు నిర్వహిస్తున్న వారిని తొలగించాలంటే అందుకు బలమైన కారణాలు ఉండాలి. మూడు సార్లు షోకాజ్ నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. సదరు ఉద్యోగి ఇచ్చే జవాబు సంతృప్తికరంగా ఉన్నట్లయితే ఆ ఉద్యోగిని కొనసాగించాల్సి ఉంటుంది. ఆప్కాస్‌ను రద్దు చేయాలనే మంత్రివర్గ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చాలని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జెఎసిలు డిమాండ్ చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఓ నెంబరు 2ను సవరించి అన్ని డిపార్టుమెంట్లలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమమ్ టైమ్ స్కేల్ ఇవ్వాలనే డిమాండ్లతో స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్, టీచర్స్ అండ్ వర్కర్స్, ఎపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నేతృత్వంలో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే కార్యక్రమాన్ని రూపొందించాయి. ఇందులో భాగంగా ఈ నెల 24న సిఎం, డిప్యూటీ సిఎం, ఐటిశాఖ మంత్రులకు మెయిల్స్ ద్వారా వినతిపత్రాలు పంపాలని, మార్చి 10న కలెక్టరు కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించాలని ఆయా జెఎసిలు షెడ్యూల్ ప్రకటించాయి. ఆప్కాస్ రద్దు చేస్తే ఉద్యోగుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని, గతంలో ప్రైవేట్ ఏజెన్సీల నిర్వహణలో సకాలంలో జీతాలు రాక ఇబ్బందులు పడిన సందర్భాలను ఉద్యోగులు గుర్తు చేసుకుంటున్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కేటాయించే బడ్జెట్‌లో 18 శాతం జిఎస్‌టి పేరుతో ప్రభుత్వం వసూలు చేసుకుంటోంది. ప్రభుత్వ శాఖల నుంచి నేరుగా జీతాలు చెల్లిస్తే జిఎస్‌టి కట్టనవసరం లేదని, ఇదే సందర్భంలో ఆ 18 శాతం ఉద్యోగులకు చెల్లిస్తే ఆ మేరకు జీతాలు పెరుగుతాయని ఉద్యోగ సంఘాలు పేర్కొంటున్నాయి.

భద్రత కల్పించడంలో కేంద్రం విఫలం

- ఢిల్లీ తొక్కిసలాటపై సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

యాత్రికులకు భద్రత కల్పించడంలో నరేంద్ర మోడీ హయాంలోని కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సిపిఎం రాష్ట్ర కమిటీ విమర్శించింది. ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో కుంభమేళాకు వెళ్తున్న ప్రయాణికులు 18 మంది మృతిచెందడం, అనేక మంది గాయపడటం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వరుసగా ప్రమాదాల్లో యాత్రికులు మరణించడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం గర్హనీయమని పేర్కొన్నారు. మహా కుంభమేళాలో పాల్గొనమని ప్రజలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలు ప్రజల ప్రాణాలను మాత్రం గాలికొదిలేశాయని విమర్శించారు. ప్రమాద కారణాలను కప్పిపుచ్చడానికి ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. చనిపోయిన వారి కుటుంబాలకు రాష్ట్ర కమిటీ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. చనిపోయినవారి కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం యాత్రికుల భద్రతకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉత్సాహంగా పింక్ సఖీ శారీ వాక్

- రొమ్ము కేన్సర్‌పై అవగాహన
- గౌతమి హాజరు


పింక్ సఖీ శారీ వాక్‌లో పాల్గొన్న సినీ నటి గౌతమి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖ)

ఎపి రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో రోహిత్ మెమోరియల్ ట్రస్ట్, రౌండ్ టేబుల్ లేడీస్ సర్కిల్ ఇండియా సంయుక్తాధ్వర్యాన విశాఖ బీచ్ రోడ్డులో ఆదివారం ఉదయం తలపెట్టిన పింక్ సఖీ శారీ వాక్ ఉత్సాహభరితంగా సాగింది. మహిళల్లో వచ్చే రొమ్ము కేన్సర్‌పై అవగాహన కల్పించడంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. లైఫ్ అగైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, ప్రముఖ సినీ నటి, సామాజిక కార్యకర్త గౌతమి తాడిమళ్ల, విశాఖ నగర మేయర్ హరి వెంకట కుమారి సంయుక్తంగా ఈ వాక్‌ను ప్రారంభించారు. బీచ్ రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ నుంచి వైఎంసిఎ వరకు నిర్వహించిన ఈ వాక్‌లో విశాఖ నగరానికి చెందిన 2500 మంది మహిళలు పింక్ శారీలు ధరించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సినీ నటి గౌతమి మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలోనే కేన్సర్‌పై అవగాహన పొందడం ద్వారా దానిని నివారించవచ్చునన్నారు. కేన్సర్‌తో జీవితం ముగిసిపోదని తెలిపారు. ఆహార అలవాట్లు, వ్యాయామాలతో బ్రెస్ట్ కేన్సర్‌ను నివారించవచ్చునని, పోరాటం చేస్తే కేన్సర్‌ను జయించడం పెద్ద కష్టమైన పని కాదని అన్నారు. నగర మేయర్ హరి వెంకట కుమారి మాట్లాడుతూ కేన్సర్ మహమ్మారి నేడు ప్రపంచవ్యాప్తంగా మానవాళిని మరణం వరకూ తీసుకు వెళ్తోందని అన్నారు. అటువంటి వ్యాధిపై మహిళల్లో అవగాహన కల్పించేందుకు రోహిత్ మెమోరియల్ ట్రస్ట్ కృషి చేస్తోందని తెలిపారు. మహిళా సాధికారత వంటి అంశాలపైనా అందరినీ చైతన్యవంతులను చేస్తోందన్నారు. ట్రస్ట్ యాజమాన్యానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. వాక్ అనంతరం ఏర్పాటు చేసిన జుంబా డ్యాన్స్, సరదా కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి సిఎంఆర్ గ్రూప్, హెచ్‌సిజి కేన్సర్ హాస్పిటల్, సంధ్యా మెరైన్స్ సంస్థలు ప్రధాన స్పాన్సర్లుగా వ్యవహరించాయి.


రోదిస్తున్న బంధువులు

నడిరోడ్డుపై యువకుడు హత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరశివారు మేడ్చల్‌లో పట్టపగలు దారుణం జరిగింది. అందరూ చూస్తుండగానే నడిరోడ్డుపై ఓ వ్యక్తిని దారుణంగా కత్తులతో పొడిచి చంపిన ఘటన కలకలం రేపింది. ఉమేష్ (25)ను ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని ఇద్దరు కత్తులతో పొడిచి దారుణంగా హత్యచేశారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఉమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ తర్వాత నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలిలో హత్యకు గురైన యువకుడి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. నిందితుల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

హైదరాబాద్ - విజయవాడ రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలోనే రెండో అతిపెద్ద జాతర.. సూర్యాపేట సమీపంలోని దురాజ్‌పల్లి లింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతర ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో ఆదివారం నుంచి ఈ నెల 19 వరకు హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని పోలీసులు తెలిపారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే వాహనాలను నార్కట్‌పల్లి వద్ద నుంచి నల్గొండ, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ మీదుగా మళ్లిస్తున్నారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వచ్చే వాహనాలు కోదాడ వద్ద మళ్లిస్తున్నారు. హుజూర్‌నగర్, మిర్యాలగూడ, నల్గొండ, నార్కట్‌పల్లి మీదుగా వాహనాలను అనుమతిస్తున్నారు. హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్లే వాహనాలన బిబి గూడెం మీదుగా మళ్లిస్తున్నారు.

మల్లవల్లి సిపిసిపై నిర్లక్ష్యం

- రూ. 86 కోట్లతో నిర్మాణం
- అందుబాటులోకి తీసుకురావడంలో ప్రభుత్వ వైఫల్యం

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

రైతుల ఆహార ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడానికి అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నాం. కోట్ల రూపాయల ప్రయివేటు పెట్టుబడులు తీసుకొస్తున్నాం. లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తాం' అని ప్రభుత్వాలు చెబుతున్న మాటలకు.. ఆచరణకు పొంతన కుదరడం లేదు. కృష్ణా జిల్లా బాపులపాడు మండలం మల్లవల్లి మెగా ఫుడ్‌పార్కులో నిర్మించిన సెంట్రల్ ప్రాసెసింగ్ సెంటర్ (సిపిసి)ని అందుబాటులోకి తీసుకురావడంలో జరుగుతున్న నిర్లక్ష్యాన్ని పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లం అవుతోంది.

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పనా సంస్థ (ఎపిఐఐసి) కృష్ణా జిల్లా మల్లవల్లిలో 99 ఎకరాల్లో రెండు ఫుడ్ పార్కులు ఏర్పాటు చేసింది. ఈ రెండు పార్కుల్లో రూ.260 కోట్ల పెట్టుబడులు వస్తాయని, ఆరు వేల మందికి ఉపాధి కలగుతుందని ఎపిఐఐసి పేర్కొంది. ఈ నేపథ్యంలోనే 57 ఎకరాల్లో ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వ ఫుడ్‌పార్కులో ఆహార పరిశ్రమల (ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్) అవసరాలకు, రైతుల ప్రయోజనకరంగా ఉండటానికి సెంట్రల్ ప్రాసెసింగ్ సెంటర్ (సిపిసి)కు రూ.86 కోట్ల నిధులు మంజూరయ్యాయి. 2017 సెప్టెంబర్‌లో ముంబాయికి చెందిన మానిష్ ఫ్లోర్‌మిల్ సంస్థ కాంట్రాక్టు ఒప్పందం కుదుర్చుకుని పనులు మొదలెట్టింది. అన్ని రకాల పండ్ల రసాలు, పొడులు, నూకలు, పిండి కావాల్సిన పరిమాణంలో ప్యాకింగ్ చేసే యంత్రాలు, గోదాములు ఆహార నాణ్యతను పరిశీలించడానికి అవసరమైన ల్యాబ్‌ను నిర్మించారు. 2022 నాటికి కాంట్రాక్టు సంస్థ 95 శాతం పనులు పూర్తి చేసింది. యూనిట్‌ను ట్రయల్ రన్ నిర్వహించారు. దీన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నామని ఎపిఐఐసి అప్పట్లోనే ప్రకటించింది. ఆచరణలో ఇప్పటికి అడుగు ముందుకు పడలేదు.


కృష్ణా జిల్లా బాపులపాడు మండలం మల్లవల్లిలో ఏర్పాటు చేసిన సెంట్రల్ ప్రాసెసింగ్ సెంటర్

వసతులు ఇలా

7.48 ఎకరాల్లో 1.70 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో సిపిసి నిర్మించారు. 3000 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం కలిగిన కోల్డ్ స్టోరేజీ, 4 వేల మెట్రిక్ టన్నుల డ్రై వేర్ హౌస్, గంటకు ఒక మెట్రిక్ టన్ను డ్రై, వెట్ అండ్ పౌడర్ ప్యాకేజీ యూనిట్, కాయలను ఆధునిక పద్ధతుల్లో మాగేయడానికి వీలుగా 120 మెట్రిక్ టన్నుల ఇఆర్‌సి రైపనింగ్ ఛాంబర్, గంటకు తొమ్మిది వేల సామర్థ్యంతో 160 మిల్లీ లీటర్ల ప్యాకింగ్ యంత్రాలు, గంటకు ఆరు మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో పండ్లు, కూరగాయల పల్పింగ్ (పళ్ల గుజ్జు) కాంసంట్రేషన్ లైన్, మెటీరియల్ హ్యాండిలింగ్ పరికరాలు, స్టాకర్స్ 3, క్లిఫిట్స్ 3, టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. దీనిలో పాల డెయిరీ ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేయడానికి అవకాశం ఉంది. ఇది పూర్తయితే అద్దె ప్రాతిపదికన రైతులకు ఈ సిపిసి యంత్రాలను ఉపయోగించుకుని తమ తోటల్లోని పండ్లను ప్రాసెసింగ్ చేసుకుని ఉప ఉత్పత్తులను తయారు చేసుకునే అవకాశం కలుగుతుంది.

అందుబాటులోకి రాక రైతుల అవస్థలు

ఉమ్మడి కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఐదు లక్షల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో మామిడి, అరటి, జామ, అరటి, బొప్పాయి, టమోటా ఇతర కూరగాయ తోటలు సాగవుతున్నాయి. ఈ యూనిట్ అందుబాటులోకి వస్తే మార్కెట్‌లో ధరలు తక్కువగా ఉన్న పండ్లు, కూరగాయల ఉప ఉత్పత్తులు (జ్యూస్, పొడులు, గుజ్జు) తయారు చేసుకొని నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది. మార్కెట్‌లో ధర పెరిగిన తర్వాత విక్రయించుకోవచ్చు. ఫుడ్ పార్కుల్లో ఏర్పాటయ్యే పరిశ్రమల అవసరాలకు సిపిసి ఉపయోగపడుతుందని ఎపిఐఐసి చెబుతోంది. మరోవైపు యూనిట్ అందుబాటులోకి రాకపోవడంతో రైతులు మార్కెటింగ్ ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో యూనిట్‌ను ప్రస్తుత మామిడి సీజన్‌లో అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

పని బంగారం... బతుకు నిస్సారం

- చితికిపోతున్న స్వర్ణకారుల జీవితాలు
- మాయమవుతున్న చేతి వృత్తులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కులవృత్తులు రోజురోజుకూ తమ ఉనికి కోల్పోతున్నాయి. మనుగడ కష్టమని భావించిన కొందరు బతుకు దారి మార్చుకుంటున్నారు. మరికొందరు ఇప్పటికీ తాతల కాలం నుంచి వారసత్వంగా స్వీకరించి స్వర్ణకార వృత్తినే నమ్ముకుంటూ యాతనలు పడుతున్నారు. పని బంగారం.. కాని బతుకే నిస్సారంగా మారిందని పలువురు స్వర్ణకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు ఆర్థిక పరిపుష్టత కల్గిన కుటుంబాలు సైతం ప్రస్తుతం విలవిల్లాడుతున్నాయి. విలువైన బంగారానికి అద్భుత రూపాన్నిచ్చే కళా నైపుణ్యం వారి సొంతమైనా వారి జీవితాలు మాత్రం అంధకారంలో ఉన్నాయి.

ఆభరణాలే అందం

ఏ ఇంట్లో శుభకార్యం తలపెట్టినా ముందుగా గుర్తుకు వచ్చేది స్వర్ణకారుడే. పెళ్లి కూతుర్ని అందంగా అలంకరించాలన్నా, అందాన్ని రెట్టింపు చేయాలన్నా బంగారు ఆభరణాలే ప్రధానం. అటువంటి బంగారు ఆభరణాలు తయారు చేయాలంటే దాని వెనుక పెద్ద కష్టమే ఉంటుంది. తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా నాలుగు వేలకుపైగా స్వర్ణకార కుటుంబాలు ఉన్నాయి. ఆభరణాల రంగంలో కార్పొరేట్లు అడుగు పెట్టడంతో స్వర్ణకారుల బతుకులు దుర్భరంగా మారిపోయాయి. గడిచిన రెండు దశాబ్దాలుగా కార్పొరేట్ షాపులు పెరిగిపోయాయి. అక్కడ వాయిదాల పద్ధతి ఉండడం కూడా కొనుగోలుదారులకు అనుకూలంగా మారింది. దీంతో స్వర్ణకారులకు డిమాండ్ తగ్గింది. సర్వం యంత్రాలమయం అవడంతో స్వర్ణకారులకు పని లేకుండా పోయింది. దీంతో కార్పొరేట్ తాకిడిని తలవంచిన కొందరు బ్యాంకులు లేదా బంగారంపై వడ్డీ ఇచ్చే వ్యక్తుల వద్ద అప్రైజర్లుగా చేరిపోయారు. 50 ఏళ్లవయసు దాటిన ఇంకొందరు కొత్త యంత్రాలతో పోటీ పడలేక పాత వృత్తిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.


స్వర్ణాభరణాలు తయారు చేస్తున్న స్వర్ణకారులు

ప్రస్తుతం స్వర్ణకారులుగా ఉన్న ఎవరూ వారి పిల్లలకు వృత్తిని నేర్పించడానికి ఇష్టపడడం లేదు. ఈ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్న స్వర్ణకారులను ప్రభుత్వం గుర్తించి వివిధ చేతి వృత్తుల వారికి ఇచ్చిన విధంగా రూ.పది వేల ఆర్థికసాయం తమకు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో నల్లమందు సందు, సీతమ్మ సందు, చందా సత్రం గుండువారి సత్రం వీధి ప్రాంతాల్లో కొందరు స్వర్ణకారులు తమ వృత్తికి ఊపిరి పోస్తున్నారు. దీర్ఘకాలికంగా వారికి ఉన్న పరిచయాలతో కొందరు ఇక్కడకు వచ్చి బంగారమిచ్చి వారితో ఆభరణాలు తయారు చేయించుకుంటున్నారు. 2008లో రాజమహేంద్రవరంలో వెయ్యి మందికి పైగా స్వర్ణకారులు ఉండేవారని అంచనా. ప్రస్తుతం ఈ సంఖ్య 600కు పడిపోయిందని స్వర్ణకారుల సంఘం సభ్యులు చెబుతున్నారు.

పనుల్లేక ఇబ్బందులు పడుతున్నాం

కార్పొరేట్ సంస్థల రాకతో స్థానికంగా నగలు తయారు చేసే స్వర్ణకారులకు పనుల్లేకుండా పోతోంది. దీంతో జీవనం కష్టమవుతోంది. కళాకారుల పరిస్థితి దారుణంగా ఉంది. ఈ పని తప్ప ఏ పనీ చేయలేం. కుటుంబం గడవడం కష్టతరంగా ఉంది. డిస్కౌంట్లు, రుణాలు తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. దీంతో చిన్న చిన్న షాపుల మనుగడ కష్టతరంగా మారింది.

- నక్కా సూరిబాబు స్వర్ణకారుడు మెయిన్ రోడ్డు, రాజమండ్రి

ప్రభుత్వం ఆదుకోవాలి

పనుల్లేక స్వర్ణకారుల జీవితాలు అగమ్యగోచరంగా ఉన్నాయి. జీవనం సాగించడం చాలా కష్టంగా తయారైంది. రెడీమేడ్ దుకాణాలు ఎక్కువయ్యాయి. చిన్న చిన్న పని వారికి పనులు దొరకడం లేదు. చిన్నప్పటి నుంచి ఇదే పనిపై ఉండటంతో ప్రత్యామ్నాయ పనులకు వెళ్లలేకపోతున్నాం. ప్రభుత్వం మా గురించి ఆలోచించాలి.

- యర్రోజు వెంకట రమణా చారి స్వర్ణకారుడు

పెన్షన్ విధానం అమలు చేయండి

చంద్రబాబుకు మాజీ ప్రజాప్రతినిధుల లేఖ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

రాష్ట్రంలోని మాజీ ప్రజా ప్రతినిధుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లేందుకు ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రజాప్రతినిధుల ఫోరమ్ కార్యవర్గ సమావేశం ఒక లేఖ పంపింది. విజయవాడ డివి మ్యానర్ హోటల్‌లో ఎపి మాజీ ప్రజాప్రతినిధుల ఫోరమ్ కార్యవర్గ సమావేశం ఫోరమ్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎంవి శివారెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ఫోరమ్ గౌరవ సలహాదారులు, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, ఫోరమ్ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పసల కనక సుందరరావు, ఫోరమ్ ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, ఫోరమ్ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే అంబటి హరిప్రసాద్ హాజరయ్యారు. ప్రధానంగా మాజీ ప్రజాప్రతినిధులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశం చర్చించింది. గత నాలుగేళ్లుగా తెలంగాణ రాష్ట్రంలో మాజీ ప్రతినిధులకు ఇస్తున్న తరహాగా మన రాష్ట్రంలోని మాజీ ప్రజాప్రతినిధులకు పెన్షన్ విధానం అమలు, సక్రమంగా అందరికీ మందుల పంపిణీ, తిరుపతి తదితర దేవస్థానాల్లోనూ, ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ, డిల్లీతోపాటు ఇతర నగరాల్లోనూ వసతి, ప్రోటోకాల్ ప్రకారం తగిన గౌరవం, ఫోరమ్ కార్యకలాపాల నిర్వహణకుగానూ అసెంబ్లీ ప్రాంగణంలో ప్రత్యేక గది సౌకర్యం, తగిన సిబ్బంది నియామకంపై సమావేశం చర్చించింది. ఈ మేరకు సిఎం చంద్రబాబుకు లేఖ రాశారు.

కృష్ణా బోర్డును శ్రీశైలంలో ఏర్పాటు చేయాలి

- పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి
- అన్ని ప్రాంతాలనూ అభివృద్ధి చేయాలి
- మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి



సమావేశంలో మాట్లాడుతున్న వడ్డె శోభనాద్రీశ్వరరావు

కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా రావాలంటే కృష్ణా యాజమాన్య బోర్డును ఉమ్మడి కర్నూలు జిల్లాలోని శ్రీశైలంలో పెట్టాలని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. రాయలసీమతో పాటు రాష్ట్రంలోని అన్ని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని, వాటికి నిధులు కేటాయించాలని కోరారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి అధ్యక్షతన కర్నూలు సూరజ్ గ్రాండ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో శోభనాద్రీశ్వరరావు మాట్లాడారు. శ్రీశైలం నుంచి తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి కోసం వందల టిఎంసిల నీళ్లు వాడేస్తోందని, మన ప్రభుత్వం ఎందుకు కట్టడి చేయడం లేదని ప్రశ్నించారు. వేసవిలో నీటి సమస్య వస్తే ఎలా అధిగమిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. శ్రీశైలం జలాశయంలో ఏర్పడిన భారీ గొయ్యి వల్ల జలాశయానికి ప్రమాదం ఉందని నిపుణుల కమిటీలు చెబుతున్నా జగన్, చంద్రబాబు ఇద్దరికీ పట్టలేదన్నారు. చంద్రబాబు దూరదృష్టి ఉన్న వ్యక్తి అయినా వ్యవసాయం, రైతులపై కంటే విదేశీ పెట్టుబడులు, పారిశ్రామికవేత్తలపైనే ఆసక్తి ఉందని విమర్శించారు. ప్రయివేటు రంగంతోనే అభివృద్ధి అనే ఆలోచనలో వెళుతున్నారన్నారు. పోలవరాన్ని కేంద్రమే పూర్తి చేస్తుందని మన్మోహన్ సింగ్ ప్రభుత్వం తీర్మానం చేస్తే ఇరిగేషన్ కాంపొనెంట్‌కు మించి ఇవ్వబోమని, హోదా కాకుండా ప్యాకేజీ ఇస్తామని చంద్రబాబు సమ్మతితోనే మోడీ ప్రభుత్వం ప్రకటన చేసిందన్నారు. అమరావతిలో ఇప్పటికే ప్రభుత్వ భవనాలు నిర్మించి ఉన్నా మళ్లీ రూ.40 వేల కోట్లతో ఐకానిక్ భవనాలను నిర్మిస్తామంటున్నారని, అవసరం లేని వాటి మీద కాకుండా అవసరం ఉన్న వాటి మీద ఖర్చు చేయాలని కోరారు.

టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలైనా కర్నూలులో హైకోర్టు బెంచి భవనాల నిర్మాణానికి ఎందుకు చర్యలు చేపట్టలేదని ప్రశ్నించారు. హంద్రీనీవా, గాలేరు నగరి, తెలుగు గంగ పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. గోదావరి నుంచి బనకచర్లకు నీళ్లు తీసుకురావడం ఆచరణ సాధ్యం కాదని, అవసరం లేనిదని చెప్పారు. పట్టిసీమ నుంచి గోదావరి జలాలను తీసుకొచ్చి నాగార్జున సాగర్ ఆయకట్టుకు వాడుకోవచ్చని, ఆ దిశగా అన్ని సంఘాలతో చర్చించాలని కోరారు. మళ్లీ టిడిపి అధికారంలోకి వచ్చినా గుండ్రేవులకు టెండర్లు ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. విజన్ 2047 పేరుతో మాటలు కోటలు దాటుతున్నాయన్నారు. సామాన్యులకు ఉపయోగపడే పనులు చేయాలని, ఆ దిశగా ప్రభుత్వం మీద ఒత్తిడి తేవడానికి అందరూ కృషి చేయాలని కోరారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ.. ఎపి అంటే అమరావతి, పోలవరం అనే ఆలోచనను మానుకోవాలని సూచించారు. ఎపి సీడ్ కార్పొరేషన్, టెస్టింగ్‌ల్యాబ్, కమిషనరేట్ రాయలసీమలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కుందూ వెడల్పు పేరుతో లక్షల ఎకరాల ఆయకట్టును నాశనం చేయాలనే చర్యలను మానుకోవాలని కోరారు. ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ.. కర్నూలు నిత్యం కరువు ప్రాంతంగా ఉందని, పాలకుల నిర్లక్ష్యం వల్ల వలసలు పోతున్నారని తెలిపారు. ప్రాజెక్టులకు భూములు ఇచ్చిన వారికి ఉపాధి లేకుండా పోతోందన్నారు. రాబోయే కాలంలో చేపట్టే ఆందోళన కార్యక్రమాలకు తమ మద్దతు ఉంటుందని తెలిపారు. రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.రామచంద్రయ్య మాట్లాడుతూ కరువుతో అనంతపురం జిల్లాలో ఎడారి ఛాయలు వస్తున్నాయన్నారు. హంద్రీనీవా పంట కాలువలు పూర్తి చేసి రైతులకు నీళ్లివ్వాలని కోరారు. సమావేశంలో జల సాధన సమితి అధ్యక్షులు రామ్ కుమార్, విద్యావంతుల వేదిక నాయకులు జి.భాస్కర్ రెడ్డి, ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం పాల్గొన్నారు.

నిన్ను చంపేస్తాం..

- ప్రజాశక్తి విలేకరిపై టిడిపి నేత దాడి
- మంత్రిపై వార్తలు రాస్తే చంపుతానంటూ బెదిరింపులు

ప్రజాశక్తి - పార్వతీపురం

పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండల ప్రజాశక్తి విలేకరి మల్యాడ రామారావుపై ఆ మండల టిడిపి అధ్యక్షులు, ఎ.వెంకంపేట గ్రామానికి చెందిన గుల్ల వేణుగోపాలనాయుడు దాడికి పాల్పడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. 'నిన్ను వదలను... ఎప్పటికైనా చంపేస్తాను' అంటూ ఆగ్రహంతో ఊగిపోతూ బెదింపు చర్యలకు పాల్పడ్డారు. మళ్లీ చెబుతున్నా 'మా పార్టీపైగానీ, మా మంత్రిగారిపైగానీ వార్తలు రాస్తే.... మీ ఇంటికి వచ్చి చంపేస్తాను.... ఏమనుకుంటున్నావో నా సంగతి నీకు పూర్తిగా తెలియనట్టుంది. నీ భార్య, పిల్లలకు కూడా దక్కవు' అంటూ విలేకరి తలపై కొట్టారు. విలేకరి తన విధి నిర్వహణలో భాగంగా మండలంలోని ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులు తెలుసుకునేందుకు ఆదివారం ఉదయం ఇంటి నుండి బయలుదేరారు. ఎ.వెంకంపేట - కాశీపట్నం మార్గమధ్యలో జరుగుతున్న నిర్మాణ పనుల వద్దకెళ్లారు. అప్పటికే అక్కడున్న వేణుగోపాలనాయుడిని పలకరించారు. రోడ్డు పనుల ఫొటో తీసుకుంటానంటూ వేణుగోపాలనాయుడి అనుమతి కోరారు. వేణుగోపాల నాయుడు ఇందుకు నిరాకరించడమే కాకుండా... వెంటనే బూతు పురాణం అందుకుని దుర్భాషలాడుతూ.. 'మా మంత్రి గారిపైనే వార్తలు రాస్తావా? అంటూ అసభ్యకరమైన పదజాలంతో రామారావుపై దాడికి పాల్పడ్డారు. 'నేను రాసింది మంత్రిపై కాదు... ఎన్నికల కోడ్ అమలు తీరుపైన' అంటూ విలేకరి సముదాయించినప్పటికీ వేణుగోపాలనాయుడు మాత్రం తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయారు. 'మాపైన వార్తలు రాయడానికి విలేకర్లంతా భయపడతారు... ఎవరికీ లేని బాధ నీకెందుకు' అంటూ రామారావుపై దౌర్జన్యానికి దిగారు. దీంతో మక్కువ పోలీసు స్టేషన్‌లో వేణుగోపాల నాయుడిపై బాధితుడు రామారావు ఫిర్యాదు చేశారు. తనపై దాడి చేయడమే కాకుండా, చంపుతానంటూ బెదిరించిన వేణుగోపాలనాయుడిపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు వేణుగోపాలనాయుడి నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని ఈ ఫిర్యాదులో కోరారు. టిడిపి నేత దాడి నేపథ్యంలో విలేకరి మల్యాడ రామారావును ప్రజాశక్తి ఎడిటర్ బి తులసీదాసు ఫోనులో పరామర్శించారు. ప్రజాశక్తి కుటుంబం, మిగతా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, ప్రజాస్వామ్య శక్తులు సంఘీభావంగా నిలుస్తాయని ధైర్యం చెప్పారు. రామారావుపై దాడిని విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన పలు జర్నలిస్టు సంఘాల నాయకులు ఖండించారు.

ఎపిడబ్ల్యుజెఎఫ్ ఖండన

మక్కువ మండల ప్రజాశక్తి విలేకరి మల్యాడ రామారావుపై ఆ మండల టిడిపి అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్ నాయుడు దాడి చేయడాన్ని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.వెంకట్రావు, జి.ఆంజనేయులు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అధికార పార్టీ నాయకుల తప్పొప్పులను ప్రజలకు తెలియజేయడం ప్రజాస్వామ్యంలో పత్రికల ప్రధాన విధి అని, ఈ విధిని నిర్వహిస్తున్న విలేకరిపై దాడి చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమైన చర్య అని, దీనిని ఫెడరేషన్ తరఫున ఖండిస్తున్నామని పేర్కొన్నారు. టిడిపి నాయకుడు వేణుగోపాల్ నాయుడుపై తక్షణం చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ దాడిని వ్యతిరేకిస్తూ ఎక్కడికక్కడ నిరసనలు తెలియజేయాలని పిలుపునిచ్చారు.

శనగ రైతుకు 'ధరా'ఘాతం

- అధిక వర్షపాతంతో తగ్గిన దిగుబడులు
- ఎకరాకు మూడు నుంచి ఐదు క్వింటాళ్లు
- పెట్టుబడులు కూడా దక్కని వైనం


పెద్దపసుపుల్లో పంట నూర్పిడి పనుల్లో రైతులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

శనగ రైతును ధరాఘాతం వెంటాడుతోంది. గతేడాది నవంబర్, డిసెంబర్ మాసాల్లో కురిసిన అధిక వర్షాల కారణంగా తెగుళ్లు సోకడం, దిగుబడి తగ్గడంతో అన్నదాతలు నష్టాలను మూటగట్టుకున్నారు. వైఎస్ఆర్ జిల్లాలో 2.05 లక్షల ఎకరాలు, కర్నూలులో 80 వేలు, అనంతపురంలో 1.5 లక్షలు, ప్రకాశంలో రెండు లక్షల ఎకరాల్లో శనగ పంట ప్రతి ఏటా సాగు చేస్తారు. 2024-25 రబీ సీజన్‌లో వైఎస్ఆర్ జిల్లాల్లో 1.62 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. అధిక వర్షపాతంతో పాటు మంచుకురవడంతో పంట తెగుళ్ల బారిన పడింది.ఎకరా సాగుకు కనిష్టంగా రూ.25 వేలు, కౌలు రైతులకు మరో రూ.15 వేలు అదనంగా ఖర్చవుతుంది. కలుపు, రసాయన మందులు, పంట నూర్పిడికి మరో రూ.3,000 అదనపు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఎకరాకు ఎనిమిది నుంచి పది క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా కేవలం మూడు నుంచి ఐదు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ప్రభుత్వం ఒక క్వింటాలుకు రూ.5,450 మద్దతు ధర ప్రకటించింది. ఎకరాకు ఐదు క్వింటాళ్ల చొప్పున రూ.27,000 అన్నదాతకు లభిస్తోంది. పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవడంతో అన్నదాత లబోదిబోమంటున్నారు. పది క్వింటాళ్ల చొప్పున లెక్కిస్తే రూ.54,500 రావాల్సి ఉండగా కేవలం రూ.27,000 మాత్రమే వస్తోంది. దీనికి తోడు ప్రభుత్వం సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయివేటు వ్యాపారులకు క్వింటాలుకు రూ. 3600కు విక్రయించాల్సి వస్తోంది.

కొనుగోలు కేంద్రాలకు ప్రతిపాదనలు

బుడ్డశనగ కొనుగోలు కేంద్రాలకు ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి అనుమతి లభించగానే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తాం.

- పరిమళజ్యోతి, మార్క్‌ఫెడ్ అధికారి, కడప.

రూ.10 వేలు ప్రకటించాలి

ఒక క్వింటాలుకు రూ.పది వేలు ధర కల్పించాలి. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు సరైన ధర లేకపోవడంతో అమాంతం నష్టపోవాల్సి వస్తోంది. ఈసారి సాగు దశలో అధిక వర్షాల కారణంగా అరకొరగానే సాగు చేయాల్సి వచ్చింది. దిగుబడి అరకొరగానే వచ్చింది.

- మహేశ్వరరెడ్డి, పెద్దపసుపుల, పెద్దముడియం

బుడ్డశనగ రైతును ఆదుకోండి

బుడ్డశనగ రైతులను తక్షణమే ఆదుకోవాలి. ధరల స్థిరీకరణ నిధి సహాయంతో గిట్టుబాటు ధర అమలు చేయాలి. ఒక క్వింటాకు రూ.పది వేలు చెల్లించాలి. మార్క్‌ఫెడ్ సహాయంతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

- డి.దస్తగిరిరెడ్డి, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి, కడప.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

గ్రంథాలయాలను కాపాడుకోవాలి

- మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి - సీతమ్మధార (విశాఖపట్నం)

గ్రంథాలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ అన్నారు. విశాఖ నగరంలోని పౌర గ్రంథాలయంలో ఎపి గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక ఆధ్వర్యాన అరసం ప్రతినిధి ఉప్పల అప్పలరాజు అధ్యక్షతన ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ సమాజానికి ఎంతో అవసరమైన గ్రంథాలయాలను కాపాడుకోవాల్సిన ప్రజాప్రతినిధులు గ్రంథాలయ స్థలాలను దోచుకోవడం బాధాకరమన్నారు. విశాఖలోని గ్రంథాలయ స్థలం విషయంలో అప్పటి విద్యాశాఖ మంత్రి వ్యవహారం అందరికీ తెలిసిందేనన్నారు. గ్రంథాలయాల పట్ల విద్యార్థులకు మక్కువ ఎక్కువగా ఉందన్నారు. గ్రంథాలయాల పరిరక్షణ ఉద్యమంలో విద్యార్థులను, పాఠకులను భాగస్వామ్యం చేసేలా ప్రణాళిక రూపొందించాలని కోరారు. గ్రంథాలయ పునర్వికాస వేదిక కన్వీనర్ వల్లూరు శివ ప్రసాద్ మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధిలో ప్రజల తోడ్పాటు ఉందని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలు కట్టిన పన్నుల ద్వారా వచ్చిన ఆదాయంలో గ్రంథాలయాలకు రూ.737 కోట్లు ఖర్చు చేయాల్సి ఉన్నా ప్రభుత్వాలు రూ.17.37 కోట్లు మాత్రమే ఖర్చు చేశాయని వివరించారు. గ్రంథాలయాలను కాపాడుకునేందుకు ఏప్రిల్ 17న విజయవాడలో కవులు, రచయితలు, పలు ప్రజా సంఘాల వారితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎయు తెలుగు శాఖాధిపతి జర్రా అప్పారావు, పౌర గ్రంథాలయం కార్యదర్శి డాక్టర్ డివి.సూర్యారావు, దళిత సాహిత్య పీఠం ప్రతినిధి వెలమల సిమ్మన్న. ప్రజా గాయకుడు దేవిశ్రీ, మేడా మస్తాన్ రెడ్డి. శేఖరమంత్రి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

2029కి రూ.16.77 లక్షల కోట్ల అప్పు

- రాష్ట్ర పరిస్థితిపై ఆప్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రం అప్పుల కుప్పగా మారబోతుందని, 2029 నాటికి రాష్ట్ర సరాసరి అంచనా ప్రకారం రూ.16.77 లక్షల కోట్లకు చేరబోతుందని ఆమ్ ఆద్మీ పార్టీ జోనల్ కో-ఆర్డినేటర్ నేతి మహేశ్వరరావు పేర్కొన్నారు. ఆ పార్టీ నాయకులు పరమేశ్వరరావుతో కలిసి విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైసిపి ప్రభుత్వం సరాసరిన ఏడాదికి రూ.1,19,852 కోట్లు అప్పు చేస్తే, టిడిపి ప్రభుత్వం అంతకంటే ఎక్కువ స్థాయిలో అప్పులు తెచ్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. తెచ్చిన అప్పుల్లో మూలధన వ్యయానికి కేటాయింపులు 0.65 శాతమేనని అన్నారు. దీంతో దివాళా తీసే రాష్ట్రాల్లో మొదటి స్థానంలో రాష్ట్రం ఉందని పేర్కొన్నారు.

పెన్షన్ సౌలభ్యాలు చెల్లించాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన గ్రాట్యూటీ, పిఎఫ్, ఎపిజిఎల్ఐ, జిఐఎస్ తదితరాలు అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్‌టియు డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్ సాయి శ్రీనివాస్, మల్లు రఘునాథరెడ్డి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మూడు నెలలుగా గ్రాట్యూటీ చెల్లింపులు కూడా ఆపేశారని, కమ్యుటేషన్ మొత్తాన్నే చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. పెన్షనర్లకు బకాయిలు చెల్లించే ఏర్పాటు చేస్తామని, వారికి కార్పొరేషన్ ఏర్పాటుదిశగా చర్యలు తీసుకుంటామని మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రభుత్వం ఆ దిశగా ఎటువంటి చర్యలూ ఇంతవరకు చేపట్టలేదని విమర్శించారు.



ఒంగోలు బాలోత్సవంలో కోలాటం ప్రదర్శిస్తున్న చిన్నారులు



అనంతపురం బాలోత్సవంలో విజేతలైన చిన్నారులతో అతిథులు

భవితకు భరోసా 'బాలోత్సవం'

- ఒంగోలులో కోలాహలంగా వేడుకలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

బాలల భవితకు బాలోత్సవాలు బంగారు బాటవేస్తాయని పలువురు వక్తలు కొనియాడారు. పలు విజ్ఞానదాయకమైన కార్యక్రమాలు నిర్వహించడం అభిలషణీయమని పేర్కొన్నారు. ఒంగోలు పివిఆర్ గ్రౌండ్స్‌లో 'ప్రకాశం బాలోత్సవం ద్వితీయ పిల్లల పండుగ' ఆనందోత్సాహాల నడుమ ఆదివారం కోలాహలంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి జిల్లాల నలుమూలల నుంచి సుమారు ఐదు వేల మంది విద్యార్థులు తరలివచ్చారు. ఎనిమిది వేదికలపై లఘునాటికలు, జానపద నృత్యాలు, ఏకపాత్రలు, కోలాటం, సైన్స్ ఎగ్జిబిషన్, చిత్రాలేఖనం, మట్టితో బొమ్మలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. తొలుత బాలోత్సవ కమిటీ అధ్యక్షులు బండారు లక్ష్మీనారాయణ బాలోత్సవ జెండాను ఆవిష్కరించి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు విజ్ఞానం అవసరమని, ఆ విజ్ఞానాన్ని వెలికితీసేందుకు కృషి చేస్తున్న బాలోత్సవ కమిటీ నిర్వాహకులను అభినందించారు. తొలుత ఆయన సైన్స్ విజ్ఞాన ప్రదర్శనలు పరిశీలించి విద్యార్థులను ప్రశంసించారు. జిల్లా విద్యాధికారి అత్తోట కిరణ్‌కుమార్, నగర మేయర్ గంగాడ సుజాత హాజరయ్యారు. వేలాదిమంది బాలబాలికలను ఒకే వేదికపై చేర్చి వారిలో ప్రజ్ఞాపాటవాలను వెలికితీస్తున్న బృహత్తర కార్యక్రమం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిసిఇబి సెక్రటరీ ఎం. శ్రీనివాసరావు, బాలోత్సవ కమిటీ గౌరవాధ్యక్షులు ఎ.వి. రమణారెడ్డి, అమరావతి బాలోత్సవం కార్యదర్శి యు.వి.రామరాజు, యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు, బాలోత్సవ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అనంత బాలోత్సవం

మూడు రోజుల పాటు అలరించిన చిన్నారులు

అనంతపురం కలెక్టరేట్: అనంతపురం పట్టణంలోని లలితకళా పరిషత్‌లో మూడు రోజులపాటు జరిగిన అనంత బాలోత్సవం-5 పిల్లల సంబరం ఆదివారంతో ముగిసింది. 160 పాఠశాలల నుంచి 9 వేల మంది విద్యార్థులు 65 విభాగాల్లో పాల్గొని ప్రతిభను చాటుకున్నారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చిత్రలేఖనం, వ్యాస రచన, డ్యాన్స్, జానపద పాటలు, దేశభక్తి పాటలు, పౌరాణిక నాటికలు, చదరంగం, వక్తృత్వం తదితర పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభ చూపారు. ఆదివారం సాయంత్రం జరిగిన ముగింపు సభలో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతపురం లలిత కళాపరిషత్ కల్లు సుబ్బారావు కళాక్షేత్రం, లలిత కళాపరిషత్ పూర్వ కార్యదర్శులు ఎ.నరసింహమూర్తి, గాజుల నారాయణస్వామి ప్రాంగణంలో బాలోత్సవం ముగింపు సభ నిర్వహించారు. అనంత బాలోత్సవం కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి వి.సావిత్రి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బాలోత్సవం కమిటీ చైర్మన్ షమీమ్ షఫీవుల్లా, లలితకళాపరిషత్ కార్యదర్శి పద్మజ, రవికాంత్ రమణ, ఆర్ఐఒ వెంకట రమణ నాయక్, కేర్, క్యూర్ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ అభిషేక్ రెడ్డి, ఐఎంఎ రాష్ట్ర నాయకులు మురళీకృష్ణ, ఐఎంఎ జిల్లా చైర్మన్ డాక్టర్ కొండయ్య, మానవతా రక్తదాతల సంస్థ తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు చదువుతోపాటు ఆట పాటలు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో అనంత బాలోత్సవ కమిటీ కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి జిలాన్, సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శివారెడ్డి

ఉద్యోగులకు హెల్త్ కార్డ్‌పై వైద్య సేవలు శూన్యం

- ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ నేతలు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

ఉద్యోగులకు హెల్త్ కార్డులపై వైద్య సేవలు అందడంలేదని, వైద్యం అందించడానికి ఆస్పత్రి యాజమాన్యాలు నిరాకరిస్తున్నాయని ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెవి శివారెడ్డి, విద్యాసాగర్ తెలిపారు. ఉద్యోగులు ప్రతినెలా తమ వంతు భాగస్వామ్యాన్ని ప్రభుత్వానికి చెల్లిస్తున్నప్పటికీ, చెల్లింపు జరగడంలేదనే కారణంతో ఆస్పత్రి యాజమాన్యాలు వైద్య సేవల విషయంలో మొండి చెయ్యి చూపుతున్నాయని పేర్కొన్నారు. విజయవాడ గాంధీనగర్‌లోని ఎన్‌జిఒ హోమ్‌లో ఆంధ్రప్రదేశ్ ల్యాబ్ టెక్నీషియన్స్ రాష్ట్ర స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో శివారెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలన్నీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉన్నాయని తెలిపారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులకు సంబంధించిన ప్రతి సమస్య పెండింగ్‌లో ఉందని, టిడిపి కూటమి ప్రభుత్వమైనా ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. విద్యాసాగర్ మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్‌లు జీవిత కాలంలో ఒక్క ప్రమోషన్ కూడా నోచుకోలేదని, కనీసం ఒక ప్రమోషనైనా వచ్చే విధంగా ప్రమోషన్ ఛానల్ ఏర్పాటు చేయాల్సి ఉందని, దీనిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వేణు, ప్రధాన కార్యదర్శి ఎంఎస్ మూర్తి, అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షులు దస్తగిరి రెడ్డి, జగదీశ్వరరావు, రంగారావు, అసోసియేషన్ నాయకులు ఘంటా కిషోర్, శ్రీధర్ బాబు, కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నాయకులు అజయ్ కుమార్, ఫార్మసీ టెక్నీషియన్ అసోసియేషన్ నాయకులు శ్రీ రత్నాకర్, రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ల్యాబ్ టెక్నీషియన్‌లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతి ఎన్నికలోనూ విజయం

- ఎమ్మెల్సీ ఎన్నికలపై చంద్రబాబు సమీక్ష

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రతి ఎన్నికలోనూ కూటమి విజయం సాధించాలని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ నెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించేలా నాయకులంతా సమిష్టిగా పనిచేయాలని చెప్పారు. ఉమ్మడి గుంటూరు-కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, కూటమి నేతలతో ఆదివారం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై నేతలకు దిశానిర్దేశం చేశారు. మూడు పార్టీల అభ్యర్థులు కలిసికట్టుగా పనిచేయాలని, ఎన్నికలకు 10 రోజులే సమయం ఉన్నందున క్షేత్రస్థాయిలో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. కూటమి ధర్మాన్ని పాటిస్తూ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించకుండా విజయం కోసం పనిచేయాలని చెప్పారు. బ్రాండ్ ఎపితో పెట్టుబడులు సాధించి యువతకు ఉద్యోగాలు కల్పించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయండి

- ముఖ్యమంత్రికి కె రామకృష్ణ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసేందుకు వెంటనే తగిన చర్యలు చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. 6 నెలలు నిర్దిష్ట కాలపరిమితి విధించి ఈ సమస్య పరిష్కరించాలని కోరుతూ సిఎం చంద్రబాబుకు ఆదివారం లేఖ రాశారు. దాదాపు 32 లక్షల మంది ఖాతాదారుల నుంచి అగ్రిగోల్డ్ సంస్థ రూ.6,380 కోట్లు డిపాజిట్లుగా సేకరించి, బోర్డు తిప్పేసి మోసం చేసిందన్నారు. మన రాష్ట్రంలో 19.52 లక్షల మంది డిపాజిట్‌దారులు అగ్రిగోల్డ్ కంపెనీ మోసానికి గురయ్యారన్నారు. 600 మందికి పైగా కస్టమర్లు, ఏజెంట్లు ఆత్మహత్యలకు, అసహజ మరణాలకు గురయ్యారని లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మన రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఈ సంస్థకు 1,73,662.37, చదరపు గజాల స్థలాలు, 368.18 ఎకరాల భూమిని, దీని అనుబంధ సంస్థలకు చెందిన రూ.227 కోట్ల విలువైన ప్లాంట్లు, యంత్రాలను జప్తు చేశారన్నారు. ఈ వ్యవహారం పూర్తయి 11 ఏళ్లు గడుస్తున్నా బాధితులకు న్యాయం జరగలేదన్నారు. రూ.906 కోట్లుగా ఉన్న, రూ.20 వేలలోపు డిపాజిట్‌దారులకు రెండు విడతలుగా కొంత మేర చెల్లింపులు జరిగాయని, ఇప్పటికీ 10.50 లక్షల మంది బాధితులకు రూ.3,080 కోట్లు అందజేయాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో అగ్రిగోల్డ్ ఆస్తులను తాకట్టుపెట్టి రుణాలు తీసుకోవడానికి సిద్ధమయ్యారని తెలిపారు. నెల్లూరు జిల్లాలో ఈ సంస్థ భూముల్లో ఉన్న చెట్లను అమ్ముకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసి ఆదుకోవాలని కోరారు.



మార్క్సిస్టు దృక్పథం వల్ల ఆలోచనల్లోనూ, అనుభూతుల్లోనూ స్వేచ్ఛా ప్రవృత్తి బాగా విస్తరిస్తుంది. ఇది రచయితల అవగాహనకు, అధ్యయనానికి, సృజనకు బాగా ఉపయోగపడుతుంది.

- రిచర్డ్ రైట్,
ప్రఖ్యాత నల్లజాతి రచయిత



కమలిన కలువ

చలం పుట్టిన దేశంలోనూ
స్వేచ్ఛ పదం ఎరుగని బతుకులు
కనబడని సంకెళ్ల చప్పుళ్ళు
కమలిన గాయాల స్వగతాలు
ఏ కాలమైతేనేమి
నిస్సిగ్గుగా నిర్భయంగా
కాలం పిట్ట తొడిగేదెప్పుడూ మగరెక్కలే
స్త్రీ పురుషులు సమానమని
నొక్కి వక్కాణించే నాలుకల మధ్య
హత్యలు ఆత్మహత్యలు
ఒక జాతికే పరిమితమైన వాస్తవాలు
అందమైన దేహపుష్పాల వర్ణనలలో
గుచ్చుకొనే అసమానతల ముళ్ళ నడుమ
కణకణ కాలుతున్న అవమాన దగ్ధ దు:ఖవర్ణపు నల్లరంగు
మసి బారిన మనసు కాగితం ఉనికి ఎక్కడ?
తనువు మొక్కజొన్న కండెను
నిప్పుల్లో కాల్చినట్లు అలవాటుగా
అనుమానాల అగ్ని పరీక్షలు అనాదిగా
బానిస యజమాని సంబంధాల దాంపత్యంలో
వివాహమొక పెద్ద జూదం!
ఇద్దరం ఒకటే ఐనా
సహనం, శాంతి పాఠాలు
సర్దుకుపో, రాజీపడు సూత్రాలు
స్త్రీలకు మాత్రమే ఏకపక్షం!

పేపరబ్బాయి పలకరించినా
పోస్ట్ మాన్‌తో మాట్లాడినా
అక్రమ సంబంధాల
అసహ్యపు కారుకూతల నరకం దుర్భరం
కసాయి కత్తితో మాంసం నరికినట్లు
ఉచ్చరించలేని మాటలతో
ముక్కలు ముక్కలుగా
ఉత్తరింపబడిన మనసు
000
ఝాన్సీ పేరంటే భలే ఇష్టం
ఆ పేరు పెట్టుకొన్నందుకైనా
జీవన సమరంలో విజేతగా
నిలబడాలనుకొన్నా
భర్తను వదిలేసిన స్త్రీ అని
గురిపెట్టిన వెక్కిరింతల బాణాలు
చదువుకున్న అహంకారి బిరుదులు
ఉదారంగా ప్రదానం చేసినప్పుడు
ఆత్మవిశ్వాస ఆయుధం చేజారి
దారులన్నీ మూసుకుపోయినపుడు
అనుమానాల మొగుడి కన్నా
మృత్యువరుని పరిష్వంగమే పరిష్కారమని
ఆత్మహత్యనే శరణు వేడా!
000
నా మరణానంతరం
సంతాపదినాలు ప్రకటించదు ప్రభుత్వం
కొత్త విజయాలు సాధించిన సంబరంలో
వార్త తెలిసిన రెండో రోజే నా మొగుడు
రెండోసారి పెళ్ళికొడుకు అవతారంలో పెళ్లి పీటలపై
సాగిపోతూనే వుంటుంది
ఆగకుండా ప్రపంచం...!
(అనకాపల్లిలో ఆత్మహత్య చేసుకున్న హోంగార్డు ఝాన్సీ కోసం)

- మందరపు హైమవతి
94410 62732

బతుకు బండి

నేను దిగాల్సిన రైలుకు
సమయం ఆసన్నమైంది
ఇక క్షణాలు లెక్కపెట్టుకోవలసిందే!
నా లక్ష్యం ఐతే నెరవేరలేదు
నా కలలు కూడా చిగురించలేదు
ఐనా దిగక తప్పటం లేదు

నా చుట్టూ కొన్ని
విరిసిన కుసుమాలున్నాయి!
వాడిన పూల గుత్తులు ఉన్నాయి!
తొక్కిసలాటలో రాపిడికి తట్టుకోలేక
రెక్కలు రాలిపోయిన తొడిమలూ ఉన్నాయి
అన్నీ కలగాపులగంగా
బెర్తులూ సీట్లలోనే కాదు
కింద గత్తరలోనూ గలీజులోనూ
కళావిహీనంగా కూలబడి ఉన్నాయి

నిర్లక్ష్యంగా విసిరేయబడ్డ
కట్టెల మోపుల్లాగా బొగ్గుల బస్తాల్లాగా
నా జాతి జనాలు నిత్యం వాడుకునే
సొట్టలు పడిన గిన్నీ ముంతల్లాగా
ఒకదానిమీద ఇంకొకటి
వాలిపోయి సోలిపోయి
అలుపూ ఆయాసం తీర్చుకుంటున్నాయి

చాలా పొడవైన ఈ బతుకు బండిలో
మేం మాత్రమే ప్రయాణించట్లేదు సుమా !
మా ముందు చెమటలు చిందని
చలిమర గదులున్నాయి
సుఖనిద్రల గుడ్లు పొదిగే
సున్నితమైన పడకలూ ఉన్నాయి
ఎవరి రాజసానికీ ఎవరి భోగలాలసకీ అడ్డు రాకుండా
మా నేల బతుకుల నీచపు పెట్టెను
ఓ మూలకు నెట్టేశారు

అదిగో... రైలు కూతవేస్తోంది
నా గమ్యస్థానం చేరువయింది
ఈ ప్రయాణపు అమానవీయ అసమానతలతో
యుద్ధం చేసి అలసిపోయాను
పోతూ పోతూ నా సీటు
ఈ కింద దొర్లుతున్న రెక్కలు లేని
ఓ తొడిమకు ఇచ్చేసిపోతాను

ఈ తొడిమలే కాస్త చిక్కబట్టుకొని
ఈ యుద్ధ విరామాన్ని బద్దలు గొట్టాలి!
రేపటి తూర్పు బండికి కావలసిన
సరంజామాను సిద్ధం చెయ్యాలి!

- పతివాడ నాస్తిక్. 9441724167

23న 'అనంత' కథా కార్యశాల

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఔత్సాహిక, వర్ధమాన రచయితల కోసం సాహితీస్రవంతి ఫిబ్రవరి 23, 2025 ఆదివారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అనంతపురం నగరంలో అనంత కథా కార్యశాల నిర్వహిస్తున్నది. సీనియర్ రచయితలు వెంకట కృష్ణ, డా. వేంపల్లె షరీఫ్, ఆర్.శశికళ, డా. శ్రీనివాసమూర్తి పాల్గొని కథా రచన గురించి వివిధ అంశాలపై ప్రసంగించడంతో పాటు పాల్గొన్నవారి కథలపై విశ్లేషణ చేస్తారు. పాల్గొనదలచిన వారు కింది లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరుతున్నాము.

https://forms.gle/arCAmbeEQjCzmXZV8

E-mail: pragathi.madur@gmail.com


- ప్రగతి, 9440798008,

కర్ణుడు లేని భారతమా!

ఇటీవల విజయవాడ సమీపంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటైన హైందవ శంఖారావం సభలో చేగొండి అనంత శ్రీరామ్ భారతంలోని కర్ణుడు గురించి, రామాయణంలోని లవకుశల గురించి, ఇంకొన్ని ఇతర అంశాల గురించి మాట్లాడారు. సినిమా వాళ్లు హిందూ మతాన్ని కించపరుస్తున్నారని ఆ మతానికి ద్రోహం చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. సినిమా పరిశ్రమ అలాంటి వాటిని నిషేధించాలని లేకుంటే హైందవులు బహిష్కరించాలని పిలుపునిచ్చారు. ఈ కృష్ణా జిల్లా గడ్డమీద నుండి మాట్లాడుతున్నానని ఈ జిల్లాకు సంబంధించిన గతంలోని దర్శకులు ఇప్పటి నిర్మాతలు కొంతమంది సినిమాలు తీసి మహాభారతంలో కర్ణుడు లాంటి పిరికి వాడిని గొప్పవాడిగా చూపిస్తున్నారు అని ఆయన పేరు చెప్పక పోయినప్పటికీ పరోక్షంగా ఎన్టీఆర్ నిర్మించిన దానవీరశూరకర్ణ సినిమా గురించేనని అర్థమవుతుంది. బి.ఆర్ పంతులుగారు తమిళంలో తీసిన "కర్ణ" సినిమాలో కర్ణుడిగా శివాజీ గణేషన్, కృష్ణుడిగా ఎన్‌టి రామారావు నటించారు. కుల వివక్ష గురించి మాట్లాడాలంటే కర్ణుడి కథలోకి వెళ్ళటం ఒక ఆనవాయితీగా మారింది. కర్ణుడి ఆధారంగా సోషలైజ్ చేసి తీసిన అనేక సినిమాలు ఉన్నాయి.

కర్ణుడు లేని భారతమా! తింటే గారెలు తినాలి వింటే మహాభారతం వినాలి అన్న నానుడి మనం ఎప్పటినుంచో వింటున్నాం. వ్యాసుడు రాశాడు అని భావించే మహాభారతం ప్రాచీనమైనది. మొదట ఇందులో 8800 శ్లోకాలు మాత్రమే ఉన్నాయి. అప్పుడు దాన్ని "జయం" అని పిలిచారు. ఆ తరువాత "జయేతి హాసం" అన్నారు. తర్వాతి కాలంలో శ్లోకాల సంఖ్య 24000 పెరిగింది. అప్పుడు దాన్ని "భారతం" అన్నారు. చివరకు ఈ గ్రంథంలోని శ్లోకాల సంఖ్య లక్షకు పెరిగింది. అప్పుడు ఆ గ్రంథాన్ని "మహాభారతం" లేదా "శత సహస్ర సంహిత" అన్నారు. భారతం నిజమా! కాదా! జరిగిందా లేదా అన్నది పక్కన పెడితే, ఇతర అనేక దేశాలకు ఇతిహాసాలు ఉన్నట్లే భారతదేశానికి కూడా మహా భారతం అన్నది ఒక ఇతిహాసం.

ఇన్నాళ్లు రామాయణం, రాముడిని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్న వారు ఇప్పుడు మహాభారతాన్ని కూడా ఆ రాజకీయాల్లోకి లాగుతున్నారు. హైందవ శంఖారావం సభలో చేగొండి అనంత శ్రీరామ్ మాట్లాడుతూ కర్ణుడు ఒక పిరికివాడని, గంధర్వ సైన్యాన్ని చూసి మిత్రుడిని కూడా వదిలిపెట్టి పారిపోయిన భీరుడని అపహస్యం చేస్తూ,ఎన్టీఆర్ దానవీరశూరకర్ణ నుండి మొదలుకొని ఈ మధ్య తీసిన కల్కి సినిమాలో కూడా కర్ణుడి పాత్ర గొప్పగా చూపించారని అది హైందవానికి వ్యతిరేకమని గగ్గోలు పెట్టాడు. కర్ణుడు అర్జునుడికి మించిన వీరుడు అని వ్యాసభారతంలోనే ఉన్నది. పాండవులందరూ ఎలా పుట్టారో కర్ణుడు అలాగే పుట్టాడు. కర్ణుడితోపాటు మిగిలిన పాండవుల ఐదుగురు కూడా పాండురాజుకు పుట్టిన వారు కాదు. కానీ పాండవుల ఐదుగురికి లభించిన స్థానం కర్ణుడికి లభించకపోవడం కూడా అన్యాయమే. కర్ణుడిని సూతుడు పెంచుతాడు. సూతుడు వలన "సూత కులం" అన్న ఒక తక్కువ కులం ఏర్పడింది. గుర్రాలకు జీనులు, గుర్రం సంరక్షణ వీళ్ళ వృత్తి. ఆ కులంలో పెరిగాడు కాబట్టి కర్ణుడినీ తక్కువ కులం వాడిగాచూడటం జరిగింది. అందువలననే కర్ణుడిని మనం ఒక "విక్టిమ్" చూస్తాం. కర్ణుడు అడిగిన వారికి లేదనకుండా దానం చేసి దాన కర్ణుడైనాడు. యుద్ధానికి ముందే తన ప్రాణానికి రక్షణ అయిన సహజ



కవచకుండలాలను అర్జునుడి తండ్రి అయిన దేవేంద్రుడికి దానం చేశాడు. యుద్ధభూమిలో ధర్మరాజు సహా తన సోదరులు ముగ్గురు తన చేతిలో ఓడిపోయినా కుంతికి ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి వాళ్లను కర్ణుడు వధించలేదు. యుద్ధభూమిలో రథం కుంగిపోయి అర్జునుడి బాణాలు శరీరంలోకి చొచ్చుకు వచ్చినా ఆ సమయంలో కృష్ణుడు బ్రాహ్మణ వేషంలో వచ్చి బంగారం దానం చేయమని అడిగితే తన నోటిలో ఉన్న బంగారపు పన్నును విరగ్గొట్టి కృష్ణుడికి దానం చేశాడు. అలాంటి దానవీర కర్ణుడిని పిరికివాడు అంటూ గేలిచేస్తాడు ఈ అనంతుడు. యుద్ధభూమిలో కర్ణుడు మరణించినప్పుడు, దుర్మార్గుడు చచ్చాడు అని హేళనగా అర్జునుడు అన్నప్పుడు కృష్ణుడు అంటాడు ఇలా.

నరవరా! నీచే, నాచే
వరమడిగిన కుంతి చేత, వాసవు చేతన్,
ధర చే, భార్గవు చేతను అరయంగా
కర్ణుడీల్గె ఆర్గురి చేతన్.

ఆ విధంగా కర్ణుడు ఎంత గొప్పవాడో ఆరుగురి శాపాల వలన చనిపోయాడే గాని అతను గొప్ప వీరుడు అని కృష్ణుని నోటనే పలికించాడు వ్యాసుడు.

భారతంలోని మిగిలిన పాత్రలలాగే కర్ణుడికీ బలాలు, బలహీనతలున్నాయి. ద్రౌపది వస్త్రాపహరణం జరుగుతూ ఉంటే కర్ణుడు చూస్తూ ఊరుకున్నాడే కానీ అడ్డుకోలేదు. అలానే దుర్యోధనుడు శకుని పన్నే పన్నాగాలలో కూడా తాను పాలుపంచుకున్నాడు. మరి అదే నిండు కొలువులో కురుపితామహుడు భీష్ముడు, కౌరవ పాండవులకు విద్య నేర్పిన గురువు ద్రోణాచార్యుడు, లాంటివారు కూడా ఉన్నారు కదా వీరు చూస్తూ ఊరుకున్నారే కానీ ఎవరూ అడ్డుకోలేదు కదా! కురు పితామహుడైన భీష్ముడు పెళ్లి పీటల మీద ఉన్న పెళ్లికూతుళ్ళను తీసుకువచ్చి తన తమ్ముళ్లకు పెళ్లి చేశాడు. అయినా పితామహుడు గొప్పవాడే కదా! యుద్ధరంగంలో పద్మ వ్యూహ రచన చేసి అభిమన్యుడు చావటానికి కారకుడైన ద్రోణాచార్యుడు గొప్పవాడే కదా! ఎరుకలవాడైన ఏకలవ్యుడు ద్రోణాచార్యుని బొమ్మను పెట్టుకుని విలువిద్యలో నైపుణ్యం సాధిస్తే అది చూసిన ద్రోణుడు తన శిష్యుడైన అర్జునుడి కన్నా గొప్పవాడు అయిపోతాడు అన్న భయంతో అతని బొటనవేలును దక్షిణగా తీసుకున్న ద్రోణాచార్యుడు లాంటివారు గొప్పవారైనప్పుడు, వీరులైనప్పుడు, కర్ణుడు వీరుడు కాకుండా ఎలా పోతాడు? వీళ్ళందరూ గొప్పవారైతే కర్ణుడు గొప్పవాడు కాడా? చేగొండి అనంత శ్రీరామ్ సమాధానం చెప్పాలి. అంతెందుకు కృష్ణుడి సంగతి ఏంటి? గోపికలు స్నానం చేస్తుంటే వాళ్ళ బట్టలు ఎత్తుకొని పోయి చెట్టు మీద కూర్చుంటే ఆయన మాత్రం మంచివాడా! అనంత శ్రీరామ్ కర్ణుని విలన్ చేసినంత మాత్రాన మహాభారతం చదివిన హిందువులు ఎవరూ కర్ణుని విలన్‌గా భావించరు. కేవలం కొందరు హిందుత్వ వాదులు మాత్రమే అలా చేస్తారు. యుద్ధభూమిలో చిన్న అపాయం ఎదురైనా కృష్ణుడికి తట్టినన్ని దుర్మార్గపు ఉపాయాలు ఎవరికి తట్టవు. భీష్ముడి ప్రతిజ్ఞ అవకాశంగా తీసుకుని అర్జునుడికి శిఖండిని డాలుగా అడ్డం పెట్టుకొని భీష్మున్ని సంహరించడం, నిరాయుధుడిగా ఉన్న కర్ణుడిపై ఆయుధం ప్రయోగింపజేసి హతమార్చడం, జయద్రదుడిని చంపటానికి సూర్యాస్తమ భ్రమను కల్పించడం, ద్రోణుడిని చంపటానికి ధర్మరాజుతో అశ్వద్ధామ హతః కుంజరః అనిపించడం, దుర్యోధనుడిని వధించటానికి అతని తొడల మీద కొట్టమని భీమున్ని సైగ చేయడం, ఇవన్నీ కృష్ణుడు ఇచ్చిన సలహాలు. శల్య పర్వంలో చివరన వీటన్నింటినీ గురించి ప్రశ్నించగా వాళ్లను చంపడానికి వేరే మార్గం లేదని, మరోరకంగా విజయం సాధించటం సాధ్యం కాదని చెప్పుకున్నాడు కృష్ణుడు. ఇలాంటి ఘనకార్యాలు చేసిన కృష్ణుడు గొప్పవాడైనప్పుడు, కర్ణుడిని అంత తక్కువగా, హేళనగా, పిరికివాడు అని మాట్లాడటం అనంత శ్రీరామ్‌కు తప్పు అనిపించలేదా?

అనంత శ్రీరామ్ ప్రస్తావించిన రెండో అంశం రామాయణం గురించి. ఒక ఆదర్శ కుటుంబంలో కుమారుడు తండ్రికి, తమ్ముడు అన్నకు, భార్య భర్తకు విధేయులుగా ఉండాలని సూచించేది వాల్మీకి రామాయణం. అసలు రామాయణంలో శ్రీరాముడికి లవకుశలకి మధ్య యుద్ధమే జరగలేదు అన్నాడు అనంత శ్రీరాముడు. రామాయణం రెండు భాగాలుగా ఉంటుంది. మొదటిది రాముడి పట్టాభిషేకంతో ముగుస్తుంది. ఆ తర్వాత రెండో భాగం మొదలవుతుంది. అదే ఉత్తర రామాయణం. దీనిలోనే రాముడు మీద అనేక విమర్శలు ఉంటాయి. ఆయన ఒక రజక వృత్తిదారుని మాటలు విని నిండు చూలాలుగా ఉన్న సీతమ్మ తల్లిని అడవులకు పంపించడం ఆ తర్వాత ఆమెకు లవకుశలు జన్మించడం, వారు ఇద్దరూ రాముడితో యుద్ధం చేయటం ఇదంతా మనకు తెలిసిందే. లవకుశ చిత్రంలో ఇవన్నీ మనం చూశాం. ఇవన్నీ వాల్మీకి రామాయణంలోనే ఉన్నాయి. కానీ అలాంటివి అన్నీ అబద్ధం అసలు యుద్ధమే వారి మధ్య జరగలేదంటాడు మన అనంతుడు. వాల్మీకి రామాయణంలో రావణాసురుడు విలన్ అంటారు దుష్టుడంటారు. ఆయనలో గొప్ప గుణాలు లేవా? ఆయన పోలస్త్య బ్రహ్మ మనుమడు. తెల్లవారేలోపు కోటి శివలింగాలకు అభిషేకం చేసే వాడని రామాయణం చెబుతుంది. ఆయన గొప్ప శివ భక్తుడు. మహా పండితుడు. రామ రావణ యుద్ధానికి కూడా ముహూర్తం ఆయనే నిర్ణయించాడు అని అంటారు. కానీ పర స్త్రీని ఎత్తుకుపోవడం, మితిమీరిన అహంకారం ఉండటం లాంటి బలహీనతలతో అతను పతనమయ్యాడు. శ్రీరాముడు రఘు వంశోత్తముడు. మహానుభావుడు. దేవుడు. అదే శ్రీరాముడు వాలిని చెట్టు చాటు నుండి వధించాడు. వలచి వచ్చిన శూర్పణఖ అనే స్త్రీని లక్ష్మణుడి చేత ముక్కు చెవులు కోయించి ఒక "వికారిగా "చేశాడు. శూద్రుడైన శంభూకుడు చాటుగా వేదం చదువుతున్నాడని, దాని వలన ధర్మం దారి తప్పిందని, అందువలననే తన భార్య మృత శిశువుని కన్నదని, ఒక బ్రాహ్మణుడి ఫిర్యాదు మేరకు ధర్మరక్షణ పేరుతో శూద్ర శంభూకుడి నీ ఏమాత్రం విచారణ చేయకుండా వధించాడు రాముడు. నిండు గర్భిణిగా ఉన్న సీతామాతను అడవుల పాలు చేశాడు. అయినప్పటికీ రామున్ని దేవుడుగా పూజిస్తున్నారు కదా. పురాణాలను, ఇతిహాసాలను సినిమాలుగా తీసేటప్పుడు కొన్ని పాత్రల్లోని గొప్పతనాలను అలానే కొన్ని పాత్రలోని దుష్టత్వాలను లేదా బలహీనతలను ఎత్తిచూపుతూ తీస్తుంటారు అది ఒక సినిమా. పురాణాలను, ఇతిహాసాలను తీసుకొని ప్రస్తుత సమాజానికి అనుగుణంగా కనెక్ట్ చేయటమే రచయితగా చేయవలసిన పని. ఇప్పటి సమాజానికి ఆ పురాణాలు కానీ ఇతిహాసాలు కానీ ఏ విధంగా ఉపయోగ పడతాయో ఆధునీకరించి రాయటం, తెలియజేయటం రచయిత యొక్క క్రియేటివిటీ. ఈ మాట చలం రచించిన "సావిత్రి"అనే పుస్తకానికి రాసిన ముందుమాటలో పింగళి నాగేంద్రరావు గారు పేర్కొన్నారు. బహుశా అనంత శ్రీరాముడు ఇవన్నీ చదివి ఉండకపోవచ్చు. తెలియకపోవచ్చు. లేదా తెలిసినా తెలియనట్లు నటించి ఉండవచ్చు. రంగనాయకమ్మ "రామాయణ విష వృక్షం"అనే గ్రంథాన్ని రచించారు. విశ్వనాథ సత్యనారాయణ "రామాయణ కల్పవృక్షం" అనే గ్రంథాన్ని సమాంతరంగా రచించారు. రంగనాయకమ్మను విశ్వనాథ వారు బూతులు తిట్టలేదు. ఆమె రాసిన పుస్తకం గురించి ఆయన దృష్టికి తీసుకెళ్తే ఏమన్నారు, ఆమెకే పుణ్యం, ఆవిడకే ముందు ఆ దైవాన్ని చేరే అవకాశం దక్కుతుందేమో, ఆమె పలుసార్లు రామనామం జపించారు. కాబట్టి ఆమె దేవుడికి దగ్గరగా ఉంటుంది, నేను కాదు అని చెప్పారు. అది కదా ప్రజాస్వామ్య యుతంగా మాట్లాడటం అంటే. నా పుస్తకాన్ని,ఆమె రాసిన పుస్తకాన్ని పాఠకులు చదివి చర్చించండి అన్నారాయన. ఆవిడను ఆయన ద్వేషించలేదు. ఆమె అభిప్రాయాలు ఆమె చెప్పారు, నేను నా అభిప్రాయం పుస్తకంలో చెప్పాను. ఈ రెండు చదివి ఎటు వెళ్ళాలో నిర్ణయించుకోవాల్సిన బాధ్యత పాఠకులది అని అన్నారు. ఇలాంటి విషయాలన్నీ చేగొండి చదవాలి. చదివి తెలుసుకోవాలి.

ఈ శంఖారావసభ కేవలం శూద్రుల భుజం మీద పెట్టి హిందుత్వ తుపాకీ పేల్చటమే. ఇవాళ సమాజాన్ని మతవిద్వేషాలతో అల్లర్లతో అల్లకల్లోలం చేయడం వారి ఎజెండా. పెద్ద ఎత్తున జన బహుళ్యం వాళ్ళ వెంట లేకపోతే ఈ ఎజెండా ముందుకు తీసుకుని పోలేరు. అందుకే చేగొండి అనంత శ్రీరామ్ లాంటి వారితో ఇలాంటి మాటలు అనిపించడం హిందుత్వవాదుల వ్యూహంలో భాగమే. సమాజంలో సామాన్యుల మెదడులను కలుషితం చేసి వాళ్లతోనే వాళ్ళ కళ్ళను పొడుస్తూ ఈ ఎజెండాను తీసుకు వెళుతున్నారు. ప్రగతిశీల ప్రజానీకం దీన్ని గమనించి వాళ్ళ ట్రాప్‌లో పడకుండా, ఆ భావజాలాన్ని దునుమాడడం కర్తవ్యంగా పెట్టుకోవాలి.

పి.బి.చారి
రిటైర్డ్ ఇసిఐఎల్ సీనియర్ మేనేజర్, హైదరాబాద్

విలక్షణ కథా రథసారథి

నివాళి



పి. వి. బి. శ్రీరామమూర్తి
(జననం 15.4.1951..
మరణం : 9.2.2025)

రచనకు ప్రధానంగా సృజనశీలత ఉండాలి. దానికి చక్కని కృషి, వైవిధ్యమైన ఇతివృత్తాలకు జీవిత పరిశీలన ఉండాలి. రచయిత తాను ఎంచుకున్న ఇతివృత్త సంద్రపు లోతులు కొలవగలగాలి. కథాంశపు ఔచిత్యత, పాత్రల మనోధర్మాలు, భావోద్వేగాలు, ఉచితానుచితాలు మనోనేత్రంతో దర్శించగలగాలి. వాటి హావభావాలు, ప్రవర్తన, దర్శించగలగాలి. పాత్రోచిత సంభాషణలు పలికించాలి. రచయిత తాను చెప్పదలుచుకున్న విషయాన్ని, ఏ భావోద్వేగాలతో పాత్రల చేత చెప్పిస్తే చదువరులకు చేరుతుందో ఆ రకమైన పాత్ర చిత్రణ చేయగలగాలి. అన్నిటికీ మించి, కథను చదివించే రీతిలో చెప్పటం తెలియాలి. అదే కథా కథనం అంటాం. వాటి కలబోతే కథాశిల్పం.

ఈ లక్షణాలను సలక్షణంగా కలిగి, ఓ విలక్షణ రీతిలో ఐదు దశాబ్దాలకు పైగా సాహితీ సృజన చేస్తున్న సుప్రసిద్ధ రచయిత శ్రీ పివిబి శ్రీరామమూర్తి ఈ నెల 9వ తేదీ శాశ్వత నిద్రలోకి వెళ్లిపోయారు. 17 సంవత్సరాల వయసులో అక్షర సేద్యం ఆరంభించిన వారు కథాసాహితీ క్షేత్రాన్ని 400 వందల కథలతో సుసంపన్నం చేశారు. వీరి కథలు.. ముళ్ళ (2000)

హాస్య.. వ్యంగ్య కథలు అన్న పేరుతో ఒక సంకలనం (2098)లో వచ్చింది. 15 ఏళ్ల తరువాత 38 కథలతో.అరణ్య రోదనం (2020) అనే పేరుతో ఒక పుస్తకాన్ని తెచ్చారు. సంకెళ్లు అన్న నవలను ఎమెస్కో సంస్థ ప్రచురించింది. ప్రేమసూత్రం, జేబులో బొమ్మ, ఇదో యజ్ఞం, నేరం, శిక్ష అనే నవలలు రాశారు. చిన్న పిల్లల కోసం కథలు రచించారు. ఈనాడు దినపత్రికలోని ఆధ్యాత్మిక శీర్షిక.. అంతర్యామికి చక్కని వ్యాసాలు అందించారు.

ముళ్ళు, సౌరాజ్యం తాత, పునాదిరాళ్లు అన్న వీరి కథలను శ్రీమతి ఇనుగంటి జానకి హిందీలోకి అనువాదం చేశారు. అవి సూత్ర, సర్వనామ్ అనే హిందీ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. విజయనగరం అభినందన సంస్థ 2021లో ఉత్తమ రచయితగా పురస్కారం ఇచ్చింది. పలు సన్మానాలు అందుకున్నారు. చిత్తూరు సృజన సాహితి అరణ్య రోదనం అనే సంకలనానికి పురస్కారమిచ్చింది. తండ్రి రామారావు, తల్లి లక్ష్మి నారాయణమ్మ ఎనిమిది మంది సంతానంలో మూడవవారుగా 15.4.1951లో శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో జన్మించారు. తండ్రి ఉపాధ్యాయులు. వీరి విద్యాభ్యాసం చీపురుపల్లిలో ప్రారంభమై కోనూరు, మెట్టపల్లిలో, విజయనగరం మహారాజా సంస్కృత కళాశాలలో సాగి ఆంధ్రా యూనివర్సిటీలో ముగిసింది. పండిత శిక్షణను పొందారు. 1972 నుంచి 2008 వరకూ పార్వతీపురం ఆర్‌సియమ్ బాలుర పాఠశాలలో తెలుగు పండితులుగా చేరి, పూర్తి ఉద్యోగ కాలాన్ని అక్కడే పూర్తి చేసి, అక్కడే పదవీ విరమణ చేయటం విశేషం.

విశాఖపట్నం రేడియో ద్వారా 10 నాటికలు ప్రసారమయ్యాయి. వాటిలో పావలా శ్యామల, కోకా సంజీవరావు వంటి అద్భుత నటులు నటించారు. ఆధ్యాత్మిక ప్రసంగాలతోపాటు 50 కథలు, కవితలు తమ గళం ద్వారా అందించారు. అరణ్య రోదనంలోని సిమ్మాద్రి అనే కథను ఈ వ్యాస రచయిత నాటకీకరణ చేయగా, విశాఖపట్నం ఆకాశవాణి ప్రసారం చేసింది. శ్రీరామమూర్తి సృజనశీలత సాహిత్యరంగంలోనే కాక నాటక దర్శకత్వ రంగంలోనూ భాసించింది. పాఠశాల పిల్లలకు నాటికలు రాసి ప్రదర్శింపజేశారు. అంతేకాదు తాను స్వయంగా సత్యహరిశ్చంద్ర నాటకంలో నక్షత్రకునిగా 50కి పైగా ప్రదర్శనలు ఇచ్చారు. మంచి పేరు సంపాదించారు. వారు శ్రీకృష్ణ పాత్రధారి కూడా. చక్కని గాత్రంతో శ్రోతలను అలరించేవారు. పార్వతీపురంలో మిత్రసాహితీ సంస్థ కార్యదర్శిగా 25 ఏళ్లు సేవలందించి వైవిధ్య సాహితీ కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. 'నా చుట్టూ ఉన్న వాతావరణం నన్ను రచయితను చేసింది. మనుషుల మాటలను, వారి పోకడను గమనిస్తాను. ఆ జీవిత పరిశీలన నుండే కథా ఇతివృత్తాలను తయారుచేసుకుంటా. తిక్కన, పోతన, వేమన పద్య శిల్పాన్ని, సంస్కర్తగా కందుకూరి వీరేశలింగం పంతులుగార్ని అభిమానిస్తాను. రావిశాస్త్రి అంటే ఒక పిసరు ఎక్కువ ఇష్టం. ఏ ఒక్క ఇజానికీ బద్ధుణ్ణి కాను. ఒక్క హ్యూమనిజానికి తప్ప. రచయితకు వ్యక్తిత్వం ఉండాలి. విషయం చెప్పే ధైర్యం ఉండాలి! నిజాయతీ, నిబద్ధత ఉండాలి' అంటారు.

ప్రేమ్‌చంద్, ఠాగూరు, శరత్‌బాబు రచనలు విపరీతంగా చదివారు. ఆంధ్రప్రభ, ఆంధ్ర పత్రికలతోపాటు ఆనాటి వారపత్రికలు చదివిన స్ఫూర్తితో రచనలు చేశారు. 'మా నానమ్మ కథానిధి. చెప్పిన కథ చెప్పకుండా రోజూ మమ్మల్ని దగ్గర కూర్చోబెట్టి కథలు చెప్పేది. అదే నాలో కథలు రాయాలనే కోరికను కలిగించింది. మొదట అన్నయ్య, నేను కలిసి నవలలు రాశాం. అయితే అవి పడలేదు. రచయితగా తన ప్రస్థానం ఎలా సాగిందో చెబుతూ, 'తొలి కథ పాపం శైలజ.. కృష్ణా పత్రికలో అచ్చయింది అన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కథలు రాస్తూనే ఉన్నారు. రాశిలోనే కాక, వాసిలోనూ అవి పాఠకులను ఆకట్టుకున్నాయి.

వైవిధ్యమైన కథాంశాలతో.. చక్కని పాత్ర చిత్రణతో.. సందర్భోచితమైన సంభాషణలతో, పాత్రోచిత మాండలికానికి మాత్రమే పరిమితమవుతూ కథను చక్కగా పలికించగల వివేచనా పరుడైన చక్కని కథాశిల్పి శ్రీ పివిబి శ్రీరామమూర్తి. వీరి కథల మీద కొందరు పిహెచ్‌డి చేస్తున్నారు. వారి కథలను చదివిన వారికి శ్రీరామమూర్తి ఒక పరిశోధకుడిగా, సమాజ పరిశీలకుడిగా, విశ్లేషకుడిగా.. ఓ విమర్శకుడిగా.. పరిణతి చెందిన అనుభవజ్ఞుడిగా.. చక్కని భవితను ఆకాంక్షించే వారిగా.. ఓ బాధ్యతాయుతమైన మేధావిగా తోస్తారు.

వీరు రాసిన.. బిక్ష.. అనే కథను కథల మాస్టారు.. కారా గారిని.. కదిలించి, ప్రశంసించేటట్లు చేసింది. అవును నేను బానిసనే.. అనే కథను ఒక డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి స్వయంగా ఫోన్చేసి 'ఆలోచింపజేసే కథ. ఇటువంటి కథాంశంతో రాయటానికి సాహసం ఉండాలి. మీకు అభినందనలు' అని చెప్పారు.

వీరి సంకెళ్లు.. నవలను చతుర చలసానిప్రసాదరావు గారు చాలా బాగా మెచ్చుకున్నారు. విజయబాపినీడు నిర్వహించిన విజయ మాసపత్రికలో పడిన.. నిప్పు పువ్వు.. అనే కథకు రచయితగా పారితోషకం అందుకున్న తరువాత పాఠక దేవుళ్ళు విపరీతంగా ఇష్టపడిన కథగా ఎంపికై.. కొసరు పారి తోషకం.. అందుకునేటట్లు చేసింది.

'నా ఊపిరి ఉన్నంత వరకు కథలు రాస్తూనే ఉంటాను' అనే శ్రీ పివిబి శ్రీరామమూర్తి యువ రచయితలకు ఆదర్శనీయులు, స్ఫూర్తిదాయకులు.

డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి
బొడ్డపాటి చంద్రశేఖర్
6300346501





హాస్య నాటికలకు ఊపిరి 'సుమధుర'

రంగస్థలం

నాటకం సజీవ కళ. కావ్యేషు నాటకం రమ్యం అంటారు. కళను బతికించాలి. నాటకం మనిషిని ఆలోచింపజేస్తుంది. చైతన్యం కలిగిస్తుంది. తెలుగు నాటకరంగంలో క్రమం తప్పకుండా ఏటేటా పరిషత్తు నిర్వహిస్తున్నవి ప్రస్తుతం సుమారు పాతిక, ముప్పై వరకూ ఉండొచ్చని ఓ లెక్క. వీటిల్లో హాస్య నాటికల పోటీ నిర్వహిస్తున్నది మాత్రం విజయవాడలోని 'సుమధుర కళానికేతన్' ఒక్కటే! అనేకానేక కారణాల రీత్యా మనుషులు బిజీ బిజీగా టెన్షన్స్‌తో కాలం గడుపుతున్నారని అధ్యయనాలు ఉద్ఘాటిస్తున్నాయి. ఈ నేపథ్యంలో- జనానికి ఎంతోకొంత రిలీఫ్ దక్కేలా.. హాయిగా నవ్వుకునేలా.. 'సుమధుర' వారు అనేక వ్యయప్రయాసలకోర్చి ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి హాస్య నాటికల పరిషత్ '25 ఫిబ్రవరి 7, 8, 9 తేదీల్లో సిద్ధార్ధ కాలేజీలో 'సిద్ధార్ధ' సహకారంతో నిర్వహించారు. సంస్థ 51వ వార్షికోత్సవం, 27వ వార్షిక పరిషత్ సందర్భంగా ఈ నవ్వుల పండుగ దిగ్విజయంగా పూర్తిచేశారు.

చాలా పరిషత్తుల మాదిరి ఆహ్వాన నాటికల పోటీ కాకుండా దాదాపు నెల రోజులపాటు ఉభయ రాష్ట్రాల్లో పర్యటించి వైవిధ్య ఇతివృత్తాల నాటికలు ఏడింటిని ఎంపిక చేసి, ప్రదర్శింపజేశారు. కళాకారుల్ని, ఆహూతుల్ని ఆదరించడంలో అతిథి మర్యాదల్లో 'సుమధుర'కు ఓ గుర్తింపుంది. అధ్యక్షుడు సామంతపూడి నరసరాజు, ప్రధాన కార్యదర్శి పి.వి.భాస్కరశర్మ, వ్యవస్థాపకుల్లో ఓ అతి ముఖ్యులు హెచ్వీఆరెస్ ప్రసాద్, గౌరవాధ్యక్షులు డా.ఎం.సి.దాస్, పరిషత్ చైర్మన్ డా.ఎన్.మురళీకృష్ణ తదితరులతో కూడిన బృందం కృషి ఎంతైనా అభినందనీయం. ప్రదర్శించిన నాటకలను పరిమర్శిద్దాం.

వీడేం మగాడండీ బాబూ..! : ఆటల్లో ఓడిపోతే.. చదువుల్లో వెనకబడితే.. ఉద్యోగం రాకపోతే.. వయసు మీరుతున్నా పెళ్లవ్వకపోతే.. సంతానం కలగడం ఆలస్యమైతే... జీవితంలో ఇలా అనేకానేక సందర్భాల్లో 'నువ్వేం మగాడివి', 'వాడేం మగాడు' తీరులో వ్యాఖ్యలు.. అపహాస్యాలు.. ఎత్తిపొడుపులు చాలా తరచుగా గమనిస్తుంటాం. రచయిత పి.టి.మాధవ్ సరిగ్గా దీన్నే ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని ఆద్యంతం హాస్యభరితంగా రంజింపజేశారు. వాక్యాలకు వాక్యాలు, పేరాలకు పేరాల సంభాషణలతో ప్రేక్షకుల మీద దాడి చేయకుండా.. షార్ట్ అండ్ షార్ప్ డైలాగులతో ఆకట్టుకున్న ఈ నాటికలో ఓ ప్రధాన పాత్ర పోషించిన చలపతి దర్శకత్వం నెరిపారు. కళాంజలి, హైదరాబాద్ కళాకారుల బందం చక్కగా ప్రదర్శించింది. ఒకటీ రెండుచోట్ల ద్వంద్వ, శ్లేషార్థాల సంభాషణలు అవసరం లేదేమో అనిపించింది.

వర్క్ ఫ్రం హోం : వంటల్లోనూ ప్రావీణ్యమున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి- వంటిల్లు ముఖమే చూడని ఇల్లాలితో పాట్లు ప్రేక్షకులకు తనివితీరా హాస్యాన్ని పంచాయి. పెళ్లికి ముందు అవురావురు మంటాం.. పెళ్లయ్యాక బావురుమంటాం వంటి ఆసక్తికర సంభాషణలతో సాగిన అద్దేపల్లి భరత్ కుమార్ రచనను కె.మహేంద్ర దర్శకత్వంలో సహృదయ, ద్రోణాదుల కళాకారులు మెప్పించారు.

దంత వేదాంతం : దాదాపు ఆరేడు దశాబ్దాల నాటి హాస్య నాటిక. భమిడిపాటి రాధాకృష్ణ రచనను ఈవన రమేష్ బాబు దర్శకత్వంలో ఈవీఎస్ కళాసమితి, విజయవాడ వారు ప్రదర్శించారు. పచారీ సరుకుల దుకాణంలో గమాక్సిన్, మైదాపిండి పొట్లాలు మారడంతో రేగిన 'భయాందోళనలు' ప్రేక్షకులకు వినోదాన్నిచ్చాయి. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది.


మా ఇంట్లో మహాభారతం : ఇంటి పెద్ద రాజకీయాల వ్యసనం, ముసలాయన 'ఎగస్త్రాలు'.. మూడున్నర పదులు దాటినా కొడుకు ఓ 'పెళ్లికాని ప్రసాద్'... మధ్యలో పెళ్లిళ్ల బ్రోకర్ కమిషన్‌కు కక్కుర్తిపడి ఎన్నో బొంకులు బొంకి ఓ సంబంధం చేయడం... ఆ పిల్ల ఈ 'బడుద్దాయి'ని మాటల్లో పెట్టి.. వగలు ఒలకబోసి మిగిలిన ఆస్తిని తన పేర రాయించుకుని- ఫైనల్‌గా ఆ ఇంటిని ఓ గాటన పెట్టడం... ఇదీ స్థూలంగా ఇతివృత్తం. ఆద్యంతం హాస్యభరితంగా సాగిన ఈ నాటికను రవీంద్రబాబు రచించగా ఎన్.వెంకటేశ్వరరావు దర్శకత్వంలో మద్దుకూరి ఆర్ట్ క్రియేషన్స్, చిలకలూరిపేట కళాకారులు ప్రేక్షక జన రంజకంగా ప్రదర్శించారు. ప్రధాన పురుష పాత్రధారులిద్దరూ ఆద్యంతం.. సమయం, సందర్భం ఏదైనా- చేతి వాచ్ మాత్రం తీయకుండడం కళాకారుల నాన్- సీరియస్నెస్‌కు తార్కాణం లాంటివి.

దొందూ దొందే : నూతన దంపతులిద్దరికీ రేచీకటి. మొదటి రాత్రి సందర్భంగాకానీ ఆ సంగతి తేలదు. ఈ మధ్య జరిగిన ఘట్టాలే దొందూ దొందే ఇతివృత్తం. అశ్లీల, ద్వంద్వార్థాలకు తావీయక ప్రదర్శన నీట్‌గా సాగింది. పెళ్లి తర్వాత ఘట్టంలో కూడా 'పెళ్లి బాసికం'తో రావడం.. వెంటనే గ్రహించి ప్రేక్షకులు చూస్తుండగానే పీకేసుకోవడం రచయిత, దర్శకుడు, ప్రధాన పాత్రధారి డేవిడ్ రాజు వంటి సీనియర్ (జర్నలిస్ట్)కు రాణించదు. ఉత్తమ తృతీయ బహుమతి సాధించింది.

ప్రేమ - పిచ్చి : సినిమా సన్నివేశాల అనుకరణ, ఫేస్‌బుక్ వంటి అధునాతన సోషల్ మీడియాలో పరిచయాలతో పెళ్లి వరకూ లాక్కెళ్లడం... చివరకు అభాసుపాలు గావడం- ఇత్యాది ఘటనలతో గడబిడగా సాగింది. యమ స్పీడుగా చెప్పే ప్రయత్నంలో సంభాషణల్లో స్పష్టత లోపించింది. వెరసి ప్రదర్శన 'క్వాలిటీ స్థాయి' నిలబెట్టుకోలేక.. వాసు వంటి ఓ ఉన్నత శ్రేణి, గర్వించదగిన యువ దర్శకుడి నాటికా ఇది అనిపించింది. పవన్ వంటి సీనియర్, మెచ్యూర్డ్ ఆర్టిస్ట్ నుంచి డైలాగుల్లో క్లారిటీ మిస్సవ్వడం సబబుగా లేదు. నాటికను అందరి కంటే భిన్నంగా, ఉన్నతంగా రూపొందించాలని సినిమా పాటల, మ్యూజిక్ బిట్స్ చేర్చి మాయజేసే ప్రయత్నం చేసినా కూడా సఫలం కాలేదని అభిమానులు నిస్పృహ చెందారు. ఈ నాటిక రచన : గోపి వల్లభ. ప్రదర్శకులు : యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్, విజయవాడ. ఉత్తమ దర్శకుడుగా ఈ నాటిక నుంచి వాసు ఎంపికయ్యారు. ఆవేశంలో ఆనందం : ఆవేశంలో ఆత్మహత్య చేసుకోవడం అభిలషణీయం కాదని, పర్యవసానాలు దారుణంగా ఉంటాయని, కుటుంబాలు బజారునపడతాయని రచయిత మల్లాది రవికిరణ్ ఈ నాటికలో వక్కాణిస్తారు. ప్రధాన ఇతివృత్తానికీ, నాటిక టైటిల్‌కూ పొంతన కుదిరినట్టులేదని కొందరు భావించారు. ఒకే పాయింట్ చెప్పడానికి అంత సాగదీయాలా- హాస్యమూ అంతగా పండలేదని పలువురు పెదవి విరిచారు. మల్లాది క్రియేషన్స్, హైదరాబాద్ కళాకారులు మంజునాథ్ దర్శకత్వంలో ప్రదర్శించారు. ఉత్తమ ప్రదర్శన బహుమతి అందుకుంది. ఉత్తమ రచనగా ఎంపికైంది. పరిషత్ న్యాయ నిర్ణేతలు : సుబ్బరాయశర్మ, ఎస్.కె.మిశ్రో, కోట శంకరరావు. స్క్రూటినీ న్యాయ నిర్ణేతలు : డా. కైలాసరావు, సూర్యనారాయణమూర్తి, సాగర్.

- జి.వి.రంగారెడ్డి, సీనియర్ పాత్రికేయులు
99126 15747

'న్యూ ఇండియా'లో రూ.122 కోట్ల స్కాం



న్యూ ఇండియా కోపరేటివ్ బ్యాంక్ జీఎం హితేష్ మెహతాను ఆదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఆ బ్యాంకులో డబ్బు విత్‌డ్రాపై ఆర్‌బిఐ నిషేధం

ముంబయి. న్యూ ఇండియా కోఆపరేటివ్ బ్యాంకును రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) నిషేధించింది. ఈ సహకార బ్యాంకు నుంచి రుణాలు పంపిణీ చేయకుండా ఆపింది. మరోవైపు ఖాతాదారులు డబ్బు విత్‌డ్రా చేసుకోకుండా ఆంక్షలు పెట్టి.. విచారణకు ఆదేశించింది. ఈ బ్యాంకులో రూ. 122 కోట్ల కుంభకోణం జరిగిందని తేలింది. బ్యాంక్ జనరల్ మేనేజర్ హితేష్ మెహతాపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి, ముంబయి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎలా గుర్తించారు..?

న్యూ ఇండియా కోఆపరేటివ్ బ్యాంక్ జనరల్ మేనేజర్ హితేష్ మెహతా అకౌంట్స్ హెడ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అకౌంట్స్ తనిఖీ చేయగా రూ.122 కోట్ల మేర కుంభకోణం జరిగిందని గుర్తించిన యాక్టింగ్ సీఈఓ దేవర్షి ఘోష్ ఫిర్యాదు చేయటంతో.. స్కాం గుట్టు వెలుగులోకి వచ్చింది. ప్రభాదేవి, గోరేగావ్ శాఖల రిజర్వ్ నిధులను తారుమారు చేశాడని ఆరోపణలున్నాయి. ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిన ముంబయి పోలీసు ఆర్థిక నేరాల విభాగం దర్యాప్తు చేస్తున్నది. మార్చి 2024 నాటికి, ఈ బ్యాంకులో రూ.2436 కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. డిపాజిట్ ఇన్సూరెన్స్ పథకం కింద డిపాజిటర్లకు రూ.5 లక్షల వరకు బీమా క్లెయిమ్ చేసుకునే హక్కు ఉంది. డిపాజిటర్లు తమ క్లెయిమ్‌లను బ్యాంకులో జమ చేయాలని కోరారు.

బ్యాంకుపై ఎందుకు చర్య తీసుకున్నారు?

ఈ బ్యాంకు ద్రవ్యతను దృష్టిలో ఉంచుకుని కేంద్ర బ్యాంకు చర్య తీసుకుంది. ఈ బ్యాంకు లిక్విడిటీ స్థితి గురించి ఆందోళనలు ఉన్నాయి. దీని కారణంగా పొదుపు, కరెంట్ లేదా ఏదైనా ఇతర డిపాజిట్ ఖాతా నుంచి డబ్బును ఉపసంహరించుకోవడంపై ఆర్బీఐ ఆంక్షలు విధించింది. డిపాజిటర్ల ప్రయోజనాలను కాపాడేందుకు ఈ చర్యలు అమలు చేసినట్టు ఆర్బీఐ తెలిపింది. ముంబయిలోని అంధేరీ, బాంద్రా, బోరివలి, చెంబూర్, ఘాట్కోపర్, గిర్గావ్, గోరేగావ్, నారిమన్ పాయింట్, కండివలి, మలాడ్, ములుండ్, శాంతాక్రూజ్ , వెర్సోవాలలో నూతన బ్రాంచీలు ఏర్పాటు చేశారు. వీటితో పాటు నవీ ముంబయి, థానే, పాలెర్, పూణే, సూరత్‌లలో కూడా ఉంది. అయితే బ్యాంకులో స్కాం జరిగిన విషయం తెలియగానే తాము పైసాపైసా కూడబెట్టుకున్న డబ్బులు తిరిగి వస్తాయా..రావా..? అని ఖాతాదారుల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

వసంత ఆత్మహత్య కేసులో.. నాగేంద్రబాబును శిక్షించాలి : ఐద్వా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గోపాలపట్నం సమీపానగల నందమూరి నగర్‌కు చెందిన వసంత ఆత్మహత్య చేసుకునే విధంగా ప్రేరేపించిన భర్త నాగేంద్రబాబును కఠినంగా శిక్షించాలని ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వసంతకు 11 నెలల క్రితం వివాహం జరిగిందని, తొలి నుంచీ భర్త లైంగికంగా, మానసికంగా వేధిస్తుండేవాడని పేర్కొన్నారు. అతని వికృత చేష్టలు, లైంగిక వేధింపులు తట్టుకోలేక ఆమె ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. అశ్లీల సినిమాలకు అలవాటు పడిన నాగేంద్రబాబు ఆ విధంగానే ఉండాలని భార్యను వేధించేవాడని పేర్కొన్నారు. మద్యం, మత్తు మందులకు అలవాటు పడి సైకోలా వ్యవహరించేవాడని తెలిపారు. ఇలాంటి సైకోల చేతిలో ప్రతి రోజూ చాలా మంది వసంతలు బలైపోతున్నారన్నారు. విచక్షణ కోల్పోయి నేరాలు పెరిగిపోవడానికి ప్రభుత్వ విధానాలే కారణమని విమర్శించారు. విపరీతంగా మద్యం షాపులకు లైసెన్సులివ్వడం, మత్తు పదార్థాలపై నియంత్రణ లేకపోవడం, అశ్లీల సినిమాలు, పోర్న్ వీడియోలు మార్కెట్లోకి విచ్చలవిడిగా విడుదలవడం మూలంగా ఇటువంటి సైకోలు పెరుగుతున్నారని తెలిపారు. వారికి శిక్షలు కఠినంగా లేకపోవడం, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా తీర్పులు ఇవ్వకపోవడం వల్ల వారంతా పేట్రేగిపోతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మహిళా రక్షణ కోసం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, వర్మ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. హోం శాఖ మంత్రి వెంటనే జోక్యం చేసుకుని, వసంత కుటుంబానికి న్యాయం చేయాలని, నాగేంద్రబాబును కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకూ తలొగ్గకుండా నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని కోరారు.

మినిమం టైంస్కేల్ సాధనకు ఉద్యమిద్దాం : జెఎసి

ప్రజాశక్తి - క్యాంపస్ (తిరుపతి)

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రభుత్వ కాంటాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులు అందరికీ మినిమం టైం స్కేల్ ఇస్తానని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత జీవో నెంబర్ రెండు పేరుతో ఆర్థిక శాఖ అనుమతి ఉన్న కొంతమందికి ఉద్యోగులకు మాత్రమే వర్తింప చేసింది. దీనిని తక్షణమే సవరించి అందరి ఉద్యోగస్తులకు వర్తింపజేయాలని ఆంధ్రప్రదేశ్ ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర జేఏసీ చైర్మన్ ఏవి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. యశోద నగర్‌లో ఉన్న వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు తిరుపతి జిల్లా జేఏసీ చైర్మన్ గండికోట నాగ వెంకటేశ్ అధ్యక్షతవహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా కాంటాక్ట్, అవుట్సోర్సింగ్ జేఏసీ చైర్మన్ ఏవి నాగేశ్వరరావు విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నంబర్ 2 ను సవరించి అందరికీ ఎంటిఎస్ అమలు చెయ్యాలని కోరారు. సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి అందరికీ సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉద్యోగుల పట్ల కక్షపూరితమైన వైఖరి వీడాలన్నారు. గత 15 సంవత్సరాల నుంచి వేతనం పెంపులో ఎలాంటి మార్పు లేదని, ధరలన్నీ విపరీతంగా పెరిగిపోయినా, ఉద్యోగస్తులు జీతాలు మాత్రం పెరగడం లేదన్నారు. కాంటాక్ట్ వర్కర్స్ జీవితాలలో మార్పు రావాలంటే పోరాటం ఏకైక మార్గం అని పిలుపునిచ్చారు. ఆప్కాస్ రద్దు చేయడం అంటే కాంట్రాక్టర్లకు దోచిపెట్టడమేనన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మూడున్నర లక్షలకు పైచిలుకు ఉద్యోగులకు నోట్లో మట్టి కొట్టడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఆప్కాస్ సంస్థ వలన అనేక రకాల ప్రయోజనాలున్నాయని, ఆప్కాస్ రద్దయిపోతే ఉద్యోగుల భద్రతలో కరువు ఏర్పడుతుందన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్. జయచంద్ర, ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.చిన్నబాబు, జేఏసీ చైర్మన్ గండికోట నాగవెంకటేష్‌లు మాట్లాడుతూ తిరుపతి జిల్లాలోని కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ పార్ట్ టైం, ఎన్.ఎం.ఆర్, కంటింజెంట్, డైలీ వేజెస్, గెస్ట్, సకల తాత్కాలిక ఉద్యోగులందరూ మినిమం టైమ్ స్కేల్ జీవో అమలు కోసం ఉద్యోగ భద్రత రెగ్యులరైజషన్ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

ఈ జిల్లా సదస్సులో 24 డిపార్ట్మెంట్లకు సంబంధించినటువంటి ఉద్యోగ కార్మిక సంఘాల నాయకులు, వెటర్నరీ ఆప్కాస్ నాయకులు గంగయ్య, బాబు, ఎస్‌వియు నాయకులు రాజేంద్ర, గణేష్, మురగయ్య, సుమతి, అగ్రికల్చర్ వర్కర్స్ నాయకులు వరలక్ష్మి, మునిలక్ష్మి, సుబ్బరత్నమ్మ, చంద్రమ్మ, అనురాధ, నేషనల్ హెల్త్ మిషన్ నాయకులు ఈ. లోకేష్ బాబు, ఎస్. మొహిద్దీన్, జి నారాయణమ్మ, సమగ్ర శిక్ష ఉద్యోగ సంఘం నాయకులు మునికష్ణ, ప్రదీప్ కుమార్, మహదేవయ్య, 104 ఉద్యోగ సంఘం నాయకులు అమర్నాథ్, బత్తిరెడ్డి, భువనేశ్వరి, 108 ఉద్యోగ సంఘ నాయకులు మహేష్, రుయా ఆప్కాస్ నాయకులు నర్సింహులు, నిర్మల ఉష, రైల్వే కాంట్రాక్ట్ వర్కర్ నాయకురాలు రేఖ, జూ పార్క్ వర్కర్స్ నాయకులు ఈశ్వర్ రెడ్డి, విద్యుత్ కాంట్రాక్ట్ వర్క్ యూనియన్ నాయకులు సుదర్శన్ రెడ్డి, టి. కుమార్, రవికుమార్, తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శన నిలిపివేత

- ఎబివిపి వ్యతిరేకతతో ఉత్తరాఖండ్‌లో బిజెపి సర్కారు నిర్వాకం
- సర్కారు తీరుపై సర్వత్రా విమర్శలు

డెహ్రాడూన్: నాగరిక సమాజంలో పుస్తక ప్రదర్శనలు నిర్వహించటానికి ఎవరికీ ఎలాంటి అభ్యంతరమూ ఉండదు. కానీ ఉత్తరాఖండ్‌లో నిర్వహించనున్న పుస్తక ప్రదర్శనను ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ విద్యార్థి విభాగమైన ఎబివిపి వ్యతిరేకించింది. దీంతో అక్కడి బిజెపి ప్రభుత్వం బుక్‌ఫెయిర్‌ను రద్దు చేసింది. శ్రీనగర్, పౌరి గర్వాల్‌లో 15, 16 తేదీలలో జరగాల్సిన పుస్తక ప్రదర్శన అకస్మాత్తుగా రద్దు చేయడంతో పుస్తకప్రేమికులు షాక్‌కు గురయ్యారు. అయితే ఈ నిర్ణయానికి ప్రధాన కారణం ఏబీవీపీనేనని నిర్వాహకులు అంటున్నారు. గాంధీ, నెహ్రూ వంటి నేతల జీవితాలు, వారసత్వాలకు సంబంధించిన సాహిత్యాన్ని విక్రయించడంపై ఏబీవీపీ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఈ పుస్తకాలను చేర్చడాన్ని ఏబీవీపీ వ్యతిరేకించిందనీ, చివరికి మేము ఈవెంట్‌ను రద్దు చేయాల్సి వచ్చిందని నిర్వాహకులలో ఒకరు విచారం వ్యక్తం చేశారు. పుస్తక ప్రదర్శన రద్దు ఆరోపణలపై సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్ నూపుర్ వర్మ స్పందిస్తూ.. రాజకీయ ఒత్తిడి కారణంగా పుస్తక ప్రదర్శనకు అనుమతి నిరాకరించారనే వాదనలు నిరాధారమైనవని అన్నారు. కేవలం షెడ్యూల్ విభేదాల కారణంగానే ఇది జరిగిందని వర్మ స్పష్టం చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ నిర్వహించే ముందస్తు షెడ్యూల్ కార్యక్రమానికి రాంలీలా మైదానం ఇప్పటికే రిజర్వు చేయబడిందని వివరించారు.

శ్రీనగర్‌లో జరగనున్న పుస్తక ప్రదర్శన రద్దుపై నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. స్థానిక యంత్రాంగం సాహిత్య కార్యక్రమాలపై పక్షపాతంతో వ్యవహరిస్తుందని ఆరోపించింది. శ్రీనగర్ వంటి విద్యా కేంద్రానికి ఈ సంఘటన "దురదృష్టకరం" అని వివరించింది. ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శి అంకిత్ సుంద్రియల్, రాష్ట్ర కార్యదర్శి ముకుల్ కుమార్ సంయుక్తంగా మాట్లాడుతూ.. "పుస్తక ప్రదర్శనలో ప్రఖ్యాత గర్వాలి కళాకారుడు నరేంద్ర సింగ్ నేగి పాల్గొననున్నారు. హిందీ, ఇంగ్లీష్ , స్థానిక గర్వాలి రచయితల నుంచి 75,000కి పైగా పుస్తకాలు ప్రదర్శించారు" అని అన్నారు. సుందరియల్ మాట్లాడుతూ "బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ విద్యార్థి సంస్థ ఈ కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తున్నట్టు వెలుగులోకి వచ్చింది. నరేంద్ర సింగ్ నేగి కూడా ఈ ప్రదర్శనకు అనుమతి నిరాకరించడంపై సోషల్ మీడియాలో తన అసంతృప్తిని వ్యక్తం చేశారు" అన్ని చెప్పారు. "ఇది పుస్తకాలకు వ్యతిరేకత మాత్రమే కాదు, మన సంస్కృతికి వ్యతిరేకత. విద్యా కార్యకలాపాలకు ఆటంకం కలిగించే ఏ సంస్థకైనా తనను తాను విద్యార్థి సంస్థగా పిలుచుకునే హక్కు లేదు" అని సుంద్రియల్ నొక్కిచెప్పారు. పుస్తక ప్రదర్శన రద్దు గురించి రచయిత , చరిత్రకారుడు జైసింగ్ రావత్ ఆందోళనలను వ్యక్తం చేశారు. "పుస్తకాల భయం ఉందంటే అవి ఇప్పటికీ అధికారాన్ని కలిగి ఉన్నాయని సూచిస్తుంది. ఆర్టికల్ 19 ప్రతి పౌరుడికి భావ ప్రకటనా స్వేచ్ఛను హామీనిస్తుంది. సాహిత్య రంగంలో ఇటువంటి రాజకీయ ఆక్రమణ ప్రజాస్వామ్య వాతావరణానికి హానికరం" అని పేర్కొన్నారు.

15న నేషనల్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను సత్కరించాలనే సదుద్దేశంతో మార్చి 15న విశాఖలోని వుడా చిల్డ్రన్స్ ఎరీనాలో ఎఫ్‌టిపిసి ఇండియా సిటిజన్ ఫోర్స్ ఎక్సలెన్స్ జాతీయ పురస్కారాలను ప్రదానం చేయనున్నట్టు సంస్థ వ్యవస్థాపకులు పి.రమేష్ బాబు తెలిపారు. ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అందుకు సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో విద్య, ఇతర రంగాల్లో ప్రముఖులను గుర్తించి సత్కరించి గౌరవించాలన్న ఉద్దేశంతో తమ సంస్థ 12వ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సినీ నటి పాయల్ ముఖర్జీ మాట్లాడుతూ నేషనల్ ఎక్సలెన్స్ అవార్డుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బ్రెజిల్ వేదికగా బ్రిక్స్ సదస్సు

- జులై 6, 7 తేదీల్లో నిర్వహణ
- ఆ దేశ విదేశాంగ మంత్రి మౌరో వియోరా వెల్లడి

రియో డి జనీరో : బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు బ్రెజిల్ లోని రియో డి జనీరోలో జరగనున్నట్టు అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. జులై 6, 7 తేదీల్లో దీనిని నిర్వహించనున్నట్టు ఆ దేశ విదేశాంగ మంత్రి మౌరో వియోరా వివరించారు. బ్రిక్స్ దేశాల అభివృద్ధి, సహకారం, ప్రజల జీవితాలను మెరుగుపరిచేందుకు ఈ సదస్సుల్లో పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్టు తెలిపారు.గతేడాది అక్టోబరులో రష్యాలోని కజాన్ నగరం వేదికగా ఈ సదస్సు జరిగిన సంగతి తెలిసిందే. దీనికి ప్రధాని మోడీ, రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో సహా పలువురు దేశాధినేతలు హాజరయ్యారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలోని పరిస్థితులు, ఉగ్రవాదం వంటి సమస్యలపై దేశాధినేతలు చర్చించారు. ఈ సమావేశంలోనే భారత్, చైనాల సరిహద్దు వివాదంపై కీలక చర్యలు తీసుకొన్నారు. బ్రిక్స్ దేశాలు ఉమ్మడి కరెన్సీ రూపొందించడంపై దృష్టి సారించాలని పుతిన్ ఆ సదస్సులో పిలుపునిచ్చారు. ప్రస్తుతం కూటమిలోని దేశాలు డిజిటల్ కరెన్సీ వాడుకునేందుకు భారత్‌తో కలిసి రష్యా పని చేస్తుందన్నారు. ఈ ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీవ్రంగా పరిగణించారు. డాలర్‌కు ప్రత్యామ్నాయంగా మరో కరెన్సీని వాడకంలోకి తెస్తే ఆ దేశాలపై 100 శాతం సుంకాలు విధిస్తామంటూ హెచ్చరించారు.

వామ్మో పులులు..

- పులుల సంచారంతో హడలెత్తుతున్న ప్రజలు


ప్రజాశక్తి-పులివెందుల టౌన్ (వైఎస్ఆర్ జిల్లా)

వైఎస్ఆర్ జిల్లా పులివెందుల నియోజక వర్గంలో పులుల సంచార వరుస సంఘటనలతో కంటిమీద కునుకు లేకుండా రైతులు, ప్రజలు హడలె త్తుతున్నారు. పొలా లలోకి వెళ్లాలంటే రైతులు భయపడుతున్నారు. పులి వెందుల మండల పరిధిలోని ఆర్ . తుమ్మలపల్లి గ్రామ పొలాలలో ఆదివారం ఉదయం పులిపిల్ల సంచ రించినట్లు ప్రజలు తెలి పారు. గంగిరెడ్డి అనే రైతు నువ్వుల పంటలో పులి పిల్ల కనిపించిందని కేకలు వేయడంతో పారిపోయిందన్నారు. పది రోజుల నుంచి పులివెందుల నియోజకవర్గంలో పలు ప్రాంతాలలో పులి కనిపించిందని స్థానికులు పేర్కొంటున్నారు. మండల పరిధిలో నల్లపు రెడ్డి గ్రామ సమీపంలోని నాగమ్మ కుంటలో పులి సంచరించినట్లు రైతు విష్ణు వర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. అరటి సాగు నిమిత్తం తోట వద్దకు వెళు తుండగా అటువైపు పులి వెళ్లినట్లు గుర్తించానని, దాని అడుగులు ఫొటో తీశానని చెప్పారు. ఇకపోతే లింగాల మండలం కామసముద్రం గ్రామంలో మిద్దె ఆదినారాయణ అనే రైతు పొలం వద్ద ఒక పెద్ద పులి, మూడు చిన్న పులులు సంచరిస్తున్నట్లు సమాచారం ఇవ్వడంతో ఫారెస్ట్ అధికారులు, స్థానిక పోలీసులు, లింగాల తహశీల్దార్ ఈశ్వరయ్య పరిసర ప్రాంతాలలో పరిశీలించి చుట్టుపక్కల రైతులను ఆ పరిసర ప్రాంతాలకు వెళ్ళవద్దని గ్రామ రెవెన్యూ సహా యకుల ద్వారా సమాచారం ఇచ్చారు.

రియల్ మోసం

- పదేళ్లుగా లబ్ధిదారులకు చూపని స్థలాలు
- లబోదిబోమంటున్న బాధితులు

ప్రజాశక్తి- పాలకొండ (పార్వతీపురం మన్యం జిల్లా)



చౌకగా ఇంటి స్థలాలు ఇస్తామని కొంతమంది వ్యాపారులు రియల్ ఎస్టేట్ ముసుగులో కోట్లాది రూపాయలను కాజేసిన వైనం ఆలస్యంగా వెలుగు చూసింది. పదేళ్ల నుంచి ఒక్కరికి కూడా స్థలం అప్పజెప్పకపోవడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ఇందుకు సంబంధించిన బాధితుల కథనం ప్రకారం... పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలాన్ని వ్యాపార కేంద్రంగా చేసుకొని కొంతమంది వ్యాపారులు దుర్గా ప్రసన్న రియల్ ఎస్టేట్ పేరిట ఒక కార్యాలయాన్ని తెరిచారు. పాలకొండ పట్టణానికి పక్కనే ఉన్న శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలంలో తుడ్డలి గ్రామం వద్ద పది ఎకరాల స్థలంలో రియల్ ఎస్టేట్ వెంచర్ వేస్తున్నామని ప్రకటించారు. ఇందుకుగానూ రూ.600 చొప్పున 66 నెలలతో స్కీమ్ పెట్టారు. ఇందులో సుమారు వెయ్యి మంది వరకు చేరారు. ప్రతి నెలా డబ్బులు వసూలు చేస్తున్నారు కానీ, ఈ స్కీంలో చేరిన ఒక్కరికి కూడా కనీసం బిట్ ఇవ్వకుండా అదుగో ఇదుగో అంటూ కాలయాపం చేశారు. నేటికి సుమారు పదేళ్లు కావస్తున్నా లేవుట్ వేస్తామన్న భూమిలో పనులేమీ కాలేదు. ఇప్పటికీ ఈ భూమిలో వ్యవసాయమే సాగువుతుంది. లేఅవుట్ వేసి రోడ్లు, కాలువలు నిర్మించలేదు. ఒక విద్యుత్ స్తంభం కూడా లేదు. దీంతో, రియల్ ఎస్టేట్ వ్యాపారులపై పట్టణ వాసులు గుర్రుమంటున్నారు. ఈ లేఅ వుట్‌కు ఎటువంటి అనుమతులు లేవు. పది ఎకరాల భూమికి నాలా మాత్రమే చెల్లించారు, వుడా అప్రోలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ అనుమతులు కూడా పొందలేదు. స్థలంలో ఆ పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేయాల్సి కూడా ఉండగా, అదీ లేదు. ఇంత ఘరానా మోసం చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారులు దర్జాగా తిరుగుతుండడంతో ప్రతి ఒక్కరు ముక్కున వేలేసుకుంటున్నారు.

స్థలం ఎక్కడుందో చూపించలేదు

దుర్గా ప్రసన్న రియల్ ఎస్టేట్లో 66 నెలవారీ వాయిదాలు పూర్తిగా చెల్లించాను. నేటికీ పదేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు స్థలం ఎక్కడ ఉందో కూడా చూపించలేదు. సభ్యులుగా చేర్పించే ముందు బూర్జ మండలం తుడ్డలి గ్రామం దగ్గర స్థలం చూపించారు. అయితే, అవన్నీ పంట పొలాలుగానే ఉన్నాయి. దారుణంగా మోసపోయాం.

-డి వెంకట రమణ రాజు, బాధితుడు, పాలకొండ

స్థలం ఇవ్వలేదు

పైసా పైసా పోగుచేసి నెల వారీ 66 నెలలు వాయిదాల రూపంలో దుర్గాప్రసన్న రియల్ ఎస్టేట్లో డబ్బులు కట్టాం. ఇంతవరకు స్థలం చూపించలేదు. రిజిస్ట్రేషన్ కూడా చేయలేదు.

-దుప్పాడ పాపి నాయుడు, బాధితుడు, పాలకొండ

లేబర్ కోడ్స్‌పై ఉద్యమించాలి

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి -గాజువాక (విశాఖ)

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్స్‌పై కార్మికులు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు చెప్పారు. విశాఖ డెయిరీ కార్మికులతో ఆదివారం సమావేశమై లేబర్ కోడ్స్, చట్టాలపై వివరించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 2019వ సంవత్సరంలో లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చిందని తెలిపారు. ఇది చాలా ప్రమాదకరమన్నారు. కార్మిక హక్కులపై దాడి లాంటిదన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్ వంటి వాటిని యాజమాన్యాలు అమలు చేయాల్సిన అవసరం ఉండదని తెలిపారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ లేబర్ కోడ్స్‌ను అమలు చేయడానికి సాహసించలేదన్నారు. ఇటీవల కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ట్రేడ్ యూనియన్ నాయకుల సమావేశంలో ఏప్రిల్ నెలలో లేబర్ కోడ్స్‌ను అమలు చేస్తామని చెప్పారని, దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేయాల్సి ఉందని తెలిపారు. ఈ నెల 18వ తేదీన 11 కార్మిక సంఘాలు ఏ విధంగా ఉద్యమాలు చేయాలనే నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపారు. స్థానికంగా ఉన్న కార్మికులకు దీని నష్టాలను తెలియజేయాలని కోరారు. లేబర్ కోడ్స్ వల్ల యజమానికి లాభం, కార్మికులకు నష్టం జరుగుతుందన్నారు. విశాఖ డెయిరీ కార్మికులు ఐక్యమత్యంతో పోరాడి విజయం సాధించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కెఎం.శ్రీనివాసరావు, ఎం.రాంబాబు, ఎన్.రాజేంద్రప్రసాద్, విశాఖ డెయిరీ సిఐటియు నాయకులు ఎం.రమణ, మూర్తి, కార్మికుల పాల్గొన్నారు.

అపరాలపై తెగుళ్ల దాడి..!

- మినుము, పెసర రైతులు గగ్గోలు
- వైరస్, తెగుళ్లతో దెబ్బతింటున్న పంట
- దాదాపు 40 వేల ఎకరాల్లో అపరాల సాగు
- ఎకరాకు రూ.20 వేలకు పైగా పెట్టుబడి ఖర్చు
- దిగుబడిపై తీవ్ర ప్రభావం పడనుందని అన్నదాత ఆందోళన
- వ్యవసాయాధికారులు పట్టించుకోవాలని వేడుకోలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మినుము, పెసర, కందులు, ఉలవలు వంటి అపరాల పంటలపై వైరస్ తెగుళ్లు దాడి చేస్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో పంట చివరి దశలో దెబ్బతినే పరిస్థితి ఏర్పడడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. తగు సూచనలు, సలహాలు ఇవ్వాల్సిన వ్యవసాయాధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే పెద్దఎత్తున పెట్టుబడి ఖర్చు అవ్వడంతో తమ పరిస్థితి ఏంటన్న భయం అన్నదాతను వెంటాడుతోంది. జిల్లాలో ఏలూరు, పెదపాడు, దెందులూరుతోపాటు ఇతర మండలాల్లోనూ రైతులు పెద్దఎత్తున అపరాల సాగు చేపట్టారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా పెసర పంట 15,847 ఎకరాల్లో, మినుము సాగు 23,437 ఎకరాల్లో, 23 ఎకరాల్లో కంది, 156 ఎకరాల్లో ఉలవ, ఇతర పంటలు కలుపుకుని మొత్తం దాదాపు 39,475 ఎకరాల్లో రైతులు అపరాల సాగుచేశారు. పశ్చిమలోనూ పలుచోట్ల అపరాల సాగు సాగుతోంది. ప్రస్తుతం పంటంతా పూత, పిందె దశలో ఉంది. దాళ్వా లేకపోవడంతో పెదపాడు వంటి మండలాల్లో అపరాల సాగుపైనే రైతులు పూర్తిగా ఆధారపడిన పరిస్థితి నెలకొంది. పూత, పిందె దశలో వైరస్, తెగుళ్లు అపరాల పంటలను నాశనం చేస్తున్నాయి. ఆకులు ఎండిపోయి మొక్క దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. తెగుళ్లను అరికట్టేందుకు రైతులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. పెద్ద ఎత్తున పురుగుమందులు పిచికారీ చేస్తున్నారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో రైతులకు ఏంచేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. పురుగుమందు పిచికారీ చేయాలంటే ఎకరాకు ప్రతిసారీ రూ.రెండు వేల నుంచి రూ.మూడు వేల వరకూ అవుతోందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఈ దశలో తెగుళ్ల దాటితో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపనుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అన్ని ఖర్చులూ కలుపుకుని ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకూ అవుతోందని రైతులు చెబుతున్నారు. దిగుబడి సరిగ్గా రాకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడనుంది. ఏలూరు రూరల్‌లోని మాదేపల్లి, లింగారావుగూడెం గ్రామాల్లో అపరాల పంటలపై వైరస్, తెగుళ్లు మరింత ఎక్కువగా ఉన్న పరిస్థితి ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. తెగుళ్ల నివారణకు సంబంధించి రైతులకు సరైన సూచనలు ఇవ్వాల్సిన స్థానిక వ్యవసాయశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెగుళ్ల నివారణకు సంబంధించి అధికారులు రైతులకు సరైన సూచనలు, సలహాలు ఇస్తే మేలు జరిగే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా తెగుళ్లతో పంట దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సి ఉంది.

కౌలురైతులపై తీవ్ర ప్రభావం

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో వ్యవసాయ సాగులో 70 శాతం కౌలురైతులే చేస్తున్నారు. పంటలు దెబ్బతింటే కౌలురైతులే తీవ్రంగా నష్టపోతున్నారు. ఆ కారణంగానే కౌలురైతుల ఆత్మహత్యలు చోటు చేసుకుంటున్నాయి. ఖరీఫ్‌లో తుపాన్లు, భారీ వర్షాలతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. పంట నష్టపరిహారం మాత్రం భూ యజమానుల ఖాతాల్లోకి చేరింది. ఇప్పుడు అపరాల సాగులోనూ కౌలురైతులే అత్యధికంగా ఉన్నారు. పంట దెబ్బతింటే కౌలు రైతులు నష్టపోనున్నారు. కౌలు రైతులకు అండగా ఉంటామంటూ అధికారంలోకొచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటికీ వారికి అనుకూలంగా ఏ ఒక్క నిర్ణయమూ తీసుకోలేదు. కొత్త కౌలుచట్టం తెస్తామని హామీ ఇచ్చిన పట్టించుకోని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం అందించే ఏ ఒక్కసాయమూ కౌలురైతులకు అందడం లేదు. అపరాల రైతుల సమస్యలపై అధికారులు దృష్టిసారించి ఆదుకోవాల్సి ఉంది.

అపరాల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

కృష్ణా డెల్టా పరిధిలో రెండో పంటకు సాగునీరందక పెద్దఎత్తున రైతులు అపరాల సాగు చేపట్టారు. తెగుళ్లకు సంబంధించి పురుగుల మందులకు రూ.వేలు ఖర్చు చేస్తున్నా ఫలితం లేకుండా పోయింది. పూత, పిందె దశలో పంటలు ఎండిపోతున్నాయి. ఎకరాలకు రెండు, మూడు క్వింటాళ్ల దిగుబడి వచ్చే పరిస్థితి కూడా కనిపించడం లేదు. నష్టపోతున్న అపరాల రైతులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని కోరుతున్నాం.

కె.శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

- టిడిపి, వైసిపి కుమ్మక్కు రాజకీయాలే కారణం
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన తీవ్ర అన్యాయానికి రాష్ట్రంలోని టిడిపి, వైసిపిల కుమ్మక్కు రాజకీయాలే కారణమని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ విమర్శించారు. ఆదివారం కడప నగరంలోని రామకృష్ణనగర్‌లోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో వైఎస్ఆర్ జిల్లాలో స్టీల్‌ప్లాంట్ మొదలు కుని, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు, రాజధానికి అమరావతి నిర్మాణానికి సైతం అప్పురూపంలో మాత్రమే విధిలింపులు చేసిందన్నారు. వైసిపి హయాంలో బటన్ నొక్కుడు రాజకీయాలతో విదిలింపులు చేసి, బటన్ నొక్కుడు ముసుగులో దోపిడీ రాజకీయాలు చేశారని విమర్శించారు. కరువు, నిరుద్యోగం, వరదలకు తావే లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2020 విజన్ డాక్యుమెంట్ స్థానంలో 2047 విజన్ డాక్యుమెంట్ పేరుతో కలలో తేలియాడే భ్రమలు కల్పిస్తున్నారన్నారు. మోసపూరిత రాజకీయాల కారణ ంగానే 2019లో తోకకత్తిరించారని గ్రహించాలని తెలిపారు. సాగునీరు మొదలుకుని రహదారులు, ప్రభుత్వ మెడికల్ కళాశాలల వరకు ప్రయివేటు జపం చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలోని ప్రధాన పార్టీలైన టిడిపి, వైసిపి కుమ్మక్కు రాజకీయాల్లో మునిగిన నేపథ్యంలో బిజెపి తమ కార్పొరేట్, మతోన్మాద రాజకీయాలను వేగవంతం చేయడానికి గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అదానీ సోలార్ విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని అధికార టిడిపి లోపాయికారీగా అంగీకరిస్తున్నట్లు ఉందన్నారు. గత వైసిపి హయాంలో కుదిరిన రూ.150 కోట్ల అక్రమ అదానీ ఒప్పందాలను రద్దు చేయకపోవడంలోని ఆంతర్యమేమిటో వెల్లడించాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లోని హూతి, కుకీ జాతి ప్రజల మధ్య ఆయుధాలతో యుద్ధం చేయాల్సిన దుస్థితికి కేంద్ర, రాష్ట్రాల్లోని బజెపి సర్కార్లే కారణమని ఆరోపించారు. కుంభమేళా పేరుతో నిర్వహిస్తున్న హిందు ఆదిపత్య రాజకీయాలతో తొక్కిసలాటలతో పదుల సంఖ్యలో మనుషులు చనిపోవడానికి బిజెపి సర్కార్ల అసమర్థ నిర్వాకమే కారణమని విమర్శించారు. కార్యక్ర మంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.రామ్మోహన్, బి.మ నోహర్, జి.శివకుమార్, వి.అన్వేష్ పాల్గొన్నారు.

కాకినాడలో ఎల్ఎన్‌జి ఇంపోర్ట్ టెర్మినల్

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ పోర్ట్‌లో భారీ పెట్టుబడితో లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్(ఎల్ఎన్‌జి)టెర్మినల్‌ను నెలకొల్పేం దుకు నార్వే సంస్థ ముందుకు వచ్చింది. నార్వేకు చెందిన క్రౌన్ ఎల్ఎన్‌జి సంస్థ రూ.9 వేల కోట్ల భారీ పెట్టుబడి పెట్టేందుకు ఆదివారం ఎంపి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ సమక్షంలో క్రౌన్ ఎల్ఎన్‌జి సిఇఒ స్వపన్ కటారియా, ఇండియన్ గ్యాస్ ఎక్స్ఛేంజ్ ఎండి రాజేష్‌కుమార్ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ వికసిత్ భారత్-2047లో భాగంగా ఎన్‌డిఎ ప్రభుత్వం ఎనర్జీ సెక్టార్‌పై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఎపి ప్రభుత్వం ఎనర్జీ సెక్టార్‌పై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. క్రౌన్ ఎల్ఎన్‌జి భారీ పెట్టుబడితో ఇంపోర్ట్ గ్యాస్ టెర్మినల్‌ను ఏర్పాటు చేస్తుందన్నారు. కాకినాడ పోర్ట్‌లో ఏర్పాటు చేస్తున్న ఈ టెర్మినల్ ప్రపంచంలోనే రెండవది కాగా, ఆసియాలో మొట్టమొదటి ప్రాజెక్ట్ అవుతుందన్నారు. కాకినాడ పోర్టు నుంచి సుమారు 15 కి మీ దూరంలో సముద్ర తీరాన ఏర్పాటు కానున్న ఈ టెర్మినల్ పైప్‌లైన్ల ద్వారా ఏడాదికి 7.2 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్యాస్ ఉత్పత్తి కానుందని, దీంతో పెద్దఎత్తున యువతకు ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు.

పారా క్రీడలకు జిల్లా క్రీడాకారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



జాతీయ పోటీలకు పయనమైన క్రీడాకారులు

ఈ నెల 17 నుంచి 20 వరకు చెన్నైలో జరిగే 23వ పారా జాతీయ స్థాయి ఛాంపియన్ షిప్ పోటీలకు ఆదివారం జిల్లా క్రీడాకారులు బయల్దేరి వెళ్లారు. వీరికి పారా జిల్లా గౌరవాధ్యక్షులు కె.దయానంద్ శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ స్థాయిలో సత్తా చాటి, జిల్లా ప్రతిష్టను మరింతగా పెంచాలని ఆయన ఆకాంక్షించారు. ఈ నెల 2న మంగళగిరిలో జరిగిన పారా రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన సుంకరి దినేష్, దొగ్గా దేముడు నాయుడు, బోధల వాసంతి, కిల్లాక లలిత.. పరుగు 100 మీటర్లు, 400 మీటర్లు, షాట్ పుట్ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

కునారిల్లుతున్న సిపిడబ్ల్యుఎస్‌లు

- వేతనాల కోసం కార్మికులకు తప్పని వెతలు
- నిర్వహణకు తప్పని ఇక్కట్లు
- 14 ఏళ్లుగా అవే ఫిల్టర్ బెడ్స్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రతి ఇంటికి సురక్షిత తాగునీటిని అందించాలన్నది ప్రభుత్వం లక్ష్యం. ప్రతి పౌరుడికి రోజుకు సగటున 55 లీటర్ల నీటిని గ్రామీణ ప్రాంతాల్లో అందిస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఈ మేరకు జల జీవన్ మిషన్ అనే కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ ఏడాదిలోపు అన్ని ఇళ్లకు వ్యక్తిగత కుళాయి కనెక్షన్‌తోపాటు తాగునీరు అందివ్వాలన్నది లక్ష్యం. అయితే ఇది జరగాలంటే కీలకంగా ఉండాల్సినది బహుళ రక్షిత మంచినీటి పథకాలు (సిపిడబ్ల్యుఎస్). ఉమ్మడి అనంతపురం జిల్లాలో బహుళ రక్షిత మంచినీటి పథకాలు మొత్తం 67 ఉన్నాయి. అనంతపురం జిల్లాలో 48కాగా, సత్యసాయి జిల్లాలో 19 ఉన్నాయి. ఇందులో అత్యధిక గ్రామాలకు తాగునీటిని అందించే పథకాలు సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకాలు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కింద 850 గ్రామాలకు నీటిని అందిస్తుండగా, సత్యసాయి కింద 1125 గ్రామాలున్నాయి. ఇవి కాకుండా తక్కినవి చిన్నచిన్న తాగునీటి పథకాలు నడుస్తున్నాయి.

ప్రధాన తాగునీటి ప్రాజెక్టుల నిర్వహణే అంతంత మాత్రం

జిల్లాలో అతి పురాతనమైనది సత్యసాయి తాగునీటి పథకం. 1995లో ఇది ప్రారంభమైంది. అంటే ఇప్పటి సరిగ్గా 30 సంవత్సరాలవుతోంది. అప్పట్లో వేసిన ప్రధాన పైపులైన్‌లో చాలా వరకు దెబ్బతిని ఉన్నాయి. దీంతో తరచూ అనేక చోట్ల మరమ్మతులకు గురవుతున్నాయి. ఇక శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ప్రారంభమై కూడా 14 సంత్సరాలకుపైగా అవుతోంది. ఈ ప్రాజెక్టు నిర్మాణ సమయంలోనే లోపాలు జరిగాయని విజిలెన్సు ఎన్‌ఫోర్సుమెంటు శాఖ నివేదిక కూడా ఇచ్చింది. ఈ మేరకు ప్రారంభం నుంచి ఈ తాగునీటి పథకం పైపులైన్‌లు తరచూ పగిలిపోవడం వంటివి జరుగుతున్నాయి. ఇకపోతే ఈ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ర్యాపిడ్ సాండ్ ఫిల్టరేషన్ బెడ్స్ వేశారు. అంటే నీటిని శుద్ధి చేసే సమయంలో బెడ్స్‌లో ఇసుక ద్వారా నీరు శుద్ధి అయి వస్తూ ఉంటాయి. ఈ బెడ్స్‌లోని ఇసుక సగటున మూడు నుంచి ఐదు సంవత్సరాలకు ఒకసారి మార్చాల్సి ఉంటుంది. అంటే పాత ఇసుకను తొలగించి కొత్తది వేయాలి. అప్పుడే నీటిశుద్ధి సామర్థ్యం మెరుగ్గా ఉంటుందని నిపుణులు చెబుతున్న మాట. అయితే వేసినప్పటి నుంచి ఇప్పటి వరకు దీన్ని మార్పు చేసిన దాఖలాల్లేవు. ఈ విషయం సాక్షాత్తు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పరిశీలనలో వెల్లడైంది. ఇక నిర్వహణ, కాంట్రాక్టు విషయాల్లో అనేక లోటుపాట్లు కనిపిస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. 2024 మార్చి నాటికి పాత కాంట్రాక్టరు గడువు ముగిసింది. అయితే అధికారులేమో పాతవారిని కొనసాగిస్తున్నామని చెబుతుండగా, కాంట్రాక్టర్లు మాత్రం తమకు పొడగించమని అధికారిక ఉత్తర్వులేవీ ఇవ్వలేదని చెబుతుండటం గమనార్హం. దీంతో నిర్వహణలోనూ అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. కనగానపల్లి-రామగిరి, ఓడిసి సిపిడబ్లుఎస్ స్కీమ్‌లు దాదాపు మూతపడే దశకు వచ్చాయి. మరికొన్ని ఇదే విధంగా ఉన్నాయి.

వేతనాలకు వెతలు

ఈ మొత్తం స్కీముల్లో కలిపి సుమారు వెయ్యి మంది వరకు కార్మికులు పనిచేస్తున్నారు. ప్రజలకు తాగునీటిని అందించడంలో వీరు అహర్నిశలు పనిచేస్తుంటారు. అయితే ఈ పనిచేసే కార్మికులకు నిత్యం పస్తులు తప్పడం లేదు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో సుమారు 600 మంది వరకు కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి ఆరు మాసాలుగా వేతనాలు అందలేదు. హిందూపురం డివిజన్ పరిధిలో అయితే ఏకంగా పది మాసాలుగా వేతనాల్లేవు. ఇక పిఎఫ్ అయితే 24 మాసాలుగా చెల్లించకుండా ఉన్నారు. ఈ వేతనాల కోసం కార్మికులు నిత్యం సమ్మెలు చేయాల్సిన పరిస్థితులు నెలకొంటాయి. గతేడాదిలో మూడు సార్లు కార్మికులు సమ్మె చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 17 నుంచి సమ్మెలోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వేతనాలను చెల్లించాలని కోరుతున్నారు.

గత ప్రభుత్వం నిర్ణయంతో మరింత దెబ్బ

గతంలో అధికారంలోనున్న వైసిపి ప్రభుత్వం క్వాలిటీ కంట్రోల్ క్వాలిటీ అసస్‌మెంట్ పేరుతో కొంత మంది ఇంజనీర్లతో తాగునీటి పథకాల నిర్వహణపై అధ్యయనం చేయించింది. ఈ కమిటీ పరిశీలించి నిర్వహణ మెరుగుకు సలహాలు కాకుండా ఖర్చును తగ్గించుకునే అంశాలపైనే ఎక్కువగా దృష్టి సారించిందన్న విమర్శ ఉంది. అందులో కీలకమైనది కార్మికుల సంఖ్యను కుదించమని సూచించినట్టు తెలుస్తోంది. అంతేకాకుండా ఇప్పుడు నడుస్తున్న మూడు షిప్టులను కాదని, దాన్ని రెండు షిఫ్టులకు మార్చాలని అందులో పేర్కొన్నట్టు సమాచారం. అయితే ఈ నివేదిక అధికారికంగా బయటకు వెళ్లడవలేదు. దీని ఆధారంగా త్వరలో ఈ ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించే అవకాశాలున్నట్టు కూడా తెలుస్తోంది. అయితే ఈ విషయాన్ని అదికారులెవరూ ధ్రువీకరించలేదు.

మంట పుట్టిస్తున్న మటన్

- భారీగా పెరిగిన మటన్ ధరలు
- కిలో రూ.800 నుంచి రూ.1,000
- బర్డ్‌ఫ్లూ తో తగ్గిన చికెన్ అమ్మకాలు
- సొమ్ము చేసుకుంటున్న మటన్ వ్యాపారులు



ప్రజాశక్తి - రాజోలు (కోనసీమ జిల్లా)

కోనసీమ జిల్లా వ్యాప్తంగా మటన్ అమ్మకాలు భారీగా జరిగాయి. సుమారు రూ.5 కోట్ల వ్యాపారం జరిగి ఉంటుందని అంచనా. చాలాచోట్ల విక్రయదారులు ధర పెంచి అమ్మకాలు సాగించారు. బర్డ్ ఫ్లూ భయంతో చికెన్ ప్రియులు భారమైనా ఎక్కువ మంది మటన్ కొనుగోలు చేయడం కనిపించింది. ప్రజల అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని కొందరు వ్యాపారులు సొమ్ము చేసుకున్నారు. చాలాచోట్ల కిలో మటన్‌ను రూ.1,000ల వరకూ విక్రయిస్తున్నారు. ఆదివారం ప్రధాన మార్కెట్లలో మటన్ విక్రయాలు రూ.లక్షల్లో జరిగాయి. అమలాపురం, మలికిపురం, రాజోలు, రావులపాలెం వంటి ప్రాంతాల్లో మటన్ ధరలు చుక్కలనంటాయి. మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాలో సైతం విపరీతమైన గిరాకీ. గ్రామీణ ప్రాంతాల్లో కొంతమంది బృందంగా ఏర్పడి ముందుగానే మేక, పొట్టేళ్లను ముందస్తుగానే సంతల్లో కొనుగోలు చేసుకున్నారు. కోళ్ల విక్రయాలు మాత్రం గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్ ఇందుకు కారణం. కోడి మాంసంతో బర్డ్‌ఫ్లూ ప్రబలుతోందన్న వదంతుల నేపథ్యంలో చాలామంది భయపడిపోయారు. సామాన్య, మధ్యత రగతి ప్రజలు సైతం ప్రత్యామ్నాయంగా చేపలు, మటన్‌పైనే ఆసక్తికనబరిచారు. ఫలితంగా అమ్మకాలు లేక కోడి మాంసం విక్రయదారులు డీలా పడిపోయారు. నాటుకోళ్ల అమ్మకాలు మాత్రం ఆశాజనకంగా జరిగాయి. ఇక చేపల విక్రయాలదీ అదే తీరు. చేపల కోసం జనాలు ఎగబడ్డారు. లైవ్ ఫిష్ పేరిట ఏర్పాటుచేసి దుకాణాల వద్ద ఉదయానికే మోహరించారు.

సామాన్యులకు దూరం

గత కొద్ది సంవత్సరాలుగా ధరలు బాగా పెరుగుతూ వస్తుండటంతో సామాన్యులు మటన్ కొనాలంటే జంకుతున్నారు. మేక మాంసం కొనే స్తోమత లేక చికెన్తోనే సరిపెట్టుకుంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో అరకొరగా మాత్రమే మటన్ కొంటున్నారు. బర్డ్ ఫ్లూ నేపథ్యంలో ధరలు భారీగా పెరగడంతో పేదలు, దిగువ మధ్యతరగతి ప్రజలు మటన్‌కు దూరమవుతున్నారు.జిల్లాలో గత కొంతకాలం గా కొన్ని ప్రాంతాల్లో మటన్ కిలో ధర రూ.వెయ్యి దాటినా తర్వాత దిగివచ్చింది. బర్డ్‌ను బూచిగా చూపి అప్పట్లో కొంతమంది వ్యాపారులు అడ్డగోలుగా రేట్లు పెంచేశారు. దీంతో మటన్ ధరలు ఆకాశాన్నంటాయి.

మాంసాహారులే ఎక్కువ

దేశంలో మాంసాహారులు పెరుగుతున్నారని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్)-5 వెల్లడించింది. అధిక శాతం ప్రజలు వారానికి కనీసం ఒకసారి చేపలు, చికెన్, మాంసంలో ఏదో ఒక దానిని కచ్చితంగా ఆరగిస్తున్నారని తెలిపింది. అయితే మటన్ వినియోగంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే టాప్లో ఉంది. 70 శాతం మంది ప్రజలు కనీసం వారంలో ఒకసారైనా మాంసం తింటున్నారు. కేవలం 4.4 శాతం మంది ఎటువంటి మాంసాహారం ముట్టకుండా కోడిగుడ్డు మాత్రమే తీసుకుంటున్నారు. 0.27 శాతం మంది మాత్రమే వెజిటేరియనన్లు ఉన్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

ఇక చూపు చేపల వైపు

మాంసాహార ప్రియులు చికెన్, మటన్ ధరలు అమాంతంగా పెరిగిపోవడంతో చేపల కొనుగోలు వైపు మొగ్గుచూపుతున్నారు. చేపల ధరలు కిలోకి రూ.120-150 కే అందుబాటులో ఉండడంతో వీటివైపు ప్రజలు ఆసక్తిచూపుతున్నారు.

బాలికపై విద్యార్థుల దాడి

- ఆలస్యంగా వెలుగులోకి - వీడియో వైరల్ - విచారణ చేపట్టిన ఎంఇఒ

ప్రజాశక్తి-పాడేరు టౌన్

అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని సెయింట్ ఆన్స్ స్కూల్లోని బాలికల వసతి వసతి గృహంలో 7వ తరగతి చదుతున్న బాలికపై 10వ తరగతి చదువుతున్న విద్యార్థినీలు భౌతిక దాడికి పాల్పడిన వీడియో ఆదివారం వైరల్ కావడంతో విద్యా శాఖాధికారులు స్పందిం చారు. డీఈవో పి.బ్రహ్మాజీరావు ఆదేశాల మేరకు ఎంఈవో ఎస్.విశ్వప్రసాద్ ఆదివారం మధ్యాహ్నం పాఠశాలకు వెళ్లి పాఠశాల యాజమాన్యాన్ని విచారించారు. అయితే ఈ ఘటన గత నెల 5వ తేదీన జరిగినట్లు విచారణలో నిర్ధారణ అయ్యిందని ఈ విషయంపై డీఈవో షిబ్రహ్మాజీరావుకు నివేధికను అందించనున్నాయని ఆయన తెలిపారు. ఈ విషయంపై డీఈవో సోమవారం పాఠశాలను సందర్శించి సమగ్ర విచారణ చేపడ తారని ఆయన తెలిపారు. సెయింట్ ఆన్స్ స్కూల్లో చిన్న పిల్లలను పెద్ద పిల్లలు ర్యాగింగ్ చేస్తూ భౌతిక దాడులకు పాల్పడుతున్నట్లు వివిధ వాట్సాప్ గ్రూప్లలో వీడియో వైరల్ కావడంతో స్పందించిన స్థానిక ఎమ్మెల్యే పాఠశాలకు చేరుకొని ఘటనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెయింట్ ఆన్స్ స్కూల్ యాజమాన్యం తీరు అధ్వాన్నంగా ఉందని ,గతంలో కూడా పలు అభియోగాలు వచ్చాయన్నారు. వసతి గృహంలో ఉన్న విద్యార్థులు ఫోన్‌లు వినియోగిస్తుంటే యాజమాన్యం ఏమి చేస్తుందని అసహనం వ్యక్తం చేశారు. సిబ్బంది పర్యవేక్షణ లోపం వల్లే ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఘటనపై, యాజమాన్యం తీరుపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, భవిష్యత్ లో ఇటు వంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంత పాఠశాలల్లో తరచూ రకరకాల సంఘటనలు జరుగు తున్నా ప్రభుత్వ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోపోవడం చాలా బాధాకరమన్నారు. విద్యార్థులలో శ్రమ శిక్షణకు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

పాక్‌లో నెత్తురోడిన రహదారులు

- 16 మంది మృతి

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో సింధ్ ప్రావిన్స్‌లో రహదారులు నెత్తురోడాయి. రెండు వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 16మంది మరణించగా, 45మందికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సింధ్ ప్రావిన్స్‌లోని ఖైర్పూర్ సమీపంలోని రాణిపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో 11మంది మృతి చెందగా, 35మందికి గాయాలయ్యాయి. బురేవాలా నుంచి వస్తున్న బస్సు జాతీయ రహదారిపై రిక్షాను ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. అలాగే, షహీద్ బెనజీరాబాద్ జిల్లాలోని ఖాజీ అహ్మద్ పట్టణం సమీపంలో మరో ప్రమాదం చోటుచేసుకుంది. ప్రయాణికులతో వెళ్తున్న వ్యాన్.. ఆటోను ఢీకొట్టడంతో ఐదుగురు మృతి చెందగా, 10మంది గాయపడ్డారు. వేగంగా ప్రయాణిస్తున్న వ్యాను.. ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టడంతో ఈ ఘటన జరిగింది.



'భూమిపైనే అత్యంత తెలివైన ఏఐ గ్రోక్ 3

- ఎలన్ మస్క్ కీలక ప్రకటన

న్యూయార్క్ : ప్రపంచంలో ఉన్న టెక్ దిగ్గజాలన్నీ ఏఐ టెక్నాలజీ డెవలప్‌మెంట్ లో పోటీపడుతున్న నేపథ్యంలో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కీలక ప్రకటన చేశారు. మస్క్ నేతత్వంలోని కత్రిమ మేధ సంస్థ 'ఎక్స్ఏఐ' అత్యంత అధునాతనమైన గ్రోక్ 3 సేవలను అందుబాటులోకి తీసుకురానుందని సామాజిక మాధ్యమాల్లో ప్రకటించారు. భూమిపైన అత్యంత తెలివైన ఏఐ సాధనంగా దీన్ని ఆయన అభివర్ణించారు. భారత కాలమానం ప్రకారం ... మంగళవారం ఉదయం 9 గంటల 30 నిముషాలకు ఈ కొత్త మోడల్ అందుబాటులోకి రానుందని తెలిపారు. ఇప్పటికే గ్రోక్ చాట్‌బాట్ సేవలు విస్తతంగా ప్రాచుర్యం పొందాయి. చాట్ జిపిటికి పోటీగా మార్కెట్లోకి వచ్చిన గ్రోక్, మెరుగైన ఫీచర్లతో వినియోగదారులను ఆకట్టుకుంది. తాజాగా 'ఎక్స్' వేదికగా గ్రోక్ 3 విడుదల కానున్నట్లు మస్క్ ప్రకటించారు. అయితే.. దీని సామర్థ్యాలకు సంబంధించిన పూర్తి వివరాలను మాత్రం వెల్లడించలేదు. టెక్ నిపుణుల అభిప్రాయానుసారం... ఈ కొత్త మోడల్ టెక్స్ట్-టు-వీడియో వంటి అధునాతన ఫీచర్లను కలిగి ఉండే అవకాశముంది. ఈ అప్‌గ్రేడ్‌తో, గ్రోక్ 3 ఓపెన్‌ఏఐ తీసుకొచ్చిన జిపిటి-4, గూగుల్ జెమిని వంటి ఏఐ మోడళ్లకు ప్రధాన పోటీదారుగా నిలవనుంది. ప్రస్తుతం కత్రిమ మేధ విభాగంలో పోటీ తీవ్రంగా పెరిగింది. ఓవైపు ఓపెన్‌ఏఐ తన చాట్‌జీపీటీ మోడళ్లను నిరంతరం అభివద్ధి చేస్తుండగా, గూగుల్ జెమినీని మరింత మెరుగుపరుస్తోంది. మెటా తన ఎల్ఎల్ఎంఎ సిరీస్‌ను విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో, ఎలాన్ మస్క్ గ్రోక్ 3ను ప్రవేశపెట్టడం టెక్ ప్రపంచంలో కీలక పరిణామంగా నిలిచింది.

మనీలాండరింగ్ కేసులో మారిషస్ మాజీ ప్రధాని ప్రవింద్ అరెస్ట్



పోర్ట్ లూయిస్ : మనీ లాండరింగ్ కేసులో మారిషస్ మాజీ ప్రధానమంత్రి ప్రవింద్ జగన్నాథ్ అరెస్టయ్యారు. శనివారం సాయంత్రం నుంచి ఆయన నివాసం, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించినట్లు మారిషస్ ఆర్థిక నేరాల విభాగం (ఎఫ్‌సిసి) ఆదివారం వెల్లడించింది. ప్రవింద్‌తో పాటు ఆయన భార్య కోబితాను గంటల పాటు విచారించినట్లు పేర్కొంది. అనంతరం ప్రవింద్‌ను అరెస్టు చేసి, సెంట్రల్ మారిషస్‌లోని మెకాలో ఉన్న నిర్బంధ కేంద్రంలో ఉంచినట్లు ఎఫ్‌సిసి ఆదివారం ఉదయం తెలిపింది. సోదాల్లో భాగంగా పలు కీలక డాక్యుమెంట్లు, ఖరీదైన గడియారాలు, అధిక మొత్తంలో నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించింది. మారిషస్ ప్రధానిగా 2017 నుంచి 2024 వరకు కొనసాగిన ప్రవింద్ జగన్నాథ్.. గతేడాది చివర్లో రాజీనామా చేశారు. ఆ వెంటనే నవీన్ రామ్‌గూలం నూతన ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో కొన్ని ఒప్పందాల్లో ఆర్థిక అవకతవకలు జరిగాయని, వాటిపై ఆడిట్ నిర్వహిస్తామని నవీన్ అప్పట్లో ప్రకటించారు. వీటికి సంబంధించిన విచారణ చేపట్టిన ప్రస్తుత ప్రభుత్వం.. మనీ లాండరింగ్ అభియోగాలపై ప్రవింద్‌ను అరెస్టు చేసింది.

వ్యంగ్యాస్త్రం సంధించిన వికటన్‌పై

మోడీ సర్కార్ వేటు

- భారతీయులను అమెరికా వెనక్కి పంపడాన్ని నిరసిస్తూ కార్టూన్
- బిజెపి ఫిర్యాదు.. ఆ వెంటనే వికటన్ వెబ్‌సైట్ బ్లాక్
- తీవ్రంగా ఖండించిన తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్



చెన్నై : భావ ప్రకటనా స్వేచ్ఛపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దాడులను కొనసాగిస్తూనేవుంది. అమెరికా అధ్యక్షునిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్కడి భారతీయ వలసదార్లను సంకెళ్లతో బంధించి భారత్‌కు పంపించేయడాన్ని నిరసిస్తూ ఒక కార్టూన్ ప్రచురించిన తమిళనాడుకు చెందిన ప్రఖ్యాత మీడియా సంస్థ 'వికటన్'పై బిజెపి తమిళనాడు విభాగం విరుచుకుపడింది. దీనిపై కేంద్రానికి ఫిర్యాదు కూడా చేసినట్లు సమాచారం. ఇది జరిగిన వెనువెంటనే వికటన్ వెబ్‌సైట్ బ్లాక్ అయింది. కేంద్ర ప్రభుత్వమే బ్లాక్ చేయించివుంటుందని విమర్శలు వస్తున్నాయి.

కార్టూన్‌లో ఏముందంటే..

ఒకవైపు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమెరికాలో పర్యటించడం.. మరోవైపు అమెరికాలో ఉన్న భారతీయులను అక్రమ వలసదారుల పేరిట చేతులు, కాళ్లకు సంకెళ్లు వేసి అమెరికా యంత్రాంగం అమానుషంగా ప్రవర్తించటం, భారత్‌పై ట్రంప్ సుంకాల హెచ్చరికల నేపథ్యంలో తీవ్ర చర్చ నడిచిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వికటన్ తన డిజిటల్ మ్యాగజైన్‌లో మోడీ, ట్రంప్‌పై ఒక వ్యంగ్య కార్టూన్‌ను పబ్లిష్ చేసింది. ఇందులో ప్రధాని మోడీ చేతికి సంకెళ్లతో ట్రంప్ పక్కన కూర్చుంటారు. అయితే, ఈ కార్టూన్‌ను తమిళనాడు బిజెపి యూనిట్ తీవ్రంగా ఆక్షేపించింది.

దీనిపై కేంద్రానికి ఫిర్యాదు చేసిన కొన్ని గంటల తర్వాత వికటన్ వెబ్‌సైట్ అందుబాటులోకి రాలేదు.

భావప్రకటనా స్వేచ్ఛను కాపాడుకుంటాం : వికటన్

న్యాయపోరాటం ద్వారా భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడుకుంటామని వికటన్ మీడియా గ్రూపు వెల్లడించింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. 'మా వెబ్‌సైట్ అందుబాటులో లేదన్న విషయాన్ని చాలా మంది యూజర్లు తెలిపారు. వెబ్‌సైట్ బ్లాక్‌కు సంబంధించి కేంద్రం నుంచి ఎలాంటి సమాచారమూ అందలేదు.

కేంద్రం వికటన్ వెబ్‌సైట్‌ను బ్లాక్ చేసిందని పలు కథనాలు వచ్చాయి. వికటన్ కార్టున్‌ను బిజెపి మద్దతుదారులు జీర్ణించుకోవడం లేదు. దీనిపై కేంద్రానికి తమిళనాడు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు అన్నామలై ఫిర్యాదు చేసినట్టు సమాచారం. దాదాపు ఒక శతాబ్దకాలంగా భావప్రకటనా స్వేచ్ఛకు వికటన్ మద్దతుగా నిలుస్తోంది. మేము ఎల్లప్పుడూ వాక్‌స్వాతంత్ర్యాన్ని కాపాడాలనే సూత్రంతో పని చేస్తున్నాం. దానిని అలాగే కొనసాగిస్తాం. మా వెబ్‌సైట్ బ్లాక్ కావటానికి గల కారణాలను తెలుసుకోవటానికి మేము ఇంకా ప్రయత్నిస్తున్నాం. ఈ విషయాన్ని మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళ్లే ప్రక్రియలో ఉన్నాం' అని వికటన్ తెలిపింది.

ఫాసిస్ట్ స్వభావానికి ఉదాహరణ : స్టాలిన్

ఈ విషయంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ స్పందించారు. వికటన్ వెబ్‌సైట్‌ను బ్లాక్ చేయటాన్ని ఆయన ఖండించారు. 'అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నందుకు మీడియాను బ్లాక్ చేయటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ఇది బిజెపి ఫాసిస్ట్ స్వభావానికి ఒక ఉదాహరణ. బ్లాక్ అయిన వెబ్‌సైట్‌కు తక్షణమే యాక్సెస్ ఇవ్వాలి. వికటన్.. జర్నలిజం ఇండస్ట్రీలో దాదాపు శతాబ్ద కాలంగా కొనసాగుతున్నది' అని స్టాలిన్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

సంపద కరిగిపోతోంది!

- దలాల్ స్ట్రీట్ వరుస పతనాలతో దిగజారుతున్న నికర ఆస్తులు
- ఒక్క రోజే అదానీ సంపద 2.73 బిలియన్ డాలర్లు ఆవిరి


న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆంక్షాలు, సుంకాల నిర్ణయాల కారణంగా ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు విలవిలాడుతున్న సంగతి తెలిసిందే. భారత్ దళాల్ స్ట్రీట్ కూడా వరుసగా 8 సెషన్లూ పాతాళం వైపు పరుగులు తీస్తోంది. కోట్లాది మంది చిన్న మదుపర్ల సొమ్మును విదేశీ సంస్థాగత మదుపర్లు కొల్లగొట్టకుపోయారు. స్టాక్ మార్కెట్లు వరుస పతనాల ఫలితంగా బిలియనీర్ల నికర ఆస్తుల విలువ సైతం తగ్గిపోయింది. అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ ప్రపంచ కుబేరుల జాబితాలో 23వ స్థానానికి పడిపోయారు. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్ల సూచిక ప్రకారం ఆయన నికర ఆస్తుల విలువ ఈ నెల 14న (శుక్రవారం) ఒక్క రోజే 2.73 బిలియన్ డాలర్ల మేర పడిపోయింది. మన కరెన్సీలో చెప్పాలంటే దాని విలువ రూ.23,660,495,500. ఇప్పుడాయన నికర ఆస్తుల విలువ 66.1 బిలియన్ డాలర్లు. ఈ ఏడాది గౌతమ్ అదానీ నికర ఆస్తుల విలువ 12.6 బిలియన్ డాలర్లు తగ్గింది. ఈ నేపథ్యంలో ఇప్పుడాయన ఆసియా సంపన్నుల జాబితాలో మూడో స్థానానికి దిగజారే అవకాశం ఉంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేష్ అంబానీ నికర ఆస్తుల విలువ కూడా ఈ ఏడాది 4.55 బిలియన్ డాలర్లు తగ్గింది. ప్రపంచ సంపన్నుల జాబితాలో ఆయన 17వ స్థానంలో ఉన్నారు. ఆయన నికర ఆస్తుల విలువ ప్రస్తుతం 86.1 బిలియన్ డాలర్లు. హెచ్‌సిఎల్‌కు చెందిన శివ్ నాడర్ ఈ సంవత్సరం 4.14 బిలియన్ డాలర్లు కోల్పోయారు. షాపూర్‌జీ మిస్త్రీ 2.18 బిలియన్ డాలర్లు, అజీమ్ ప్రేమ్‌జీ 188 మిలియన్ డాలర్లు, సావిత్రి జిందాల్ 5.20 బిలియన్ డాలర్లు, సన్ ఫార్మాకు చెందిన దిలీప్ సంఘ్వీ 3.40 బిలియన్ డాలర్లు కోల్పోయారు. ప్రపంచంలో నికర ఆస్తుల విలువను భారీగా కోల్పోయిన వారి జాబితాలో ఎలన్ మస్క్ మొదటి స్థానంలో నిలిచారు. ఆదాయ సముపార్జనలో మార్క్ జూకర్‌బర్గ్ ప్రథమ స్థానంలో ఉన్నారు. ప్రపంచంలో అత్యంత సంపన్నుడైన మస్క్ ఈ ఏడాది 34.1 బిలియన్ డాలర్ల నికర విలువను కోల్పోయారు. దీంతో ఇప్పుడాయన ఆస్తుల నికర విలువ 398 బిలియన్ డాలర్లకు తగ్గింది. మరోవైపు ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా వేదికల సీఈఓ మార్క్ జూకర్‌బర్గ్ నికర ఆస్తుల విలువ ఈ సంవత్సరం 52 బిలియన్ డాలర్ల మేర పెరిగింది. ప్రపంచ సంపన్నుల జాబితాలో 259 బిలియన్ డాలర్ల నికర విలువతో ఆయన రెండో స్థానంలో నిలిచారు.

కోడలికి హెచ్ఐవి ఇంజక్షన్ ఇచ్చిన అత్తామామలు..!

లక్నో/ డెహ్రాడున్ : ఉత్తరాఖండ్‌లో ఘోరం చోటుచేసుకుంది. అదనపు కట్నం కోసం కోడలిని వేధించి, తమ కుమారుడికి మరో వివాహం చేయాలన్న ఉద్దేశంతో కుట్రపన్ని కోడలికి అత్తామామలు హెచ్ఐవి ఇంజక్షన్ ఇచ్చిన ఉదంతం వెలుగులోకివచ్చింది. ఉత్తప్రదేశ్‌లోని సహరన్‌పూర్‌కు చెందిన యువతికి ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌కు చెందిన అభిషేక్ అలియాస్ సచిన్ అనే యువకుడితో 2023 ఫిబ్రవరి 15న వివాహమైంది. దాదాపు రూ. 45 లక్షలు ఖర్చు చేసి ఘనంగా పెళ్లి చేశారు. రూ.15 లక్షల కట్నంతో పాటు కారును బహుమతిగా ఇచ్చారు. అయితే పెళ్లి అయిన మరుసటి రోజు నుంచే మరో పది లక్షల రూపాయలు అదనపు కట్నం కావాలని కొత్త కోడలిపై అత్తింటివారు వేధింపులకు పాల్పడ్డారు. తాము అంత మొత్తం ఇచ్చుకోలేమని యువతి తల్లిదండ్రులు చెప్పడంతో ఆమెను ఇంటి నుంచి గెంటేశారు. అనంతరం గ్రామంలోని పెద్దల మనుషుల సమక్షంలో పంచాయతీ నిర్వహించి, యువతిని తిరిగి అత్తింటికి పంపారు. అయితే, అప్పటి నుంచి మరింత ఎక్కువగా మానసికంగా, శారీరకంగా చిత్రహింసలకు గురిచేశారు. అంతేకాదు, తమ కుమారుడికి మరో వివాహం చేయాలనే ఆలోచనతో కోడలిను హత్య చేసేందుకు అత్తమామలు కుట్ర పన్నారని బాధిత తల్లిదండ్రులు ఆరోపించారు.

అమెరికాలో ఆర్మీ నిధుల గోల్‌మాల్

- దారిమళ్లిన ఆహార నిధులు
- మిలిటరీ డాట్‌కామ్ వెల్లడి



వాషింగ్టన్ : అమెరికాలో ఆర్మీ నిధులు నిర్దేశిత లక్ష్యాల కోసం కాకుండా వేరే ప్రాజెక్టులకు తరలించడంపై దుమారం చెలరేగుతోంది. సైనికుల ఆహారం కోసం వారి వేతనాల నుంచి కొంత మొత్తాన్ని అమెరికా ప్రభుత్వం సేకరిస్తుంది. ఆ మొత్తాన్ని ఒక నిధిగా ఉంచి..వారి భోజనం కోసం ఖర్చు చేస్తారు. కానీ ఇలా సేకరించిన నిధుల్లో అత్యధిక భాగం ఇతర ప్రాజెక్టులకు మళ్లిస్తున్నట్లుగా మిలిటరీ డాట్‌కామ్ అనే సంస్థ ఒక నివేదిక విడుదల చేసింది. సైనికుల ఆహార నిధుల్లో సగం కంటే తక్కువ మాత్రమే సైనికుల భోజనానికి వినియోగిస్తున్నట్లు పేర్కొంది. ఆర్మీ ఆహారం కోసం మొత్తం 225 మిలియన్ డాలర్లు సైనికుల వేతనాల నుంచి సేకరించగా, వాటిలో కేవలం 74 మిలియన్ డాలర్లు మాత్రమే వెచ్చించినట్లు నివేదిక వెల్లడించింది. సాధారణంగా బ్యారక్‌లలో ఉంటున్న ప్రతి సైనికుడి వేతనం నుంచి నుంచి ప్రతి నెలా 460 డాలర్లు కట్ చేస్తారని ఓ అధికారి పేర్కొన్నారు. సిబ్బందికి ఆహారం అందించడానికి ఈ నియమం పెట్టుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 2024లో దేశంలోని పలు స్థావరాల్లోని సైనికుల నుంచి 225 మిలియన్ డాలర్లు తీసుకున్నారని..కానీ వాటిలో దాదాపు 151 మిలియన్ డాలర్లను ఇతర ప్రాజెక్టులకు మళ్లించారని మిలిటరీ డాట్ కామ్ వెల్లడించింది. అయితే, వారి నుంచి సేకరించిన వాస్తవ నగదు మరింత అధికంగా ఉండే అవకాశం ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేసింది. మరో వైపు జార్జియాలోని ఫోర్ట్ స్టీవర్ట్‌లో సైనికుల నుంచి 17 మిలియన్ డాలర్లు వసూలు చేస్తే.. అందులో కేవలం 2.1 మిలియన్లు మాత్రమే ఆహారం కోసం ఖర్చు చేయగా.. దాదాపు 87 శాతం ఇతర ప్రాజెక్టులకు మళ్లించినట్లు తెలిపింది.

సైనికుల ఆహారం నుంచి నిధులను దొంగలిస్తూ.. సైనిక సంసిద్ధతను సాధించడం సాధ్యం కాదని ప్రతినిధుల సభ సభ్యుడు జుల్ టోకుడ వ్యాఖ్యానించారు. సైనికుల నుంచి దాదాపు 151 మిలియన్ డాలర్లు సేకరించారని..కానీ, అవసరాలకు తగినట్లు మాత్రం ఆహారం అందించలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనివల్ల సైనికులు ఆహార కొరతను ఎదుర్కొంటున్నారన్నారు. వారికి నాణ్యమైన ఆహారం అందించట్లేదని పలువురు అధికారులు ఫిర్యాదు చేశారు. సరిగా ఉడకని మాంసం, నాసిరకం కూరగాయలతో భోజనం పెడుతున్నట్లు వెల్లడించారు.

ఎఫ్ఎంఆర్ఏఐ నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కృష్ణానంద్, పార్థరక్షిత్
- ఘనంగా ఎఫ్ఎంఆర్ఏఐ 27వ అఖిల భారత మహాసభ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



కృష్ణానంద్ పార్థరక్షిత్

ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ రిప్రజెంటివివ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎంఆర్ఏఐ) నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కృష్ణానంద్, పార్థ రక్షిత్ ఎన్నికయ్యారు. మహారాష్ట్ర రాజధాని ముంబయిలో మూడు రోజుల (ఫిబ్రవరి 13 నుంచి 15 వరకు) పాటు ఎఫ్ఎంఆర్ఏఐ 27వ అఖిల భారత మహాసభ ఘనంగా నిర్వహించారు. దేశ నలుమూలల నుంచి 800 మందికి పైగా ప్రతినిధులు ఈ మహాసభకు హాజరయ్యారు. తొలిత ఎఫ్ఎంఆర్ఏఐ అధ్యక్షులు రమేష్ సుందర్ ఫెడరేషన్ జెండా ఆవిష్కరించారు. ముంబయికి చెందిన ప్రముఖ సర్జన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) ఎథిక్స్ కమిటీ సభ్యులు డాక్టర్ సంజయ్ నగ్రాల్ ప్రారంభోపన్యాసం చేశారు. ఏఐటిసిడి అధ్యక్షులు జగన్నాథ్ అప్పాజీ షిండే స్వాగతోపన్యాసం చేశారు. సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్ సేన్, ఏఐకెఎస్ అధ్యక్షులు అశోక్ ధావలే, సిఐటియు జాతీయ కార్యదర్శులు ఆర్ కరుమలైయన్, జెఎస్ మజుందార్, ఎం.హెచ్ షేక్, డాక్టర్ వివేక్ మాంటెరో, సుకుమార్ దామ్లే, డాక్టర్ తపతి ముఖోపాధ్యాయ, అడ్వకేట్ అరవింద్ తపోలే తదితరులు సౌహార్ద సందేశాలు ఇచ్చారు. ఎంఎస్ఎంఆర్ఎ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శలు నరేంద్ర సింగ్, శ్రీకాంత్ ఫోపాసే అధ్యక్ష వహించారు.

ఎఫ్ఎంఆర్ఏఐ ప్రధాన కార్యదర్శి శాంతాను ఛటర్జీ రిపోర్టు ప్రవేశపెట్టారు. ఈ రిపోర్టుపై రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు చర్చించారు. అనంతరం 286 మందితో నూతన జనరల్ కౌన్సిల్, 99 మందితో వర్కింగ్ కమిటీ, 79 మందితో వర్కింగ్ కమిటీ, 20 మంది కార్యదర్శి వర్గం ఎన్నిక అయింది. అలిండియా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కృష్ణానంద్, పార్థ రక్షిత్, కోశాధికారిగా కౌసిక్ రాయ్ చౌదరి మహాసభ ఎన్నుకుంది.

ఆంధ్రప్రదేశ్ నుంచి ఎన్నికైన ప్రతినిధులు


జాతీయ కార్యదర్శిగా జి మనోహర్, వర్కింగ్ కమిటీ సభ్యులుగా సి వెంకటరావు, సిహెచ్ కుమార్, డి ప్రసాద్, యుఎస్ రవి కుమార్ ఎన్నికయ్యారు. జనరల్ కౌన్సిల్ సభ్యులుగా టివిఎస్ కోటేశ్వరరావు, ఎన్ సత్తి రాజు, టి రామకృష్ణ, జి విశ్వనాథ్, వివిఎన్ ప్రసాద్, డి స్రవంత్, ఎఆర్‌సి వర్మ, ఎస్ఎన్ రణదీప్ సింగ్, కెఎంఎస్‌సి రాజు, పి శ్రీనివాసరావు, సిహెచ్ మహేష్ కుమార్, వంశీకృష్ణ, అబ్దుల్ సలీమ్, సిహెచ్ పణీంద్ర కుమార్, ఎస్ మల్లికార్జున, ఐకె కృష్ణమోహన్, పి చంద్ర శేఖర్, ఎస్ ఇస్సాక్, కె బసవ రాజ్ ఎన్నికయ్యారు.

తెలంగాణ నుంచి ఎన్నికైన ప్రతినిధులు

తెలంగాణ నుంచి వర్కింగ్ కమిటీ సభ్యులుగా భాను కిరణ్, సిహెచ్ శ్రీధర్ ఎన్నికయ్యారు. జనరల్ కౌన్సిల్ సభ్యులుగా కె దుర్గాప్రసాదరావు, కె జగదీశ్వరాచారి, ఎంఎక్యూ అఫ్రోజ్, బి రాజ్ కుమార్, ఎఎన్ చారి, ఎల్ లోకేశ్వర రెడ్డి, కె ఐలయ్య, పి రాజేష్ కుమార్, ఎం సతీష్ కుమార్, జి విద్యాసాగర్, జి శ్రీనివాస్, ఎ సదానంద చారి, జి కిషోర్ ఎన్నికయ్యారు.

బాబు, నితీష్ మద్దతుతోనే 'వక్ఫ్' సవరణ : కేంద్ర మంత్రి రిజిజు

శ్రీనగర్ : టిడిపి అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, జెడియు అధినేత బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ మద్దతుతోనే వక్ఫ్ సవరణ బిల్లును ప్రతిపాదించామని పార్లమెంటరీ వ్యవహారాలు, మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు. శ్రీనగర్‌లో జరిగిన 'బడ్జెట్ పె చర్చ' అనే కార్యక్రమంలో రిజిజు మాట్లాడుతూ ఈ విషయాన్ని తెలియజేశారు. ఈ సవరణలు వక్ఫ్ ఆస్తులను లాక్కోవడానికి కాదని, సమర్థవంతమైన నిర్వహణ కోసమని ఆయన చెప్పుకొచ్చారు. చంద్రబాబు, నితీష్ ఇద్దరూ ఈ బిల్లుకు మద్దతు ఇస్తున్నారని తెలిపారు.



జౌళి ఎగుమతుల్ని పెంచడమే లక్ష్యం

- 'భారత్ టెక్స్' కార్యక్రమంలో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ: జౌళి ఉత్పత్తుల ఎగుమతుల్ని పెంచడమే లక్ష్యంగా కేంద్రం పలు చర్యలు తీసుకుంటోందని ప్రధాని మోడీ తెలిపారు. ఈ రంగంలో వార్షిక ఎగుమతులను 2030 కన్నా ముందే రూ.9 లక్షల కోట్ల లక్ష్యాన్ని సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఢిల్లీలో ఫిబ్రవరి 14 నుంచి 17వరకు జరుగుతున్న భారత్ టెక్స్ కార్యక్రమానికి ఆయన ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. టెక్స్‌టైల్ రంగానికి బ్యాంకులు సహకారం అందించాలని, తద్వారా ఉపాధి పెంచేందుకు సహకరించాలని కోరారు. ప్రపంచంలోనే ఆరో అతిపెద్ద వస్త్ర ఎగుమతిదారుగా ఉన్న భారత్.. గతేడాది 7శాతం వృద్ధి నమోదు చేసిందన్నారు. ప్రస్తుతం రూ.3లక్షల కోట్లుగా వార్షిక ఎగుమతుల్ని 2030 నాటికి రూ.9లక్షల కోట్లకు పెంచడమే టార్గెట్‌గా పెట్టుకున్నట్టు తెలిపారు. భారత్ టెక్స్ 2025లో 120కి పైగా దేశాలు పాల్గొంటున్నాయన్నారు.

భారత్ హై-గ్రేడ్ కార్బన్ ఫైబర్ తయారీ దిశలో ముందుకు సాగుతోందని, వస్త్ర రంగంలో నైపుణ్యం కలిగిన ప్రతిభావంతులను తయారు చేసేందుకు కృషిచేస్తున్నట్టు తెలిపారు. సాంకేతిక వస్త్ర రంగంపై ద ృష్టి సారించామన్నారు. మరోవైపు, ప్రధాన పత్తి రకాల ఉత్పాదకతను పెంచేందుకు కేంద్రం రూ.500 కోట్లతో కాటన్ మిషన్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. అంతేకాకుడా, 2025-26 బడ్జెట్‌లో జౌళి మంత్రిత్వ శాఖకు కేంద్ర బడ్జెట్‌లో రూ.5,272 కోట్లు కేటాయించింది.

భారత్ ఎన్నికల్లో అమెరికా జోక్యం

- ఓటింగ్ శాతం పెంచేందుకు నిధులు
- ఇప్పుడు సాయం తెగ్గోస్తున్న ప్రకటనతో వెలుగులోకి

న్యూయార్క్ : భారత ఎన్నికల్లో అమెరికా జోక్యం చేసుకుంటోందా? అంటే ఔననే అనే అనుమానాలు బలపడుతున్నాయి. వివిధ దేశాలకు, సంస్థలకు అమెరికా అందిస్తున్న సాయంలో కోత విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే భారత్‌లో ఓటింగ్ పెంచేందుకు ఉద్దేశించిన నిధులను నిలిపివేస్తున్నట్లు అమెరికాకు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిసెన్సీ (డోజ్) ప్రకటించింది. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో ఆదివారం పోస్టు చేసింది. ప్రభుత్వ వ్యవస్థలో వృథా వ్యయాలను కట్టడి చేసే లక్ష్యంతో ఈ విభాగాన్ని నెలకొల్పారు. భారత్‌లో జరిగే ఎన్నికల్లో ఓటర్ల సంఖ్యను పెంచేందుకు అందించే 21 మిలియన్ డాలర్లను రద్దు చేసినట్లు డోజ్ పేర్కొంది. అయితే గుమ్మడికాయ దొంగ ఎవ్వరంటే భుజాలు తడుముకుంటున్నట్లుగా ...ఈ వ్యవహారంతో తమకు సంబంధం లేదని బిజెపి నేత అమిత్ మాలవీయా ఆదివారం పేర్కొన్నారు. 'ఓటర్లు సంఖ్య పెంచేందుకు 21 మిలియన్ డాలర్లా? ఇది భారతదేశ ఎన్నికల ప్రక్రియలో ప్రత్యక్ష భాగం కాదు. దీని నుంచి ఎవరు లాభపడుతున్నారు?. అధికార పార్టీ మాత్రం కాదు' అని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. అయితే అమెరికా అధ్యక్షులు ట్రంప్‌తోనూ, ఆయన మిత్రుడు స్పేస్ ఎక్స్ అధినేత ఎలన్ మస్క్‌తోనూ అత్యంత సన్నిహిత సంబంధాలు నెరుపుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని అధికారిక బిజెపికే ఈ నిధులు అందివుంటాయని భావిస్తున్నారు.

బంగ్లాదేశ్‌కు 29 మిలియన్ డాలర్లు..

బంగ్లాదేశ్‌లో రాజకీయ స్థిరత్వాన్ని మెరుగుపరిచేందుకు అందిస్తున్న 29 మిలియన్ డాలర్లకు కూడా డోజ్ కోత విధించింది. ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా రాజీనామా అనంతరం మహమ్మద్ యూనస్ నేతత్వంలో మధ్యంతర ప్రభుత్వం ఏర్పాటైన సంగతి తెలిసిందే. ఇక నేపాల్, కంబోడియా, ఆసియా వంటి పలు దేశాలకు కూడా వివిధ రూపాల్లో అమెరికా అందించే సాయాన్ని నిలిపివేశారు.

రెండురోజుల్లో ఢిల్లీ సిఎం ఖరారు..?

- నేడు జరగాల్సిన బిజెపి శాసనసభా పక్ష సమావేశం వాయిదా

న్యూఢిల్లీ: ఢిల్లీ కొత్త ముఖ్యమంత్రి విషయంలో బిజెపి అధిష్టానం నాన్చుడు ధోరణి అవలంబిస్తోంది. అయితే ఈ నెల 20న రాంలీలా మైదానంలో ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉన్నట్టు లీకులిస్తోంది. ఇందులో భాగంగా సోమవారం జరగాల్సిన శాసనసభా పక్ష సమావేశం వాయిదా పడినట్టు సమాచారం .అయితే ఈ సమావేశం 19న జరగనున్నది. మరుసటి రోజున కొత్త సీఎం ప్రమాణ స్వీకారం చేసేలా అధిష్టానం సూచనలు చేసినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

శాసనసభా పక్ష నాయకుడిని ఎన్నుకోవచ్చు

ఢిల్లీలోని బిజెపి ఎమ్మెల్యేలు, ఏడుగురు ఎంపీలు ఈ సమావేశంలో శాసనసభా పక్ష నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఉంది. సమావేశ అనంతరం బిజెపి శాసనసభా పక్ష నాయకుడు, పార్టీ నాయకులతో కలిసి లెఫ్టినెంట్ గవర్నర్‌ను కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి మెజార్టీ సభ్యుల సంతకాలతో కూడిన పత్రాన్ని సమర్పించనున్నట్టు పేర్కొంటున్నారు.

ఈ పేర్లపై ఊహాగానాలు..

తమ ఎన్నికల వ్యూహంలో భాగంగా ముఖ్యమంత్రి అభ్యర్థిని బిజెపి ప్రకటించలేదు. ప్రధాని మోడీ విదేశీ పర్యటన నుంచి తిరిగి వచ్చేశారు.సీఎం రేసులో ఎమ్మెల్యేలు విజేంద్ర గుప్తా, ప్రవేశ్ వర్మ, రేఖ గుప్తా, సతీష్ ఉపాధ్యాయ్, ఆశిష్ సూద్, పవన్ శర్మ, అజయ్ మహావర్ తదితరుల పేర్లు తెరపైకి వచ్చాయి. ముఖ్యమంత్రి, సహాయక మంత్రుల ఎంపికలో బిజెపి తుది నిర?యం తీసుకుంటుందని కమలం పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఎంపీకి కూడా ఛాన్స్...

పార్టీలోనే మింగుడుపడని విధంగా బిజెపి హైకమాండ్ నిర్ణయాలు ఉంటాయని ప్రచారం. ఫలానా వారు సీఎం అనుకుంటే..మధ్యలో మరోకరి తెరపైకి తెస్తున్న ఘటనలు చాలానే ఉన్నాయి. అయితే ఏ ఎంపీనైనా ముఖ్యమంత్రిని చేయగలదనే సంకేతాలిస్తున్నారు.. ఈ విషయంలో కేంద్ర సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా, బిజెపి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు , ఈశాన్య ఢిల్లీ ప్రాంతానికి చెందిన ఎంపీ మనోజ్ తివారీ, న్యూఢిల్లీ ఎంపీ బన్సూరి స్వరాజ్ పేర్లూ వినిపిస్తున్నాయి.

ఢిల్లీ అసెంబ్లీ పదవీకాలం ఫిబ్రవరి 23తో ముగియనుంది, కాబట్టి ప్రమాణ స్వీకార కార్యక్రమం అంతకు ముందే జరిగే అవకాశం ఉంది.

ఈ మరణాలకు బాధ్యులెవరు..?



న్యూఢిల్లీ : ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో శనివారం జరిగిన తొక్కిసలాట అందర్నీ దిగ్భ్రాంతికి గురి చేస్తోంది. కుంభమేళాకు కావాల్సినన్ని రైళ్లు వేస్తామని చెప్పిన కేంద్ర రైల్వేశాఖ అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేయకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని విమర్శలు వస్తున్నాయి. సాధారణ ప్రయాణికులు ఉన్నప్పుడే.. అనౌన్స్‌మెంట్‌లో ఫ్లాట్ ఫారాలను మార్చితేనే నానా కష్టాలు పడాల్సి ఉంటుంది. అలాంటిది కుంభమేళా నుంచి భారీ సంఖ్యలో భక్తులు వచ్చినపుడు.. ప్రయాణికులతో చెలగాటమాడిన తీరే ప్రాణాంతకమైందని ప్రత్యక్షసాక్ష్యులు అంటున్నారు. కుంభమేళా ఈ నెల 26న ముగియనున్నది. అయితే ప్రమాద ఘటనలు మాత్రం ఆగటంలేదు. ఓవైపు ప్రయాగ్‌రాజ్‌లో వేసిన షామియానాల్లో అగ్నిప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. మరో వైపు తొక్కిసలాటల్లో మృత్యుఘోష వినిపిస్తూనే ఉన్నది. ఇప్పటికైనా పాలకులు కండ్లు తెరిచి.. చివరి వరకూ జనం సురక్షితంగా తమ తమ గమ్యస్థానాలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని పౌర సమాజం కోరుతోంది.

ఇంత జనాన్ని ఎప్పుడూ చూడలేదు

ఢిల్లీ ప్రమాద ఘటనపై ప్రత్యక్ష సాక్షులు కథనం

'మహా కుంభమేళాకు 12 మందిమి వెళ తున్నాం. అప్పటికి ఇంకా ప్లాట్‌ఫారం పైకి కూడా చేరుకోలేదు. మెట్ల వద్దే ఉన్నాము. నా సోదరి సహ కుటుంబ సభ్యులు జనంలో చిక్కుబడిపోయారు. అరగంట తర్వాత ఆమెను విగతజీవిగా చూడాల్సి వచ్చింది' అంటూ సంజయ్ అనే బాధితుడు కన్నీరుమున్నీరయ్యాడు. కుంభమేళాలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు ప్రయాగరాజ్‌కు రైలులో వెళ్లాలని అనుకున్న వేలాది మంది భక్తుల్లో ఆయన కూడా ఒకరు. ఓ వైపు రైలు రాక ఆలస్యం కావడం, మరోవైపు జనరల్ టిక్కెట్ల అమ్మకం కొనసాగడంతో భారీగా చేరుకుంటున్న ప్రయాణికుల కారణంగా స్టేషన్‌లో సూది మొన మోపే స్థలం కూడా లేకుండా పోయింది. ప్రజలు భారీగా రావడం వల్లనే తొక్కిసలాట జరిగిందని, ఊపిరాడక అనేక మంది స్పృహ కోల్పోయారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అనేక సంవత్సరాలుగా ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో వ్యాపారం చేస్తున్న రవికుమార్ అనే వ్యక్తి మాట్లాడుతూ గతంలో ఇంత జనాన్ని ఎన్నడూ చూడలేదని అన్నారు. '12, 14, 15, 16 నెంబర్ ప్లాట్‌ఫారాల వద్ద ఇసుక వేస్తే రాలనంత జనం చేరారు. ప్రయాగరాజ్ వెళ్లే రైళ్లు అక్కడికే వస్తాయి. స్టేషన్‌లో ఉన్న బ్రిడ్జి చాలా చిన్నది. ప్రజలేమో అపరిమిత సంఖ్యలో వచ్చారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి పైన భారీగా జనం చేరారు. ఆ జన సందోహాన్ని ఎవరూ ఊహించలేదు. పండుగల సమయంలో కూడా అంతమంది రాలేదు. అధికారులు, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది ఉన్నప్పటికీ ప్రజలను అదుపు చేయడం సాధ్యం కాలేదు' అని వివరించారు. తొక్కిసలాట సమయంలో అక్కడే ఉన్న ఓ పోర్టర్ మాట్లాడుతూ రాత్రి 8.30 గంటల నుండే జనం రావడం మొదలైందని అన్నారు. మృతుల్లో మహిళలు, చిన్నారులు కూడా ఉన్నారని చెప్పారు.

1981 నుండి అదే స్టేషన్‌లో పనిచేస్తున్న మరో పోర్టర్ మాట్లాడుతూ 'గతంలో ఇంత జనాన్ని ఎన్నడూ చూడలేదు. ప్రయాగరాజ్ వెళ్లాల్సిన ప్రత్యేక రైలు 12వ నెంబర్ ప్లాట్‌ఫారం నుండి బయలుదేరాల్సి ఉంది. అయితే దానిని 16వ నెంబర్ ప్లాట్‌ఫారంకు మార్చారు. దీంతో ప్రయాణికులంతా 16వ నెంబర్ ప్లాట్‌ఫారం వద్దకు చేరుకునేందుకు పరుగులు తీశారు. ఈ క్రమంలో ఒకరిని ఒకరు ఢీకొని పలువురు ఎస్కలేటర్ పైన, మెట్ల పైన పడిపోయారు. ప్రజలను ఆపేందుకు పోర్టర్లు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది' అని చెప్పారు. పదిహేను మృతదేహాలను అంబులెన్సుల్లో తరలించామని, ప్లాట్‌ఫారంపై చెప్పులు, బూట్లు, బట్టలు మాత్రమే కన్పిస్తున్నాయని తెలిపారు. తొక్కిసలాట జరగ్గానే పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించామని, మూడు నాలుగు అంబులెన్సులు రాగానే వాటిలో క్షతగాత్రులను తరలించామని వివరించారు. ప్రజలు వస్తారని ఊహించాము కానీ కొద్ది సేపట్లోనే అంతా జరిగిపోయిందని, పరిస్థితి అదుపు తప్పిందని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (రైల్వేస్) కేపీఎస్ మల్హోత్రా చెప్పారు.





మీ కోసం


కూరలో పులుపు తక్కువైనట్లు అనిపిస్తే మామిడి పొడి, పెరుగు మిశ్రమాన్ని కలిపితే టమాట రుచి వస్తుంది.

జీవన సౌరభం

భయపడడం మానేస్తేనే జీవితం మొదలవుతుంది.

JEEVANA జీవన the family

మార్పు



లత అనే అమ్మాయి గొల్లలపాలెం అనే ఊరిలో వాళ్ళ అమ్మతో పాటు నివసిస్తుంది. లత ఒకరోజు ఐస్క్రీమ్ కొనుక్కోవాలి అనుకొంది. వాళ్ళ అమ్మని అడిగింది. వాళ్ళ అమ్మ 'నా దగ్గర డబ్బులు లేవు' అని అంది. దాంతో లతకి బాగా కోపం వచ్చింది. 'అమ్మ ఏమీ కొనదు' అనుకుంటూ ఏడ్చుకుంటూ బడికి వెళ్లిపోయింది. టీచర్ అటెండెన్స్ వేస్తుండగా లత పలకలేదు. దాంతో టీచర్ లత దగ్గరకి వచ్చి 'ఏం లత అలా ఉన్నావు' అని అడిగారు. అప్పుడు లత 'మా అమ్మని ఏం కొనమన్నా కొనదు. ఇప్పుడు కూడా ఐస్‌క్రీమ్ అడిగితే డబ్బులు లేవు అంది' అని చెప్పింది. 'మా అమ్మపై నాకు చాలా కోపంగా ఉంది. అందుకే మీరు అటెండెన్స్ వేసినప్పుడు వినిపించుకోలేదు' అంది. అప్పుడు టీచర్ 'అలా అమ్మని బాధ పెట్టకూడదు' అని చెప్పారు. 'ఎందుకు బాధపెట్టకూడదు టీచర్' అని లత ఎదురు ప్రశ్నించింది. 'అమ్మ మనల్ని కని పెంచుతుంది. ఎంతో కష్టపడి బడికి పంపుతుంది. అమ్మ ఎప్పుడూ మనకి మంచి జరగాలని, మనం ఉన్నత స్థితికి చేరుకోవాలని కోరుకుంటుంది' అని చెప్పారు. అమ్మ గురించి టీచర్ చెప్పిన మాటలు విన్న లతకి దుఃఖం వచ్చింది. అమ్మని అనవసరంగా అవి కొను, ఇవి కొను అని మారాం చేస్తున్నాను. ఇక మీదట అలా చెయ్యకూడదు అని మనసులో అనుకుంది. స్కూల్ అయ్యాక ఇంటికి వెళ్లి అమ్మని గట్టిగా హత్తుకొని అమ్మకి క్షమాపణ చెప్పింది. 'నిన్ను ఇంక ఎప్పుడూ బాధపెట్టను అమ్మా' అని చెప్పింది. లతలో వచ్చిన మార్పుకు అమ్మ ఎంతో సంతోషించింది.



జోగ నవ్యశ్రీ,
4వ తరగతి,
ఎంపీపీఎస్
గొంపవానిపాలెం,
కే కోటపాడు మండలం,
అనకాపల్లి జిల్లా.

తేడాలు కనిపెట్టండి

పిల్లలూ, ఇక్కడ ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు బొమ్మల్లో ఐదు తేడాలు ఉన్నాయి. కనిపెట్టండి చూద్దాం.





నేను గీసిన బొమ్మ





జోగ చిరుతేజ,
3వ తరగతి,
ఎంపిపిఎస్ గొంపవానిపాలేం,
కే కోటపాడు మండలం,
అనకాపల్లి జిల్లా.

వ్యాయామంతో సగం రోగాలు మాయం



ఇంట్లో వాళ్లకు ఏదైనా చిన్న సమస్య వచ్చినా తల్లడిల్లిపోతారు. కానీ వాళ్లకు ఎలాంటి సమస్య వచ్చినా కనీసం విశ్రాంతి తీసుకుందామనే ఆలోచన కూడా చేయరు. ఇంటికి ఆరోగ్యం ఇల్లాలే. ఆమె బాగుంటేనే ఇంటిల్లిపాదీ బాగుంటారు. ఆమెకు చిన్న సుస్తీ చేసినా కుటుంబమంతా వికలమవుతుంది. కాబట్టి ఆమె ఆరోగ్యం విషయంలో ఏమాత్రం అలసత్వం చూపొద్దు. ఆరోగ్యం విషయంలో అందరూ ఒకటే కావొచ్చు. మహిళలకే కొన్ని ప్రత్యేకమైన సమస్యలు చాలానే ఉన్నాయి. కొద్దిగా జాగ్రత్త వహిస్తే వీటిల్లో చాలా జబ్బులను నివారించుకోవచ్చు. త్వరగా దాడి చేయకుండా, తీవ్రం కాకుండా చూసుకోవచ్చు.

ఇంట్లో ఉండేవారైనా...ఉద్యోగం, వ్యాపారం, ఇతరత్రా పనుల్లో బిజీగా కనిపించే మహిళలు తమ ఇతర కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై పెట్టే శ్రద్ధలో కొంచెమైనా తమ గురించీ, తమ ఆరోగ్యం గురించి పెట్టరు. కుటుంబం మొత్తానికి భోజనాలు, అల్పాహారాలు అందించే వీరు తమ ఆహారం, తమ ఆరోగ్యం గురించి బాగానే ఉందిలే అన్నట్లుగా టేకీ టీజీగా వదిలేస్తుంటారు. చాలాసార్లు ఆడవాళ్లు తాము శారీరక వ్యాయామం చేయకపోవడానికి ఇంటి పనులను సాకుగా చూపుతుంటారు. ఉదయమో, సాయంత్రమో వీలు చూసుకుని నడవటం అలవాటు చేసుకోవాలి. అవకాశం ఉన్నప్పుడు ఇళ్లల్లో యంత్రాలకు బదులుగా శారీరక శ్రమ చేసే పనులు చేస్తే కొంత వ్యాయామం అయినట్లే.

అనారోగ్యాన్ని కొనితెచ్చుకున్నట్లే...

గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలతో పోలిస్తే పట్టణాల్లోని వారు తక్కువగా చురుగ్గా ఉంటున్నారని చాలా నివేదికల ద్వారా తెలుస్తోంది. నగరాల్లో బరువైన పనులు చేయటానికి ఇతరుల సహాయాన్ని తీసుకుంటున్నారు. అందువల్ల మహిళలు చేసే పనిలో మొత్తం శరీరంలో కదలికలు ఉండవు. మొత్తం శరీరావయాలు కదిలితేనే హృదయ స్పందన పెరుగుతుంది. తద్వారానే ఆరోగ్యంగా ఉంటాం. లేదంటే అనారోగ్యాన్ని ఆహ్వానించినట్లే లెక్క. శారీరక వ్యాయామం చేయని ప్రతి నలుగురి ఆడవాళ్లలో ఒకరు అనారోగ్యంగా ఉంటున్నారు.

డబ్ల్యుహెచ్ఒ ప్రకారం...

ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. ప్రపంచంలో ప్రతి నలుగురిలో ఒకరు ఉండాల్సినంత స్థాయిలో చురుగ్గా లేరు. పురుషుల కన్నా మహిళలే తక్కువగా చురుగ్గా ఉంటున్నారు. ఈ నివేదిక ప్రకారం తక్కువ చురుగ్గా ఉండే వారికి గుండెజబ్బులు, మధుమేహ వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువ. కొన్ని రకాల క్యాన్సర్లు కూడా రావొచ్చు. తక్కువ చురుకుదనం ఆలోచనాస్థాయిపై కూడా ప్రభావం చూపుతుంది. మనదేశంలో 43 శాతం మహిళలు, 23.5 పురుషులు చురుగ్గా లేరు. శరీరంలోని ప్రతిభాగం కదలడం, వేగంగా నడవడం, వాటర్ ఎయిరోబిక్స్, సైకిల్ తొక్కడం, టెన్నిస్ ఆడడం లాంటివి శారీరక కార్యకలాపాల కిందికి వస్తాయి. పెద్ద వాళ్లయితే వారానికి కనీసం 150 నిముషాలు వ్యాయామం చేయాలి. అప్పుడే వాళ్లు చురుగ్గా ఉన్నట్లు లెక్క. ఈ వ్యాయామాలతో హృదయ స్పందన, ఉచ్ఛ్వాస నిశ్వాసాల వేగం పెరగడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం జరుగుతుంది. చురుగ్గా ఉన్నామని చెప్పటానికి ఇదే ప్రాతిపదిక. షాపింగ్ చేయడం, వంట చేయడం, ఇంట్లో చేసే చిన్న పనులను శారీరక కార్యకలాపాలుగా పేర్కొనలేము. ఇలాంటి పనుల వల్ల శరీర కదలికలు ఉంటాయి. వేగంగా నడవడం, ఈతకొట్టడం, సైక్లింగ్, టెన్నిస్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ వంటివి కూడా చేయొచ్చు.

ఎంత సేపు వ్యాయామం చేయాలంటే..

5 నుంచి 18 ఏళ్ల వరకు సుమారు 60 నిముషాలు

19 నుంచి 64 ఏళ్ల వరకూ 150 నిముషాలు

65 ఏళ్లకుపైబడిన వారు 150 నిముషాలు, బలం కోసం వారానికి చేస్తే మంచిది.

ఉపయోగాలు ఏమిటంటే...

వ్యాయామం చేయటం ద్వారా గుండెపోటు, గుండెజబ్బులు వచ్చే అవకాశం 35 శాతం తగ్గుతాయి.

టైప్ 2 మధు మేహ వ్యాధి వచ్చే అవకాశాలు తగ్గుతాయి.

రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశం 20 శాతం తగ్గుతాయి

హఠాత్తు మరణాలు 30 శాతం వరకు తగ్గుముఖం

ఎముకలకు సంబంధించిన వ్యాధులు వచ్చే అవకాశం 83 శాతం తగ్గుతుంది

హఠాత్తుగా మరణించే అవకాశాలు 30 శాతం తగ్గుతాయి.

డిప్రెషన్ వచ్చే అవకాశాలు 30 శాతం తగ్గుతాయి

- జీర్ణశక్తి మెరుగుపడటానికి ఇంట్లోనే ఉండే ధనియాలు, శొంఠి కషాయం తయారుచేసుకుని త్రాగొచ్చు.
- మునగాకు కూర, నల్లేరు జ్యూస్, పచ్చడి లాగా చేసుకుని తినటం వల్ల కాల్షియం పెరుగుతుంది.
- బెల్లంతో చేసిన పదార్థాలు రక్తహీనతను తగ్గిస్తాయి.
- ఇంట్లో పాదులు పెట్టుకుని కూరగాయలు, ఆకుకూరలు పండించుకుని డబ్బు ఆదా చేసుకోవచ్చు. ఆరోగ్యం కాపాడుకోవచ్చు.

శ్రమతగ్గితే వచ్చే వ్యాధులు

గుండె జబ్బులు, మధుమేహం

ఊబకాయం, రక్తపోటు, కొలెస్ట్రాల్ సమస్యలు

కండరాల నొప్పులు, తరచుగా వచ్చే సమస్యలు

ఆయుర్వేద వైద్య విధానంలో చెప్పిన దిన, రుతు చర్యలు, ఆహారవిధి, మంచి జీవన విధానాలు పాటించటం ద్వారా ఆయుష్షును పెంచుకోవచ్చు. ఒంటరితనంతో ఉండకుండా తోటిమహిళలు, స్నేహితులు, ఆప్తులు, బంధువులతో కలిసి మెలిసి ఉంటే అనేక ప్రమాదాల నుంచి కాపాడుకోవచ్చు. ధ్యానం, వ్యాయామంతోపాటుగా 6 నుంచి 8 గంటల వరకూ నిద్ర, పోషకాహారం, ఆరోగ్యానికి మంచి చేసే అలవాట్లు పాటిస్తే మంచి ఆరోగ్యం సొంతమవుతుంది. ప్రత్యేకంగా మహిళల రక్షణ కోసం, ఆడశిశువు గర్భంలో ఉన్నప్పుడు కాబోయే తల్లి తన బిడ్డ రక్షణ కోసం పాటించాల్సిన గర్భ సంస్కార విధి ఆయుర్వేద శాస్త్రంలో గొప్పగా చెప్పబడింది.

నెలసరి సమస్యలు : నెలసరి సమయంలో సమస్యలుంటే తప్పకుండా డాక్టర్ సలహా పాటించి వైద్యం చేయించుకోవాలి. వ్యక్తిగత జీవితంలో సమస్యలుగా తేలికగా కొట్టి పారేయకుండా తగిన సహాయం పొందాలి.

రక్త హీనత : చాలామంది ఈ సమస్యతో ఇబ్బందిపడుతుంటారు. ఈ సమస్య ఉంటే నీరసం, అలసట, తలనొప్పి, రోగనిరోధకశక్తి తగ్గటం, గుండెపోట్లు వంటి సమస్యలు వస్తాయి. ప్రతిరోజూ ఆకుకూర తీసుకోవటం, పోలిక్ యాసిడ్ మాత్రలు వాడటం ద్వారా మెరుగుపర్చుకోవచ్చు.

ఊబకాయం : శారీరక శ్రమ లేకపోవటంతో ఒబేసిటీ సమస్యలు వస్తున్నాయి. మధుమేహం, పీసీఓడీ, థైరాయిడ్‌తోపాటు హార్మోన్ల సమస్యలు వస్తాయి. తగిన బరువు ఉండేలానూ, మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవటం ద్వారా ఈ సమస్య నుంచి బయట పడొచ్చు.

అస్టిపోరాసిస్ : ఇది మహిళలకు ఎక్కువగా వస్తుంది. విటమిన్ డి లేకపోవటం వల్లనే ఈ సమస్య వస్తుంది. అందువల్ల ప్రతిరోజూ ఉదయం పూట కనీసం అరగంట సేపైనా ఎండలో ఉండాలి. లేదంటే విటమిన్ డి మాత్రలు వారానికి ఒకటి, కాల్షియం మాత్రలు తీసుకోవాలి.

పీసీఓడీ : అండకోశంలో నీటిబుడగలు ఎక్కువగా ఉంటాయి. ఈస్ట్రోజన్ హార్మోన్ ఎక్కువగా విడుదల కావటంతో అనేక సమస్యలొస్తాయి.ప్రకృతిపరంగా లభించే పండ్లు ఎక్కువగా తీసుకోవటం వల్ల ఈ సమస్యను అధిగమించొచ్చు.

క్యాన్సర్లు : నడివయస్సు దాటిని తర్వాత రొమ్ము, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ భారిన మహిళలు పడుతున్నారు. వ్యాక్సిన్లు వేసుకోవటం ద్వారా రాకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు.



– డాక్టర్ కోలా విజయకుమారి,
ఎండి ఆయుర్వేదం,
ప్రసూతి స్త్రీ రోగ విభాగం అధిపతి,
డాక్టర్ ఆచంట లక్ష్మీపతి
ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి,
డాక్టర్ నోరి రామశాస్త్రి,
వైస్ ప్రిన్సిపాల్ ఆయుర్వేద కళాశాల,
విజయవాడ.

లేడీ గెటప్పులు... బ్లాక్‌బస్టర్ హిట్లు



సినిమాల్లో మాస్, ప్రేమ, వినోదం మేళవింపుతో సరికొత్త ఉత్సాహాన్ని నింపేందుకు దర్శకులు నిరంతరం తాపత్రయపడుతూనే ఉంటున్నారు. ఓ సినిమా ప్రేక్షకుడికి నచ్చాలంటే 60కి 60 సన్నివేశాలూ నచ్చేయాలని కాదు. కనీసం కొన్నయినా మెచ్చుకునే రీతిలో ఉంటుందనే భావన ఉంది. ప్రతి సన్నివేశం కొత్తగా ఉండాలనేది కాదు. రెండున్నర గంటలు హాయిగా గడిచిపోతే చాలు అన్నట్లుగా సాగుతుంది. చిత్రసీమకు సరికొత్త ఉత్సాహాన్ని అందించిన విజయాలు, కొత్తదారిలో నడించేందుకు చేసిన ప్రయత్నాలు, మార్కెట్‌కు ఎదురొడ్డి చేసిన ప్రయోగాలు, బాక్సాఫీసు దగ్గర బోల్తా పడుతున్న ఉదంతాలు కూడా ఉంటున్నాయి. చిన్న, పెద్ద సినిమా అనే వ్యత్యాసం ప్రేక్షకుల్లో ఉండటం లేదు. ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా ఉంటేనే ఆదరిస్తున్నారు. వినోదం, యాక్షన్ హంగామా, మాస్ మసాలా, పౌరాణికం, పోరాటం, జానపదం, గ్రాఫిక్స్ మాయాజాలం ఏం తీసినా



ప్రేక్షకులు చూస్తారు. కానీ అంతిమంగా నచ్చితేనే ఆదరిస్తారు. అందుకోసమే ప్రేక్షకులు ఆదరించే పాత్రల వైపు దర్శకులు, కథానాయకులు కూడా చూస్తున్నారు. అలాంటి చిత్రాలకే పెట్టుబడులు పెట్టేందుకు నిర్మాతలు కూడా ముందుకొస్తున్నారు. ఇలాంటి తరహాలో గతంలోనూ, నేడూ కొనసాగుతున్న ట్రెండ్ కథానాయకుల 'లేడీ' గెటప్‌లతో వచ్చిన చిత్రాలు.

రెండు దశాబ్ధాల తర్వాత మళ్లీ...

విభిన్న పాత్రల్లో నటించాలని ప్రతి నటుడికీ ఉంటుంది. ఆ కోవలోనే భామనే సత్యభామనే, మేడం, చిత్రం భళారే విచిత్రం, రెమో తదితర సినిమాల్లో కథానాయకులు ఆడవారి వేషంలో నటించి మెప్పించారు. ఇవన్నీ దాదాపుగా రెండు దశాబ్దాల క్రితం వచ్చిన సినిమాలే. కొత్తగా అల్లు అర్జున్ పుష్ప 2లో లేడీ గెటప్‌లో పాటలో నర్తించి, ఫైటింగ్‌తో అలరించారు. ఆ తర్వాత ఈనెల 14న విడుదలైన సినిమా 'లైలా'లోనూ కథానాయకుడు విశ్వక్‌సేన్ ద్విపాత్రాభినయం చేశారు. ఇందులో లేడీ గెటప్‌లో అచ్చం అమ్మాయిలాగానే కనిపించారు. లైలా క్యారెక్టర్‌లో చీర కట్టుకుని, హైహీల్స్ చెప్పులేసుకుని భారీ ఫైట్ చేసేశారు.

హీరోలు చేయటం సాహసమే...

క్యారెక్టర్ ఆర్టిస్టులు ఇలాంటి రోల్స్ ప్లే చేయటం సాధారణమే కానీ హీరో చేయటమే సాహసం. చిరంజీవి, రజనీకాంత్, అమితాబ్‌బచ్చన్ తదితర అగ్రకథానాయకులు ఈ ప్రయోగం చేసి విజయాలను సైతం అందుకున్నారు. వీరు అచ్చం అమ్మాయిలా కనిపించారు. ఆ తరహా మేకప్పులు వేసుకున్నారు. వెంకటేష్, అల్లరి నరేష్ వంటి లాంటివారు మీసం తీయకుండానే అమ్మాయి వేషధారణలో కనిపించి నవ్వులు పూయించారు. కొందరు కేవలం పాటల్లోనే నటించిన సినిమాలు కూడా కొన్ని ఉన్నాయి.

'చంటబ్బాయ్' సినిమాలో 'నేనో ప్రేమ పూజారి' పాటలో కథానాయిక సుహాసినిని ప్రభావితం చేయటానికి పలు వేషాలు వేయగా అమ్మాయి గెటప్ కూడా ఒకటి. తనకున్న ఇమేజ్‌కు భిన్నంగా చిరంజీవి చేసిన ఈప్రయత్నం బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకోవటమే కాకుండా ఆయన కెరీర్‌లోని కల్ట్ క్లాసికల్ చిత్రంగానూ నిలిచింది. లేడీ గెటప్‌లో గౌనుతో తలపై టోపీ పెట్టుకుని తళుక్కున మెరిశారు.

సీనియర్ నరేష్ నటించిన చిత్రం భళారే విచిత్రం అనూహ్య విజయాన్ని సాధించింది. సరిగ్గా 34 ఏళ్ల క్రితం విడుదలైన ఈ సినిమా నేటికీ గిలిగింతలు పెట్టే చిత్రాల్లో ఒకటి. ఆద్యంతం నవ్వులు పూయిస్తూ ఈ సినిమా సాగుతుంది. పెళ్లికాని కుర్రాళ్లకు ఎవ్వరూ అద్దెకు ఇల్లు ఇవ్వని పరిస్థితుల్లో ఓ అబ్బాయి అమ్మాయిగా వేషం వేసుకొని తన మిత్రులకు కూడా వేషం వేయించి ఓ ఇంట్లో అద్దెకు దిగటం ఈ చిత్రంలోని అసలు అంశం. దాని చుట్టూ సాగిన నవ్వుల యాత్ర నిజంగానే 'చిత్రం భళారే విచిత్రం' అనిపించకమానదు. దానవీర శూరకర్ణ సినిమాలో దుర్యోధనుడికి, భానుమతికి మధ్య సాగే యుగళగీతంలోని పల్లవి 'చిత్రం భళారే విచిత్రం'ను టైటిల్ పెట్టారు. నరేష్ లేడీ గెటప్‌లో అచ్చు వాళ్లమ్మ విజయనిర్మలను తలపించాడని పలువురు ప్రశంసించారు. చిత్రం భళారే విచిత్రం, జంబలకడి పంబ సినిమాల్లో నరేష్ చేసిన కామెడీకి పొట్ట చెక్కలవ్వాల్సిందే.

పాండురంగడు సినిమాలో నందమూరి బాలకృష్ణ కొన్ని సెకన్లపాటు అమృత అనే పాత్రలోకి ప్రవేశిస్తారు. టాప్‌హీరో చిత్రంలోనూ ఆయన మహిళగా కనిపించి ఓ పాత్రను మాయచేస్తారు. వాసు, బాడీగార్డ్ చిత్రాల్లో వెంకటేష్, గంగోత్రిలో అల్లు అర్జున్ పాండవులు పాండవులు తుమ్మెదలో మంచు మనోజ్ ఆడ వేషంలో ఆకట్టుకున్నారు. మేడమ్‌లో రాజేంద్రప్రసాద్, కితకితలులో అల్లరి నరేష్ అమ్మాయి వేషంలో నటించి ప్రేక్షకుల మన్ననలు పొందారు. అన్నర్వ మక్కళులో కన్నడ నటుడు శివరాజ్‌కుమార్, భామనే సత్యభామనేలో కమల్‌హాసన్, పనక్కరణ్‌లోని ఓ పాటలో తమిళ కథానాయకుడు రజనీకాంత్, అయన్ (వీడొక్కడే)లోని ఓ పాటలో సూర్య, ప్రియమనవలేలో విజయ్, మల్లన్నలో విక్రమ్, వాడేవీడులో విశాల్, రెమోలో శివకార్తికేయన్ మహిళా వేషాల్లో నటించి ప్రేక్షకులను అలరించారు. అప్పట్లో మేడమ్ సినిమాలో రాజేంద్రప్రసాద్ నటనకు అంతా ఫిదా అయిపోయారు. అలాగే వివాహ భోజనంబు, ఆల్‌రౌండర్ లాంటి చిత్రాల్లో కూడా లేడీ గెటప్స్‌లో అలరించారు. ఏమో గుర్రం ఎగురావచ్చు సినిమాలో చీరకట్టులో వయ్యారాలు ఒలికించాడు సుమంత్. ఆయన నటన కూడా అలరించింది. అల్లు అర్జున్ హీరోగా నటించిన తొలి సినిమా గంగోత్రిలోనే ఓ పాట అంతా లేడీ గెటప్‌లోనే కనిపించాడు. మామయ్యది మొగల్తూరు మా నాన్నది పాలకొల్లు అంటూ సునీల్‌తో డ్యూయెట్ చేశారు.

లావరిస్‌లోని ఓ పాటలో అమితాబ్‌బచ్చన్, జానేమన్‌లో సల్మాన్‌ఖాన్, డూప్లికేట్‌లో షారుక్‌ఖాన్, బాజిలోని ఓ పాటలో అమిర్‌ఖాన్, హమ్‌షకల్స్‌లో సైఫ్ అలీఖాన్, ఖిలాడిలో అక్షయ్‌కుమార్, అప్నా సప్నా మనీమనీలో రితేష్ దేశ్‌ముఖ్, ఆంటీ నంబరు 1లో గోవింద, డ్రీమ్‌గర్ల్ 2లో ఆయుష్మాన్ ఖురానా మహిళగా ఒదిగిపోయారు.



షెడ్యూల్ వచ్చేసింది

ఈడెన్ గార్డెన్స్‌లో ఐపిఎల్ తొలి, ఫైనల్ మ్యాచ్

క్వాలిఫయర్1, ఎలిమినేటర్‌కు హైదరాబాద్ ఆతిథ్యం

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 షెడ్యూల్ విడుదల

అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025 షెడ్యూల్ వచ్చేసింది. 74 మ్యాచులు, 65 రోజుల పాటు అలరించేందుకు మార్చి 22న ఐపిఎల్ అభిమానుల ముందుకు రానుంది. సీజన్ తొలి, ఫైనల్ మ్యాచ్‌కు ఈడెన్‌గార్డెన్స్ వేదిక కానుండగా..

క్వాలిఫయర్ 1, ఎలిమినేటర్ మ్యాచులకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనుంది.



ప్రజాశక్తి-హైదరాబాద్ : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కత నైట్‌రెడర్స్ సొంత మైదానం ఈడెన్‌గార్డెన్స్ 2025 సీజన్ తొలి, ఫైనల్ మ్యాచులకు ఆతిథ్యం ఇవ్వనుండగా, గత సీజన్ రన్నరప్ సన్‌రైజర్స్ హైదరాబాద్ సొంత మైదానం ఉప్పల్ స్టేడియం క్వాలిఫయర్ 1, ఎలిమినేటర్‌లకు వేదిక కానుంది. 2025 ఐపీఎల్ ఆరంభ మ్యాచ్ మార్చి 22న జరుగనుండగా, టైటిల్ పోరు మే 25న షెడ్యూల్ చేశారు. ఈ మేరకు ఐపిఎల్ షెడ్యూల్‌ను లీగ్ నిర్వాహకులు ఆదివారం విడుదల చేశారు. 2013, 2015లో ఐపిఎల్ ఫైనల్స్‌కు వేదికగా నిలిచిన కోల్‌కత ఈడెన్ గార్డెన్స్ సుమారు దశాబ్దం తర్వాత మళ్లీ ఐపీఎల్ అంతిమ సమరానికి వేదిక కానుంది.

పది జట్లు, రెండు గ్రూప్‌లు : ఐపీఎల్ 2025 టైటిల్ వేటలో పది జట్లు నిలిచాయి. పది జట్లను సీడింగ్ ప్రకారం రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్-ఏలో కోల్‌కత నైట్‌రైడర్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూర్, రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్‌కింగ్స్, పంజాబ్ కింగ్స్ ఉండగా.. గ్రూప్-బిలో సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్, ముంబయి ఇండియన్స్, లక్నో సూపర్ జెయింట్స్ నిలిచాయి. ప్రతి జట్టు సొంత గ్రూప్‌లోని ఇతర నాలుగు జట్లతో, ఆవల గ్రూప్‌లోని సమాన సీడింగ్ కలిగిన జట్టుతో రెండేసి మ్యాచులు ఆడనుంది. దీనికి తోడు ఆవల గ్రూప్‌లోని ఇతర నాలుగు జట్లతో ఒక్కోసారి తలపడనుంది. అంతిమంగా, ప్రతి జట్టు లీగ్ దశలో 14 మ్యాచులు ఆడుతుంది. లీగ్ దశ సహా ప్లే ఆఫ్స్‌తో కలిసి 74 మ్యాచులు షెడ్యూల్ చేశారు. ఓవరాల్‌గా పాయింట్ల పట్టికలో టాప్-4లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి.

హైదరాబాద్‌లో ప్లే ఆఫ్స్ : ఐపిఎల్‌లో ఈ సీజన్‌లో హైదరాబాద్ ఏడు లీగ్ దశ మ్యాచులు సహా రెండు కీలక ప్లే ఆఫ్స్ మ్యాచులకు ఆతిథ్యం ఇవ్వనుంది. మార్చి 22న కోల్‌కతలో ఆరంభ మ్యాచ్ ఉండగా.. తర్వాతి రోజు లీగ్‌లో రెండో మ్యాచ్ హైదరాబాద్‌లో జరుగనుంది. రాజస్థాన్ రాయల్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో తలపడనుంది. సొంత మైదానంలో రాజస్థాన్ రాయల్స్ సహా లక్నో సూపర్‌జెయింట్స్ (మార్చి 27), గుజరాత్ జెయింట్స్ (ఏప్రిల్ 6), పంజాబ్ కింగ్స్ (ఏప్రిల్ 12), ముంబయి ఇండియన్స్ (ఏప్రిల్ 23), ఢిల్లీ క్యాపిటల్స్ (మే 5), కోల్‌కత నైట్‌రైడర్స్ (మే 10)తో సన్‌రైజర్స్ తలపడనుంది. చెన్నై సూపర్‌కింగ్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ మరో గ్రూప్‌లో ఉండగా ఈసారి గ్రూప్ దశలో ఆ జట్లతో ఒక్కసారి మాత్రమే ఆడనుండగా.. ఆ రెండు మ్యాచులను సైతం బెంగళూర్, చెన్నైలో షెడ్యూల్ చేశారు. ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించిన నాలుగు జట్లు కచ్చితంగా హైదరాబాద్‌లో ఓ మ్యాచ్ ఆడనున్నాయి. క్వాలిఫయర్ 1, ఎలిమినేటర్ మ్యాచులు ఉప్పల్‌లో జరుగనున్నాయి. దీంతో చెన్నై సూపర్‌కింగ్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌లు ప్లే ఆఫ్స్‌కు చేరుకుంటే.. ఈ సీజన్లోనూ విరాట్ కోహ్లి, ఎం.ఎస్ ధోని మెరుపులను ఉప్పల్ స్టేడియంలో వీక్షించవచ్చు.

13 స్టేడియాల్లో.. :

ఐపిఎల్ మ్యాచులు ఈ సీజన్‌లో ఏకంగా 13 స్టేడియాల్లో జరుగనుంది. సంప్రదాయ పది స్టేడియాలకు తోడు ఈసారి మరో మూడు స్టేడియాలు అదనంగా తోడయ్యాయి. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు రెండో సొంత మైదానంగా విశాఖపట్నంను ఎంచుకుంది. పంజాబ్ కింగ్స్ రెండో సొంత మైదానంగా ధర్మశాలను ఎంచుకోగా.. గువహటిని రాజస్థాన్ రాయల్స్ రెండో సొంత మైదానంగా ఎంచుకుంది. ధర్మశాలలో పంజాబ్ కింగ్స్ వరుసగా మూడు మ్యాచులు (మే 4-11) ఆడనుంది. ఢిల్లీ క్యాపిటల్స్, ముంబయి ఇండియన్స్, లక్నో సూపర్‌జెయింట్స్‌తో వరుస మ్యాచుల్లో ఆడనుంది. మరో జట్టు సైతం వరుసగా సొంత గడ్డపై మూడు మ్యాచులు ఆడటం లేదు. విశాఖపట్నంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, లక్నో సూపర్‌జెయింట్స్‌తో ఢిల్లీ క్యాపిటల్స్ ఆడనుంది. గువహటిలో రాయల్స్ సైతం రెండు మ్యాచులు ఆడనుంది. ఈ సీజన్‌లో 74 మ్యాచులను 65 రోజుల్లో షెడ్యూల్ చేయగా.. అందులో 12 డబుల్ హెడర్స్ ఉన్నాయి. రాజస్థాన్ రాయల్స్, ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్‌జెయింట్స్, గుజరాత్ టైటాన్స్‌లు మూడేసి మధ్యాహ్నం మ్యాచులు ఆడనుండగా.. ఇతర ఏడు జట్లు రెండేసి మ్యాచులు ఆడనున్నాయి. రాత్రి మ్యాచులు 7.30 గంటలకు, మధ్యాహ్నం మ్యాచులు 3.30 గంటలకు ఆరంభం అవుతాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68